ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kakinada, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-1-2025 ఆదివారం సంపుటి: 30 సంచిక: 345 పేజీలు: 10+4 వెల: 8.00



అల్లు అర్జున్‌కు ఊరట: పిఎస్‌కు హాజరుపై మినహాయింపు 3

ఎన్నికల వేళ.. ఆప్‌కు 'కాగ్' షాక్ 5


# సరదాకు మునిగి.. శవాలై తేలి!



మృతదేహాలు వెలికి తీస్తున్న పోలీసులు



జతిన్



సాహిల్



దినేశ్వర్



ధనుష్



లోహిత్

## కొండపోచమ్మ సాగర్‌లో ఐదుగురు యువకులు మృత్యువాత

### ఇద్దరికి తప్పిన ప్రమాదం

### వారంతా హైదరాబాద్ వాసులే

### సంక్రాంతి పండుగ ముందు తీవ్రవిషాదం

**మర్కుక్ / ములుగు, జనవరి 11 (ప్రభాతవార్త):** వారంతా స్నేహితులు... రెండవ శనివారం కావడంతో అందరూ కలిసి కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుకు బైక్‌లపై బయలుదేరి వచ్చారు. ప్రాజెక్టు నీటిలోకి దిగి సెల్ఫీ ఫోటోలు తీసుకుంటూ కొద్దిసేపు ఆనందంగా గడిపారు. ఇంతలోపే ఒకరి వెనుక ఒకరు నీటిలో మునిగిపోతుండగా కాపాడడానికి ప్రయత్నం చేసిన ఐదుగురు నీటిలో గల్లంతయ్యారు. సిద్ధిపేట సిపి అనురాధ, ఏసిపి పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ రూరల్ సిఐ

>>2

# గ్రీన్ ఎనర్జీకి భారీ రాయితీలు

### పదేళ్లలో 20 వేల మె.వా పునరుత్పాదక విద్యుత్తు, 1.14 లక్షల ఉద్యోగావకాశాలు

### క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025ను విడుదల చేసిన సిఎం రేవంత్

### పవన విద్యుదుత్పత్తికి కూడా మరిన్ని చర్యలు



శనివారం గ్రీన్‌ఎనర్జీ పాలసీని ఆవిష్కరించిన సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి11:** గ్రీన్ ఎనర్జీ ఉత్పాదకతను పెంచి భవిష్యత్తు అవసరాలకు సరిపడే విద్యుత్తును సమకూర్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 'క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025'ని రూపొందించింది. శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ గ్రీన్‌ఎనర్జీ పాలసీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు సామర్థం అదనంగా సమకూర్చుకోవాలనేది కొత్త పాలసీ లక్ష్యం. కొత్త గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో

>>2


హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు అధ్యయనం: సిఎం 7


# అంతా సొంతూళ్లకే..



శనివారం జూబ్లీ బస్టాండ్‌లో రద్దీ దృశ్యం



పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వందలాది వాహనాలు

## పల్లెబాట పడుతున్న పట్నవాసులు

### సంక్రాంతి రద్దీతో కిటకిటలాడుతున్న బస్‌స్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు

### విజయవాడ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండగ సందడి మొదలవడంతో నగర వాసులు పల్లెబాట పట్టారు. హైదరాబాద్‌తో పాటు శివార్లలోని లక్షలాది మంది ప్రజలు సొంత ఊళ్లకు బయలుదేరడంతో బస్ స్టేషన్లు,రైల్వే స్టేషన్లలో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. వచ్చే మంగళవారం నాడు సంక్రాంతి పండగ కావడంతో మూడు రోజుల ముందు నుంచే పట్నం వాసులు పల్లెబాట పట్టగా దీనివల్ల బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో రద్దీ పెరిగి క్రిక్కిరిసి పోయాయి. సంక్రాంతి ప ండగకు ఊళ్లకు వెళ్లే వారు ఎక్కువగా వుండడంతో ఇదే అదనుగా ప్రైవేటు ట్రావెల్స్ సాధారణ ఛార్జీలకంటే అధికంగా ఛార్జీలు వసూలు చేయసాగాయి. మరోవైపు హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లేవారు తమ ఇళ్లకు జాగ్రత్తగా తాళాలు వేయాలని, అక్కడి గస్తీ పోలీసులతో పాటు స్థానిక సంక్షేమ సంఘల నేతలకు సమాచారం ఇవ్వాలని ఆయా ప్రాంతాల పోలీసులు కోరసాగారు. పండగవేళ ఖాళీ అయిన కాలనీలు, బస్తీలలో ఆయా ప్రాంతాల పోలీసులు గస్తీని పెంచారు.

తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమైన పండగల్లో సంక్రాంతి ఒకటనేది తెలిసిందే. ఈ పండగకు నగరంలో వుండే లక్షలాది మంది ప్రజలు తమ సొంత ఊళ్లకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుండడం విదితమే. ఈ ఏడాది సంక్రాంతి పండగకు మంగళవారం నాడు వస్తుండడం, రెండు రోజులు ముందుగా ఆదివారం వస్తుండడంతో శనివారం నాడే ప్రజలు సొంత ఊళ్లకు పయనమవ్వసాగారు. గ్రేటర్ హైదరాబాద్ నుంచే తెలుగు రాష్ట్రాలకు 40 నుంచి 45 లక్షల మందికి పైగా ప్రజలు పల్లెలకు తరలి వెళతా రని అంచనా. గ్రేటర్ హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లేవారిలో 80 శాతం మంది ఎపికి చెందిన వారు కాగా 20శాతం మంది తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు గా గణాంకాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో

>>2

# 'గేమ్ ఛేంజర్' టిక్కెట్ల నిర్ణయం వెనక్కి

## ధరల పెంపును ఉపసంహరించిన సర్కార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** గేమ్‌ఛేంజర్ టికెట్ల ధరలపై తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో రేవంత్‌రెడ్డి సర్కారు వెనక్కి తగ్గింది. గేమ్ ఛేంజర్ టికెట్ల ధరలపెంపునకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. గేమ్ ఛేంజర్‌కు ఇచ్చిన వెసులుబాటును ఉపసంహరించుకుంటున్నట్లు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో టికెట్ల ధరలతోపాటు అదనపుషోలకు ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది. తెలంగాణలో ఇకపై తెల్లవారు జామున స్పెషల్ షోలకు అనుమతి లేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా స్పెషల్ షోలకు అనుమతి ఇవ్వబోమని పేర్కొంది. కాగా, పుష్ప2 తర్వాత ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇకపై తెలంగాణలో టికెట్ల ధరల పెంపుతో పాటు బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని ప్రకటించారు. ఇటీవల గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీకి ప్రభుత్వం టికెట్ల ధరలతో పాటు అదనపుషోలకు అనుమతి ఇచ్చింది. టికెట్ల ధరలు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ భరత్‌రాజ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన కోర్టు.. సినిమాకు బెనిఫిట్ షోలు అనుమతినివ్వడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దని చెప్పి మళ్లీ ప్రభుత్వమే అనుమతి ఇవ్వడం ఏంటి అని ప్రశ్నించింది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ షోలకు అనుమతించొద్దని స్పష్టం చేసింది. నిర్మాతలు భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి అన్యాయంగా వసులు చేయడం సరికాదని..అలాగే అర్ధరాత్రి 1 గంటల తర్వాత సినిమా

>>2








# 27న రానున్న ఖర్గే, రాహుల్

### సంవిధాన్ బచావో ప్రదర్శనకు హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే (ఎఐసిసిఅధ్యక్షుడు), రాహుల్‌గాంధీ (లోక్‌సభలో విపక్ష నేత) ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, ఈనెల (జనవరి) 26న ర్యాలీలునిర్వహించాలని, అదే రోజు నుంచి 2026 జనవరి 26 వరకు కాంగ్రెస్

>>2


కార్చిచ్చులో బుగ్గిపాలైన వెయ్యికోట్ల భవనం 5


# అంతర్జాతీయ పతంగుల పండుగకు రెడీ

### రేపటి నుంచి మూడు రోజులు సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో భారీగా నిర్వహణ

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ సిద్ధమవుతున్నది. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 13, 14, 15వ తేదిలలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 7వ అంతరాజతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా బేగంపేట్ హరిత ప్లాజాలో పర్యాటక, సాంస్కృతిక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటర్నేషన్ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అంతకుముందు స్వీట్ స్టాల్స్‌ను మంత్రి సందర్శించి, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన సాంప్రదాయ మిఠాయిల రుచి చూశారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని అన్నారు. హైదరాబాద్ ఒక మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా కాస్మోపాలిటన్ సిటీలో స్థిరపడ్డారని వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ప్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగుర వేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు.

తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, వారసత్వ కట్టడాలు, ప్రాచీన దేవాలయాలను సందర్శించాలని కోరారు. తెలంగాణ టూరిజం శాఖ అందుకు తోడ్పాటును అందిస్తుందని అన్నారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆ ప్రాంత చరిత్ర సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవడం పాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరని, అదే తెలంగాణ ప్రత్యేకతని అన్నారు. కైట్ ఫెస్టివల్ లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కైట్ ఫెస్టివల్‌కు మూడు రోజుల్లో 15 లక్షల మంది వస్తారని అంచనా ఉంది. ప్రదర్శన తిలకించటానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జిహెచ్‌ఎంసి, పోలీసు, ఇతర శాఖల

>>2



శనివారం స్వర్గీయ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్, తదితరులు

# ఒక్క మేనేజ్‌మెంటు సీటు భర్తీ కాని 10 ఇంజినీరింగ్ కాలేజీలు

## కన్వీనర్ కోటాలో కూడా 10 లోపే సీట్ల భర్తీ

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 11న చేపట్టిన ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌తో ముగిసింది. ఆతరువాత రాష్ట్రంలోని 154 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంటన కోటా సీట్లను భర్తీ చేయడం కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్‌ను సెప్టెంబర్‌లో జారీ చేసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ కోసం వివిధ పత్రికల్లో నోటిఫికేషన్‌ను జారీ చేసి.. అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ప్రైవేటు కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా సీట్లను భర్తీ చేసిన అనంతరం వాటిని ఉన్నత విద్యా మండలి నుంచి ర్యాటిఫికేషన్(అనుమతి)ను తీసుకోవల్సి ఉంటుంది. రాష్ట్రంలో మొత్తం ఇంజనీరింగ్ కాలేజీల్లో 1.08 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 154 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సుమారు 36 వేల వరకు మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉంటాయి. అయితే వాటిల్లో సుమారు 6 వేల వరకు సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 10 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒక్క మేనేజ్‌మెంట్ కోటా సీటు కూడా భర్తీ కాలేదు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ కాని కాలేజీలు ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్టుగా తెలుస్తోంది. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలో ఎక్కువ సీట్లు భర్తీ అయినప్పటికీ.. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ కావడం లేదు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అయితే కన్వీనర్ కోటాలో సీట్లు కూడా భర్తీ కానటువంటి పరిస్థితి నెలకొంది. కన్వీనర్ కోటాలో సీట్లలో కొన్ని బ్రాంచ్‌ల్లో కేవలం 10 సీట్ల వరకే చేరినట్టు తెలుస్తోంది. మెకానికల్, సివిల్, ఈఈఈ బ్రాంచ్‌ల్లో చాలా సీట్లు ఇటు కన్వీనర్ కోటాతోపాటు మేనేజ్‌మెంట్ కోటా లోనూ భర్తీ కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కోర్సుల్లో సైతం సీట్లు భర్తీ కావడం లేదు. అయితే ప్రస్తుతం ఉన్నత విద్యా మండలి ర్యాటిఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్న నేపథ్యంలో మేనేజ్‌మెంట్ కోటా గురించి కాకుండా.. కన్వీనర్ కోటాలో తక్కువ సీట్లు చేరిన కాలేజీలపై దృష్టి పెట్టింది.10 మంది.. ఆ లోపు చేరిన బ్రాంచ్‌లను ఆయా కాలేజీలు కొనసాగిస్తాయా? లేకపోతే ఇతర కాలేజీల్లోకి పంపించడానికి సుముఖత చూపుతాయా? అనేది ఆసక్తికరంగా మారింది. తక్కువ మంది విద్యార్థులు చేరినప్పటికీ కోర్సులను కొనసాగిస్తూ వారికి పాఠాలుబోధిస్తామంటే.. వాటిని కొనసాగించేలా చర్యలుతీసుకోవడం.. లేదంటే ఇతర కాలేజీల్లోకి ఆయా విద్యార్థులను మార్చడం ఉన్నత విద్యా మండలి చేయాల్సి ఉంటుంది.అయితే నిర్ణయంకాలేజీ యాజమాన్యాలపైఉంటుంది.కాలేజీలుతీసుకునే నిర్ణయంపై ఉన్నత విద్యా మండలి వ్యవహారశైలి ఆధారపడనుంది.

# స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు

## సిఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి11:** బీసీల రిజర్వేషన్లను 20 శాతం నుండి 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీఎం ఏ రేవంత్ రెడ్డికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు.కులగణనలో బీసీల లెక్కలు తేలిన తర్వాత కూడా రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఈ ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచినట్టయితే పంచాయతీ సభ్యులుగా, సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, ఎంపీపీలుగా జడ్పీటీసీలుగా, జడ్పీ చైర్మన్లుగా బీసీలు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీ సమావేశాలను నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని సిఎంకు సూచించారు.

# నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లు ఉండాలి

## అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** ఈనెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికాయిలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్‌లలో పలు మార్పులు, చేర్పులను సిఎం సూచించారు.

అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండా లని సీఎం స్పష్టం చేశారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్‌లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందు చూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో పతంగుల పండుగను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# పతంగుల పండుగకు రెడీ

>> అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ప్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీల ఒత్తిడికి తలొగ్గి మద్యం ధరలు పెంచే ప్రసక్తే లేదు

## మద్యం సరఫరా కంపెనీల ఎంపికలో పారదర్శకత పాటించాలి: ఎక్సైజ్ శాఖపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి11:** రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఇప్పటికే టీజీబీసీఎల్‌కు సరఫరా చేస్తున్న కంపెనీలు కొత్త బ్రాండ్ల సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని చెప్పారు.ఎక్సైజ్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని అప్రమత్తం చేశారు. కొత్త కంపెనీల నుంచి అప్లికేషన్లకు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజులు నిర్ణీత గడువు ఇవ్వాలని ఆదేశించారు.ఆ కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సిఎం ఘాటుగా స్పందించారు. లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని,మద్యం ధరలు పెంచే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్ర తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. గత ఏడాదిగా ఎక్సైజ్ శాఖకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు క్రమంగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్ పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 12-01-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
త్రయోదశి ఉ.6.34, చతుర్దశి తె.5.03
మృగశిర ఉ.11.24
వర్జ్యం : రా.7.31-9.04
దు.ఉ.సా.4.25-5.10
శుభసమయం: ఉ.7.00-8.00,
సా.6.00-6.40
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** మానవతా దృక్పథంతో శక్తికి మించి ఒకరికి సహాయం చేస్తారు. కుటుంబసభ్యుల సహాయం అందుతుంది.

**వృషభం :** జీవితం మూసపోసినా విధంగా సాగుతోందని భావిస్తారు. ఋణవత్తిడుల నుండి బయటపడతారు.

**మిథునం:** భూవివాదంలో కుటుంబ సమస్యలు పరిష్కారం కాగలవు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

**కర్కాటకం :** సన్నిహితులు, సోదరులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. విలువైన వస్తువులు సేకరణ.

**సింహం:** దూరపు బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వాహనాల విషయంలో మెలకువ అవసరం.

**కన్య :** కుటుంబ, ఆరోగ్య సమస్యలు కొంత ఉపశమిస్తాయి. ఆలోచనలు కార్యరూపం ఇస్తారు.

**తుల :** ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు.

**వృశ్చికం:**గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సోదరుల నుండి ధనలాభం.

**ధనుస్సు:** నూతన ఒప్పందాలు చేసుకోగలుగుతారు. సంతృప్తికరమైన ఫలితాలను సాధించలేకపోతారు.

**మకరం:** ఎదుటివారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురిచేస్తుంది.

**కుంభం:** ఊహించని సమస్యలు తప్పకపోవచ్చు. కీలక నిర్ణయాలలో ముఖ్యులు సలహాలు పాటిస్తారు.

**మీనం :** వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 19న విచారణకు రానున్న జస్టిస్ ఘోష్

## ఈటల రాజేందర్, హరీష్‌రావును విచారణకు పిలిచే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి11:** కాళేశ్వరం బ్యారేజ్‌లపై జస్టిస్ పీసీ ఘోష్ చేపట్టిన విచారణ తుది దశకు చేరుకుంది. తొలుత అధికారులను విచారించిన న్యాయవిచారణ కమిటీ, ఆ తర్వాత పైస్థాయి అధికారులు, ఇంజనీర్లు.. ఐఏఎస్‌ల వాంగ్మూలాలు తీసుకుంది. ఇప్పుడు రాజకీయ నేతల వంతైంది.

ఈ మేరకు ఈనెల 19న జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు గత ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, హరీష్ రావులను విచారణకు పిలిచే అవకాశ మున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మించిన కంపెనీ ప్రతినిధులు, ఇంజనీర్లు, అధికారుల నుంచి సేకరించిన సమాచారాన్ని దగ్గరపెట్టి మాజీ మంత్రులను విచారించనుంది.

వీరి తర్వాత మాజీ సీఎం కేసీఆర్ వంతు కానుందని సమాచారం. మొత్తం అందరి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా పీసీ ఘోష్ విచారణ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఆ తర్వాత రేవంత్ సర్కార్ దాన్ని అసెంబ్లీలో పెట్టి చర్చించనుంది. ఆ తర్వాత నేతలు, అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సభకు వదిలేయాలని నిర్ణయించినట్టు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విచారణకు సంబంధించి తొలుత కన్‌స్ట్రక్షన్, డిజైన్స్, క్వాలిటీ పర్యవేక్షణ, అకౌంట్స్ విభాగాలకు చెందినవారిని మాజీ అధికారులను విచారించింది. ఆ తర్వాత బ్యారేజీలకు నిధుల సేకరణపై దృష్టి పెట్టింది. అటు కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు శ్రీరాం, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరైన పలు విషయాలు వెల్లడించారు.

# గ్రీన్ ఎనర్జీకి భారీ రాయితీలు

>> రాబోయే పదేండ్లలో 1.98 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు 1.14 లక్షల ఉద్యోగ అవకాశాల సమకూరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. రాష్ట్రంలో ఇప్పుడున్న కాలుష్య కారక తీవ్రత పదేండ్లలో 33 శాతం తగ్గుతుందని అంచనా.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, పారిశ్రామిక కారిడార్ తదితర అభివృద్ధి పనులతో భవిష్యత్తులో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరగనుంది. 2024-25లో రాష్ట్రంలో 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఉండగా, 2034-35 నాటికి 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా.ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సౌర విద్యుత్‌తో పాటు ఫ్లోటింగ్ సోలార్, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఈ విధానం రూపొందించింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులతో పాటు సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలను ఈ పాలసీలో పొందుపరిచింది. మన రాష్ట్రంలో ఉన్న వాతావరణం ఏడాదిలో 300 రోజులు సౌర విద్యుత్తు ఉత్పత్తికి అనుకూలిస్తుంది. దేశంలోనే బలమైన గాలులు వీచే 8 రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో పవన విద్యుత్తు ఉత్పత్తికి మెండుగా అవకాశాలున్నాయి. కొత్త విధానం ప్రకారం సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలను స్థాపించేందుకు ముందుకు వచ్చే డెవెలపర్లను ప్రోత్సహిస్తారు. ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో కొత్త ప్లాంట్లకు అనుమతులిస్తారు. వీటికి ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న వారు డిస్కంలకు లేదా ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా అమ్ముకునే అవకాశాన్ని కల్పించారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ పాలసీ కింద ప్రభుత్వం ప్రోత్సహించనుంది. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తుంది. 500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తుంది. డిస్కంలు ఈ విద్యుత్‌ను కొనుగోలు చేస్తాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ప్లాంట్లను ప్రోత్సహిస్తారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ, ఇతర పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే స్థలాలను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తారు.

సీలింగ్ పరిమితి ఉండదు. భూ వినియోగ మార్పిడి అనుమతులు అవసరం ఉండదు. టీజీఐపాస్ ద్వారా అని రకాల అనుమతులను వేగంగా జారీ చేస్తారు. ప్లాంట్ల స్థాపనకు కొనుగోలు చేసిన భూములకు 100 శాతం స్టాంప్ డ్యూటీని రీయింబర్స్ చేస్తారు.పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు, ఎన్వోసీలను మినహాయించారు. సోలార్ ప్లాంట్లకు నీటి ఛార్జీలను రియింబర్స్ చేస్తారు. సోలార్, పవన విద్యుత్తును వినియోగించే ఎంఎస్ఎంఈ సంస్థలకు 8 ఏండ్ల పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ మాఫీ వర్తిస్తుంది. మూల ధన పెట్టుబడిలోనూ రాష్ట్ర జీఎస్టీ వాటాను తిరిగి చెల్లిస్తారు. పునరుత్పాదక విద్యుత్తులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, వినూత్న ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో లేదా డిస్కల అధ్వర్యంలో ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తుంది.



సికిందరాబాద్ స్టేషన్ వద్ద అధికసంఖ్యలో వేచి ఉన్న ప్రయాణికులు

# ‘గేమ్ ఛేంజర్’ టిక్కెట్ల నిర్ణయం వెనక్కి

>> షోలకి పర్మిషన్ ఇవ్వడంపై పునఃసమీక్షించాలని చెప్పింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తను ఆదేశిస్తూ కేసు విచారణను వాయిదా వేసింది.

# సరదాకు మునిగి.. శవాలై తేలి!

>> మహేందర్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం హైద్రాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన దనుష్(20), లోహిత్(17), కవాడిగూడకు చెందిన చీకట్ల దినేశ్వర్(17), సాహిల్(19), ఖైరతాబాద్ చింతల్‌బస్తీకి చెందిన జతిన్(17)లు నీట మునిగి గల్లంతు కాగా కొమారి మృగాంక్(17), ఎండి.ఇబ్రహీం(20)లు గట్టుపై ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. గల్లంతయిన వారి కోసం శనివారం మధ్యాహ్నం నుండి రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా ఐదుగురు మృతదేహాలు లభ్యం కాగా మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొండపోచమ్మ సాగర్‌లో నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో వారంతా మునిగి చనిపోయినట్లు భావిస్తున్నారు. మృతిచెందిన వారిలో ధనుష్, లోహిత్ ఇద్దరూ అన్నదమ్ములు అని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

**యువకుల ఇళ్లలో నెలకొన్న విషాదం**

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు వద్దకు ఆనందంగా గడపడానికి వచ్చిన ఐదుగురు యువకులు సాగర్‌లో మునిగి గల్లంతై మృతిచెందడంతో ఐదుగురి కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. సంక్రాంతి పండుగ ముందు ఈ విషాదం చోటుచేసుకోవడంతో వారి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం**

కొండపోచమ్మ ప్రాజెక్టులో ఐదుగురు యువకుల మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు దగ్గరుండి పరిస్థితిని పర్యవేక్షించాలని, తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రాజెక్టుకు బందోబస్తు లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు**

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొండపోచమ్మ ప్రాజెక్టుకు ఎలాంటి బందోబస్తు లేకపోవడంతో తరచూ కొండపోచమ్మ ప్రాజెక్టులో నీటి మునిగి చనిపోతున్నారు. సుమారు 21 కిలోమీటర్ల మేర ప్రాజెక్టు ఉండడంతో హైద్రాబాద్ చుట్టుపక్కల నుండి చేపలు పట్టేందుకు, సాగర్‌ను సందర్శించడానికి భారీఎత్తున తరలివస్తున్నారు. గతంలో కొండపోచమ్మ ప్రాజెక్టును చూడడానికి సైతం అనుమతి తీసుకోవాల్సివచ్చేది కానీ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో కొండపోచమ్మ ప్రాజెక్టును పట్టించుకునే నాథుడే లేడని పలువురు ఆరోపిస్తున్నారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు భద్రత ఏర్పాట్లు చేయకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కొండపోచమ్మ ప్రాజెక్టుకు భద్రత కల్పిస్తే ఇలాంటి సంఘటనలు జరగవని పలువురు భావిస్తున్నారు.

**ప్రభుత్వాసుపత్రి వద్ద మిన్నంటిన రోధనలు**

కొండపోచమ్మ ప్రాజెక్టులో ఐదుగురు యువకులు గల్లంతు కాగా శనివారం మధ్యాహ్నం నుంచిరాత్రి వరకు గజ ఈతగాళ్లు గాలించగా ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. వారి మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించగా వారి కుటుంబసభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి.

# అంతా సొంతూళ్లకే..

>> నగరంలోని అన్ని బస్ స్టేషన్లతో పాటు రైల్వే స్టేషన్లలో రద్దీ పెరగసాగింది. సొంత ఊళ్లకు వెళు తున్న వారిలో అత్యధికంగా బస్సులు, రైళ్లలో వెళుతుండగా మరికొందరు సొంత వాహనాలలో పయనమవుతున్నారు. ఈ క్రమంలో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో జనం రద్దీ పెరిగింది. ఈ రద్దీఆది, సోమవారం వరకు కొనసాగే వీలుంది. ఇదిలావుండగా సంక్రాంతి పండగ కోసం సొంత ఊళ్లకు బస్సులు, సొంత వాహనాలలో వెళు తున్న వారి సంఖ్య లక్షల్లో వుండడంతో విజయవాడ జాతీయ రహదారి శనివారం ఉదయం నుంచి క్రిక్కిరిసి పోయింది. టోల్ ప్లాజాట వద్ద వాహనాలు కిలోమీటర్ల దూరం వరకు నిలుచని వుండగా వాటిని పోలీసులు అతి కష్టం మీద పంపుతున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై పలుచోట్ల మరమ్మత్తులు జరుగుతుండడంతో ఆయా ప్రాంతాల పోలీసులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేబట్టారు. దీంతో విజయవాడ జాతీయ రహదారిపై పలుచోట్ల ట్రాఫిక్ జాంలు ఏర్పడగా పోలీసులు దీనిని పరిష్కరిస్తున్నారు. కొన్నిచోట్ల వాహనదారులను ఇతర ప్రాంతాల గుండా మళ్లించారు. మరోవైపు జంట నగరాలు శివారు ప్రాంతాలలో అనేక కాలనీలలో ప్రజలు సొంత ఊళ్లకు వెళుతుండడంతో ఆయా ప్రాంతాలలో పోలీసులు పహారా పెంచారు. సొంత ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లకు తాళాలు వేయాలని, సిసి కెమెరాలు వుంటే అవి పని చేసేలా చూడాలని, వీటిని దొంగలు గమనించని ప్రాంతాలలో వుంచాలని, తమ ఇళ్లపై నిఘా వుంచాలని పొరుగువారికి చెప్పాలని పోలీసులు కోరారు. దినపత్రి కలతో పాటు పాల ప్యాకెట్లు అందించే వారిని తాము తిరిగివచ్చే వరకు ఇళ్లకు రావద్దని ముందుగానే చెప్పాలని, ఇలా చేయడం వల్ల దొంగల ఉనికి తగ్గుతుందని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు పండగల సీజన్‌లో ప్రజలు ఊళ్లకు వెళ్లిన సమయంలో దొంగలు స్వైర విహారం చేసిన ఉదంతాలు వుండడంతో ఆయా ప్రాంతాల పోలీసులు ముందు జాగ్రత్తగా గస్తీ పోలీసులను అప్రమత్తం చేశారు. కాలనీలలో సంక్షేమ సంఘాల వారు కూడా కాలనీలలో నిఘా వుంచాలని, అపరిచితులకు సంబంధించిన సమాచారం తమకు ఇవ్వాలని పోలీసులు కోరసాగారు.

# 27న రానున్న ఖర్గే, రాహుల్

>> నేతృత్వంలో దేశ వ్యాప్తంగా ‘సంవిధాన్ బచావో’ రాష్ట్రీయ పాద యాత్ర’ను చేపట్టాలని అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన ఈ మేరకు తాజాగా పార్టీ శ్రేణులకు రాసిన లేఖ రాశారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. ‘సంవిధాన్ బచావో ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలు రాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు.

## వైభవంగా అయోధ్య రామాలయం
# తొలి వార్షికోత్సవం

### మహాభిషేకంలో పాల్గొన్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్



**అయోధ్య, జనవరి 11:** ఉత్తరప్రదేశ్‌లోని బాబ్రీమసీదు కూల్చిన సంస్థలో నిర్మించిన రామమందిరంలో రామ్ లల్లాను ప్రతిష్ఠించి ఏడాది కావస్తున్న సందర్భంగా అయో ధ్యలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రధాన వేడుకలన్నీ శనివారం నుంచేప్రారంభించారు. బాల రాముడికి మహాభిషేకం నిర్వహించారు. పంచా మృతం, సరయూనది పవిత్రజలాలతో అభిషేకంచేసారు. ఈ కార్యక్రమం తిలకించేందుకు భక్తులు ఉదయంనుంచే ఆలయంలో క్యూకట్టారు. నేటినుంచి జనవరి 13వరకూ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. బాలరాముడికి అభిషేకం చేస్తున్న విడియో వైరల్ అవుతోంది. మరోవైపు తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. సోషల్ మీడియా ఖాతాలో ఆయన పోస్టుచేస్తూ భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికతకకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలిచిందన్నారు. ఎన్నో శతాబ్దాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంవంలో ఈ దివ్య,భవ్య అయోధ్య రామాలయం దేశప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లుమోడీ తనపోస్టులో వివరించారు. కాగా ఈ వేడుకలను ప్రారంబించిన యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్‌మాట్లాడుతూ రాముడు ఉంటే దేశం ఉందని, దేశం ఉంటే రాముడున్నాడని అన్నారు. 2014నుంచి అయోధ్యనగరాభివ1ద్ధిని హైలైట్‌చేసూనత ప్రవాహంలా భక్తులు, యాత్రీకులు తరలివస్తుండటం వేడుకల వైభవాన్ని పెంచుతోందని అన్నారు. అయోధ్యకు రోజు1.5 నుంచి రెండులక్షలమంది భక్తులు వస్తున్నారు. 2014కు ముందు అయోధ్యలో కరెంటు కూడా లేదని పారిశుధ్యం ప్రసక్తేలేదని, అయోధ్యలో విమా నాశ్రయంకూడా లేదని ఈరోజు అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చిందన్నారు. నాలుగులేన్లు, ఆరులేన్ల రోడ్లనిర్మాణం జరిగిందని సరయూనది ఘాట్‌లు యావద్దేవంలోని టూరిస్టులను ఆకర్షిస్తున్నాయన్నారు. అయోధ్య రామాలయం ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ప్రాణ్ ప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవం సందర్భంగా మూడురోజులపాటు అయోధ్యలోప్రత్యేక సాంస్కృతికి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

### విదేశాల్లో నేర్చుకున్నది లొట్టపీసు భాషేనా?
### తీవ్రస్థాయిలో మండిపడ్డ మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** ఈ ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ముద్దాయిగా నిలబడ్డ కెటిఆర్ తీవ్రమైన స్పెస్ట్రేషన్‌లో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన నోటిని అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ, పౌర, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.ముఖ్యమంత్రి ఇతర మంత్రులపై కెటిఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తాము నోరుతెరిస్తే ఆ పార్టీ కెటిఆర్ బ్రతుకేంటో తెలిసిపోతుందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పార్ములా ఈ కేసులో దోషిగా నిలబడి విచారణను ఎదుర్కొంటున్న కెటిఆర్ ఆరాచకపు చేష్టలకు చరమగీతం పాడాల్సి వస్తుందని హెచ్చరించారు. తాను విదేశాల్లో చదువుకున్నానని గొప్ప విజ్ఞానవంతున్ని అనే చెప్పుకునే కెటిఆర్ లొట్టపీసు, ఆ ఫీసు, ఈ పీసు అంటూ ఉత్తర ప్రగల్బాలు పలుకుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కెటిఆర్ వ్యవహార శైలిని వాడుకబాషను ప్రజలు గమనిస్తున్నారని తగిన రీతిలో బుద్దిచెప్పటానికి సిద్దంగా ఉన్నారని తెల్చిచెప్పారు.కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసిపోయి పనిచేస్తున్నాయని అందుకే ఏసిబి కేసులో కెటిఆర్‌ను అరెస్ట్ చేయడం లేదంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఏసిబితో పాటు ఈడి కూడా ఈ కేసును విచారిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోఉన్న ఏసిబి చేయలేకపోతే మీ చేతులో ఉన్న ఈడితో ఎందుకు అరెస్టు చేయించలేకపోతున్నానని సంజయ్‌ను ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ కేసులో ఒకవైపు ఏసిబి, మరో వైపు ఈడి విచారణ జరుపుతున్నారని చర్యలు త్వరలోనే చూడగలుగుతారని చెప్పారు.తమ ప్రభుత్వం అన్యాయంగా అక్రమంగా ఎవరిపై కేసులు నమోదు చేయదని బీఆర్ఎస్ పాలనలో తాము తీవ్రమైన ఒత్తిళ్లకు గురై అనేక ఇబ్బందులు పడ్డామని కొన్నింటి విషయంలో బలవంతంగా సంతకాలు పెట్టవలసి వచ్చిందని పేర్కొంటున్నారని తాము అలాంటి పనులు చేయబోమని చట్టం తనుపనితాను చేసుకుంటూ పోతుందని బీఆర్ఎస్ నేతలు ఏనాడో చెప్పారని అదే పద్దతిలో చట్టం నడుచుకుంటుందని ఆయన వివరించారు.

**ధరణి పేరుతో గులాబి దండు భూదందా**

బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 కంటే ముందు ఉన్నా రెవిన్యూ చట్టాలను రద్దు చేసి దాని స్థానంలో ధరణి చట్టాన్ని తెచ్చి గులాబి దండు రాష్ట్రంపై పడి పేదలు, వ్యవసాయదారులు, ప్రభుత్వ భూములు దండుకున్నారని మండి పడ్డారు. బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా దోచుకున్న భూముల చిట్టాను త్వరలోనే బహిరంగ పరుస్తామన్నారు. ధరణి వల్ల కోట్లాది విలువైన భూములు పింక్ కలర్ నేతల ఖాతాల్లోకి వెళ్లాయని ఈ భూములను కొల్లగొట్టిన గులాబి దండా కోరులే నేడు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చెప్పారు. తాము వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని ఇందులో ఆన్‌లైన్‌లోనూ, ఇకపై ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులకు ప్రభుత్వం వీలు కల్పిస్తుందని ఆయన చెప్పారు.

# జెఇఇ మెయిన్ పరీక్షా కేంద్రాలను ప్రకటించిన ఎన్‌టిఎ

### వెబ్‌సైట్‌లో పరీక్షా కేంద్రాల నగరాల వివరాలు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** దేశంలోని ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ ఫేజ్-1 పరీక్షలకి సంబంధించిన పరీక్షా కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఈ నెల 22 నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ఎవరికి ఏ తేదీన పరీక్ష ఉంటుంది? పరీక్షా కేంద్రం ఎక్కడ కేటాయించారో వివరాలను ఎన్‌టీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జేఈఈ పరీక్షలకి సంబంధించిన ముందస్తు సమాచారం ఇవ్వడం ఇదే మొదటిసారికావడం విశేషం. ఎన్‌టీఏ నోటిఫికేషన్ జారీ చేసిన సమయంలో కేవలం పరీక్ష తేదిలను మాత్రమే ప్రకటించగా.. ఇప్పుడు పరీక్షా కేంద్రం వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టడంతో విద్యార్థులు ముందుగానే తమ పరీక్షా కేంద్రం గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

జేఈఈ సిటీ ఇన్‌ఫర్మేషన్ స్లిప్‌ను వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. బీటెక్ సీట్ల కోసం పేపర్-1ను ఈ నెల 22, 23, 24, 28, 29 తేదీల్లో నిర్వహించనుండగా.. బీఆర్క్ సీట్ల కోసం నిర్వహించే పేపర్-2ను ఈ నెల 30న మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈసారి సెక్షన్ బీలో 5 ప్రశ్నలను ఇస్తారని ఎన్‌టీఏ ప్రకటించింది.

# టెట్-2 పేపర్-2లో 74 శాతం హాజరు

### శంషాబాద్ పరీక్షా కేంద్రంలో సాంకేతిక లోపంతో ఆగిన పరీక్ష
### పాఠశాల డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా టీజీ టెట్-2024-2 పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన పేపర్-2 పరీక్షలకి 74 శాతం మంది హాజరయ్యారు. శనివారం జరిగిన పరీక్షల్లో శంషాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సాంకేతిక లోపంతో పరీక్ష ఆలస్యంగా ముగిసింది. శనివారం ఉదయం 73 కేంద్రాల్లో పరీక్ష జరగగా 18574 మందికి కేటాయించగా వారిలో 14023 మంది హాజరయ్యారు. పరీక్షకి కేటాయించిన దానిలో 75.50 శాతం హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 19,341 మందిని కేటాయించగా వారిలో 14,113 మంది హాజరయ్యారు.

పరీక్షకి 72.97 శాతం మంది హాజరయ్యారు. అయితే మధ్యాహ్నం సెషన్‌లో శంషాబాద్‌లోని వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 155 మంది అభ్యర్థుల ఆన్‌లైన్ పరీక్ష సాంకేతిక కారణాల వల్ల మధ్యలో నిలిపివేయబడిందని టెట్ ఛైర్మన్, పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్య తలెత్తిన నేపథ్యంలో అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనే ఉంచి.. సమస్యను పరిష్కరించి విజయవంతంగా పూర్తి చేసినట్టు ప్రకటించారు.

**టెట్ అభ్యర్థుల ధర్నా..**

రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో.. శనివారం పేపర్-2 గణితం, సైన్స్ (తెలుగు మీడియం)అభ్యర్థులకు పరీక్షను నిర్వహించారు. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షాకేంద్రాన్ని కేటాయించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరగాల్సి ఉంది.

అయితే పరీక్ష ప్రారంభమైన తర్వాత 3 గంటల సమయంలో అర్ధాంతంగా మూడు సర్వర్‌లలో.. ఒక సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పరీక్ష మధ్యలోనే నిలిచిపోయింది. పది నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన నిర్వాహకులు... ప్రతి సారి పది నిమిషాలమంటూ చెప్పకుంటూ వెళ్లడంతో అభ్యర్థుల్లో కొందరు సెంటర్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. నిర్వాహకుల తీరును నిరసిస్తూ అభ్యర్థులు సెంటర్‌లో ధర్నాకు దిగారు.

ఎట్టకేలకు సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో రాత్రి 6.30 గంటల సమయంలో పరీక్ష తిరిగి ప్రారంభించి ముగించారు.

# ఇక డిఒలు లేకుండానే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

### సిసి కెమెరాల మధ్య నిర్వహణ
### పర్యవేక్షణకు అదనంగా స్క్వాడ్స్ నియామకం
### ప్రైవేట్ కాలేజీల అక్రమాల నేపథ్యంలో డిఒల తొలగింపు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇకపై ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలకి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు(డీవో)లు ఉండరు. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించడానికి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఇంటర్‌బోర్డు నుంచి నియమించే వారు. ఇకపై ప్రాక్టికల్ పరీక్షలను డీవోలు లేకుండానే నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు జరిగేచోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు 22 వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల మధ్య పకడ్బందీగా నిర్వహించడానికి ఇంటర్ బోర్డు సిద్ధమవుతోంది. డీవోలను తొలగించిన నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో స్క్వాడ్స్‌ను నియమించాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. ప్రాక్టికల్ పరీక్షలను ప్రాక్టికల్‌గా నిర్వహించాలని.. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను నేర్పించాలని కొద్ది రోజుల క్రితం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలతో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు మీటింగ్ ఏర్పాటు చేసిమరీ చెప్పారు. అందుకు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు అంగీక రించాయి. ఇంటర్‌లో ఒకేషనల్ విద్యార్థులకి మొదటి, ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. అదే బైపీసీ విద్యార్థులకి సెకండియర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలో ప్రాక్టికల్స్ ఉంటుండగా.. ఎంపీసీ విద్యార్థులకి సెకండియర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ప్రాక్టికల్ పరీక్షలకి సబ్జెక్టు టీచర్లను ఎగ్జామినర్లుగా ఇంటర్ బోర్డు నిర్ణయమిస్తుంది. దాంతోపాటు పర్యవేక్షణ కోసం ఇప్పటి వరకు డీవోలను నియమించే వారు. డీవోలు తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఉర్దూ, కామర్స్, ఆర్ట్స్ గ్రూపులకి చెందిన జూనియర్ లెక్చరర్లను నియమించే వారు. అయితే డీవోలను ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడి వారి కాలేజీల్లో ప్రాక్టికల్స్ చేపించకుండానే.. విద్యార్థులకు పూర్తి మార్కులు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. అలాగే కొందరు డీవోలు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజ మాన్యాలతో కుమ్మక్కువుతున్నారని.. కొన్ని సందర్భాల్లో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఈ ఏడాది ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్ పరీక్షలను డీవోలు లేకుండానే నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఎక్కడా ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రాక్టికల్స్ జరిగే ప్రతి కాలేజీలోనూ.. పరీక్షల నిర్వహణ దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కాలేజీ యాజమాన్యాలను ఆదేశించింది. వాటిని ఇంటర్ బోర్డు నుంచి, డీఐఈవో ఆఫీసుల నుంచి కూడా చూసేలాగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎక్కడా ఎటువంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేలా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుం టోంది. ఇదేక్రమంలో వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తున్నట్టు తెలుస్తోంది. 5 లక్షల నుంచి 5.20 లక్షల మంది వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో సుమారు 1450 వరకు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలున్నాయి. అన్నీ కలిపితే 3వేల వరకు ఉంటాయి.

# అల్లు అర్జున్‌కు భారీ ఊరట

### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన
### ఆదివారం పోలీసుస్టేషన్‌కు హాజరుపై అర్జున్‌కు మినహాయింపు
### విదేశాలకు వెళ్లేందుకు అనుమతి



**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన సంధ్య థియే టర్ తొక్కిసలాట ఘటనలో నిందితుడుగా వున్న టాలీవుడ్ హీరో అల్లు అర్జున్‌కు నా ంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన అల్లు అర్జున్ ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు హాజరు కావడంతో పాటు సంతక చేయాలని ఇంతకు ముందు నాంపల్లి కోర్టు ఆదేశించడం తెలిసిందే. కాగా ఈ ఆదేశాల నుంచి అల్లు అర్జున్‌కు శనివారం నాడు కోర్టు మినహాయింపునిచ్చింది. ప్ర తీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు హాజరు కావడం భద్రతా కారణాల రీత్యా కష్టంగా వుందని, ఇదే సమయంలో షూటింగ్ నిమిత్తం విదేశాకు వెళ్లాల్సి వుందని, ఇందుకు కూడా అనుమతించాలని అల్లు అర్జున్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం నాడు నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. దీనిపై విచారించిన నాంపల్లి కోర్టు ఇకముందు ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని, కేవలం భద్రతా కారణాలతోనే అల్లు అర్జున్‌కు ఆదివారం నాడు పోలీసు స్టేషన్‌కు వెళ్లే విషయంలో మినహాయింపు ఇచ్చినట్లు కోర్టు పేర్కొంది. అయితే పోలీసుల విచారణకు సహకరించాలని, ఆయనను ఎప్పుడైనా విచా రించాలని పోలీసులు భావిస్తే ముందుగా నోటీసులు ఇచ్చి విచారణ జరపవచ్చని పోలీసులకు నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో అల్లు అర్జున్ విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటి వరకు వున్న ఆంక్షలను రద్దు చేసిన నాంపల్లి కోర్టు ఆయన షూటింగ్‌ల కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతిచ్చింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ ఇప్పటి వరకు నాలుగుసార్లు పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇందులో అల్లు అర్జున్ ఎ11 గా వుండడం తెలిసిందే. నిందితుల్లో అల్లు అర్జున్ సహా పది మందిని పోలీసులు అరెస్టు చేయగా మిగతా వారు అజ్ఞాతంలో వుండి ముందస్తు బెయిల్ పొందారు. ఇక అరెస్టయిన వారు కూడా బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షుల విచారణను పూర్తి చేసిన పోలీసులు కేసు దర్యాప్తును కూడా దాదాపు పూర్తి చేశారు. దీనిపై త్వరలో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే బస్సులు సీజ్

### జిల్లా ఉప రవాణ శాఖ అధికారి సదానందం
### ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీలు
### 16 ప్రైవేట్ బస్సులపై కేసులు.. ఆరంజ్ ట్రావెల్స్ బస్సు జప్తు

**హైదరాబాద్ (అత్తాపూర్) జనవరి 11, ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నడిపితే సీజ్ చేస్తామని రంగారెడ్డి జిల్లా ఉప రవాణ శాఖ అధికారి సదానందం హెచ్చరించారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై మూడో రోజులుగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

శనివారం రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తా వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పాటించని పలు బస్సులపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణా శాఖ అధికారి సదానందం మాట్లాడుతూ.. నిబందనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రవేట్ ట్రావెల్స్ బస్సులపైన ఇప్పటి వరకు 160 కేసులు నమోదు చేశామని వివిధ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు సీజ్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి 16 బస్సులపై కేసు నమోదు శామని ఆరంజ్ ట్రావెల్స్ బస్సు సీజ్ చేసినట్లు తెలిపారు.




బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీకుల నుండి అధిక చార్జీలు వసూల్ చేస్తున్న వాటి పైన పర్మిట్ మించి ప్రయాణికులను అనుమతి ఇవ్వడం రాష్ట్రానికి ట్యా క్స్ ఎగ్గొట్టడం, ప్రయా ణికుల లిస్ట్, ఇక్కట్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. చెన్నై, తిరు వంతపురం, పాండిచ్చేరి, మంగళూరు, మైసూరు, కన్యాకుమారి బెంగళూరు నుండి హైదరాబాద్ వస్తున్న బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు.

# ఎస్పీ ఎదుట మావోయిస్టు నేత మచ్చ సోమయ్య లొంగుబాటు

### ఆయనపై రూ.8 లక్షల రివార్డు అందజేత
### మావోయిస్టులు లొంగిపోతే పునరావాసం కల్పిస్తాం: ఎస్పీ కిరణ్‌ఖరే

**ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** గత 32



లొంగిపోయిన మావోయిస్టు సోమయ్యకు రివార్డు చెక్కు అందిస్తున్న దృశ్యం

యేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు మచ్చ సోమయ్య(62) అలియాస్ సమ్మయ్య అలియాస్ సురేందర్ అలియాస్ సతీష్, డిసిఎస్ అండ్ ఇంచార్జ్ వ్యవసాయ విభాగం, సౌత్ బస్తర్ డివిసి, డికెయస్‌జడ్‌సి ఆఫ్ సీపీఐ మావోయిస్టు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఎదుట జిల్లా పోలీసు కార్యాలయంలో లొంగిపోయారు. ఈసందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే విలేకరుల సమావేశంలో మావోయిస్టు సోమయ్యకు సంబంధజంచిన వివరాలను వెల్లడించారు. మచ్చ సోమయ్య అలియాస్ సమ్మయ్య అలియాస్ సురేందర్, అలియాస్ సతీష్(62)అనే మావోయిస్ట్ నేత జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందినట్లు తెలిపారు. జిల్లా కమిటీ సెక్రటరీ ర్యాంక్(డిసిఎస్) అండ్ ఇంచార్జ్ ఆఫ్ అగ్రికల్చర్ వింగ్, సౌత్ బస్తర్ డివిసి, డికెయస్‌జడ్‌సి ఆఫ్ సిపిఐ మావోయిస్లు అని తెలిపారు. పార్టీ జీవితం..అప్పటి మహదేవపూర్ ఏరియా కమిటీ సెక్రటరీ గాలి ఆగయ్య అలియాస్ జనార్ధన్ ప్రేరాణాత్మక మాటలతో సోమయ్య ప్రభావితం అయినట్లు తెలిపారు. 1990లో సిపిఐయం(యంఎల్) పిడబ్ల్యుజి యొక్క ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అయిన రైతు కూలీ సంఘం(ఆర్‌సియస్)లో చేరినట్లు, 1992లో భూపాలపల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జైలు నుండి విడుదలైన తర్వాత సోమయ్య 1993లో పెద్దారెడ్డి అలియాస్ వెంకన్న నేతృత్వంలోని మహదేవపూర్ ఏరియా కమిటీలో పార్టీ సభ్యునిగా సిపిఐ(యంఎల్) పిడబ్ల్యుజిలో చేరినట్లు తెలిపారు. 1995లో ఏరియా కమిటీ మెంబర్(ఏసియం)గా పదోన్నతి పొందినట్లు, 1998లో మహదేవపూర్ ఏరియా కమిటీలో కూకాటి వెంకటి అలియాస్ రమేష్ అలియాస్ వికాస్ నేతృత్వంలో డిప్యూటీ కమాండర్‌గా పనిచేసినట్లు తెలిపారు. సోమయ్య 2003ల6 డివిజనల్ కమిటీ మెంబర్(డివిసియం) స్థాయికి పదోన్నతి పొందినట్లు, అదే సంవత్సరంలో మహదేవపూర్ ఏరియా కమిటీకా కార్యదర్శిగా నియమించబడినట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణలో అణచివేత కారణంగా, 2007లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దండకారణ్యంకు తమ షెల్టర్ జోన్‌గా మారినట్లు తెలిపారు. 2007లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ(ఎన్‌టిఎస్‌జడ్‌సి) నుండి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(డికెయస్‌జడ్‌సి)కి బదిలీ చేయబడినట్లు తెలిపారు. 2007లో సౌత్ బస్తర్ డివిసి, డికెఎస్‌జడ్‌సి యొక్క జనతన్ సర్కార్‌లో వ్యవసాయ విభాగం(కృషి విభాగ్) బాధ్యతలు అప్పగించబడ్డాయన్నారు. డికెఎస్‌జడ్‌సిలోని సౌత్ బస్తర్ ప్రాంతంలో ఆదివాసీల వ్యవసాయ పద్ధతుల పెంపునకు కృషి చేసినట్లు తెలిపారు. చెరువులను తవ్వడం ద్వారా నీటిపారుదల నీటి వనరులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జనతన్ సర్కార్ సభ్యులతో కూడిన చిన్న నీటి నిల్వలను సృష్టించి సౌత్ బస్తర్ డఅఈవీసీ ప్రాంతంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు జనతన్ సర్కార్ కార్యకర్తల సహకారంతో దాదాపు 200బోర్‌వెల్‌లను తవ్వించినట్లు తెలిపారు. సోమయ్య మూడు దశాబ్దాల(32 సంవత్సరాలు) సుధీర్ఘ కాలంపాటు అండర్ గ్రౌండ్ క్యాడర్‌గా ఉద్యమంలో పని చేసినట్లు తెలిపారు.

### తెలంగాణలో ఉజాల పథకం కింద 28.75లక్షల ఎల్ఇడి బల్బుల పంపిణీ
### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణలో ఉజాల పథకం కింద 28.75లక్షల ఎల్ఈడి బల్బులను పంపిణీ చేసినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఉజాల పథకం కింద 28.75లక్షల పంపిణీతో 3.75లక్షల మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందన్నారు. అదేవిధంగా రూ.149కోట్ల రూపాయలు ఆదా అయిందని, అదేవిదంగా 3,02,436 టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ తగ్గిందన్నారు. అదేవిధంగా తెలంగాణలో గ్రీనరీతో పాటు మరింత ఇంధన ఉత్పత్తి సామర్థ్యం మెరుగుపడనుందన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో 11.90లక్షల ఎల్ఈడి బల్బులను అందించినట్లు తెలిపారు.

# త్వరలో ఐఎఎస్‌ల బదలీ!

### ముఖ్య శాఖల అధికారుల మార్పు
### రెండు రోజుల్లో ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీస్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్‌లను బదిలీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నదని సచివాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు కసరత్తు తుది దశకు చేరినట్టు తెలిపాయి. ముఖ్యశాఖల ఉన్నతాధికారులను సైతం మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నదని, ఆశించిన స్థాయిలో పనితీరు లేకపోవడంతోనే పలువురుని బదిలీ చేయడం ద్వారా మార్పునకు సిద్ధమైట్టు సమాచారం. కొన్ని జిల్లాల కలెక్టర్లు సహా సీనియర్ అధికారులను బదిలీ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి గతంలోనే పలుమార్లు ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది.

ఈ ఏడాది ప్రారంభంలో సీఎస్ మార్పు సమయంలో కొంత మంది అధికారులను బదిలీ చేశారు. ఇక సీనియర్ అధికారుల స్థాయిలోనూ పలు పోస్టులకు పూర్తి స్థాయి అధికారులు లేరు. దీంతో ఆయా బాధ్యతలను అదనంగా నిర్వర్తిస్తున్నారు. వీటికి తోడు, ఇటీవలి కాలంలో పలు పోస్టులు కూడా ఖాళీ అవుతున్నాయి.

వ్యక్తిగత కారణాలతో పలువురు అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్తున్నారు. అలాగే వీరితో పాటు ఒకరిద్దరు ఐఏఎస్‌లను సీఎంవోలోకి తీసుకునే అవకాశం ఉందని, ఇప్పుడున్న వారిని మార్చి వారి స్థానాన్ని భర్తీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలి యవచ్చింది. వీటన్నింటి నేపథ్యంలో ఐఏఎస్ అధికారుల బదిలీ అంశం మరోమారు తెరమీదకు వచ్చింది.

# తెలంగాణ ప్రజలకు క్షమాపణ

### మనోభావాలు దెబ్బతింటే క్షమించండి
### ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు క్షమాపణలు చెప్పారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తాజాగా దిల్ రాజ్ స్పందించారు. 'నిజామాబాద్ జిల్లా వాసిగా నా సినిమా ఈవెంట్ ను అక్కడ చేశాను. ఈ ఈవెంట్ లో నేను మన సంస్కృతిలో ఉండే దావత్ గురించి మాత్రమే మాట్లాడాను. కానీ నా ఉద్దేశాన్ని అర్థం చేసుకోకుండా కొందరు సోషల్ మీడియాలో రాద్ధాంతం చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. నేను మన కల్చర్‌ను అభిమానించే వ్యక్తిని. నిజంగా నేను చేసిన వ్యాఖ్యలు ఎవరినైనా హర్ట్ చేసి ఉంటే నన్ను క్షమించాలని కోరుతున్న. ఫిదా, బలగం వంటి తెలంగాణ సంస్కృతితో ముడిపడిన సినిమాలు నిర్మించాను. వీటికి ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వచ్చాయి. తెలంగాణ ప్రజలంతా రాజకీయ పార్టీలకు అతీతంగా ఆ సినిమాలను, మమ్మల్నీ గుండెలకు అత్తుకున్నారు. తెలంగాణ బిడ్డగా నేను తెలంగాణను ఎలా అవమానిస్తానని, హేళన చేస్తారని అనుకున్నారో నాకు తెలియదు. అయినా ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే నన్ను క్షమించాలి. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీ లకు విజ్ఞప్తి చేస్తున్నాను. నన్ను రాకీయాల్లోకి లాగకండి. సినిమా రంగ అభివృద్ధి కోసమే పని చేస్తాను తప్ప అది రాజ కీయాలకు సంబంధించినది కాదు అంటూ వివరణ ఇచ్చారు.

### కొండపోచమ్మ సాగర్‌లో యువకుల గల్లంతుపై మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టులో గల్లంతై ఐదుగురు యువకులు మృతి చెందడం పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ధ్రిగ్భాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల్లో భాగంగా గల్లంతైన ఐదుగురి యువకుల మృతదేహాలు బయటకు తీసినట్లు మంత్రి తెలిపారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులో మృతి చెందిన యువకుల కుటుంబాలకు మంత్రి పొన్నం సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈతకు వెళ్లి ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడడం పట్ల సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. యువకుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మిల్లర్ల చేతిలో నలుగుతున్న 'బియ్యం'!

ప్రభుత్వం మిల్లర్లులు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుండటంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని సివిలసప్లయ్ కార్పొరేషన్‌లకు అప్పులు గుదిబండలాగా మారాయి. తెలంగాణ పౌరసరఫరాలశాఖకు రూ.45లక్షల కోట్లు ప్రస్తుతం ఉంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు రూ.36వేల కోట్లు అప్పుఉంది. భారత ఫుడ్‌కార్పొరేషన్ సంస్థ సిఎంఆర్ గడువు జనవరి మూడోవారం వరకు మళ్ళీ పెంచారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికే పలు మార్లు సిఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వడానికి పలుమార్లు అవకాశంఇచ్చింది. ఈ దఫా తిరిగి బియ్యం ఇవ్వకపోతే సుమారు ఆరువేల కోట్ల భారం తెలంగాణపై పడుతుంది. అంటే మన సివిల్‌సప్లయ్ అప్పుభారం రూ.51వేల కోట్లకు చేరబోతుంది. 2023-24 వానాకాలం సం



బంధించి 17లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా మిల్లర్లవద్ద బకాయి ఉంది. 2023-24 లో 48లక్షల మె.ట ధాన్యం మిల్లర్లకు మర ఆడించాలని ఇచ్చారు. వాస్తవానికిధాన్యం కేటాయించిన 15రోజుల్లోనే మిల్లర్లు మర ఆడించి ఇవ్వాలికానీ జి.వోలో మూడు నెలలు అదనపు అవకాశం ఇవ్వడంతో దానిని అలుసుగా తీసుకొని ఏళ్లకుఏళ్లు సిఎంఆర్ బియ్యం ఇవ్వకుండా తప్పించుకొని దర్జాగా తిరుగతున్నారు. ప్రభుత్వం కూడా సిఎంఆర్ బియ్యంపై శ్రద్ధ చూపకుండా టెండర్ ఏజెన్సీలకుధాన్యం అప్పగించేందుకు ఒత్తిడి చేస్తున్నది. ప్రభుత్వ ధాన్యం వేలంలో కొన్న ఏజన్సీలకు ధాన్యం అప్పగించని రైసుమిల్లర్లపై ఆర్ఆర్‌యాక్ట్, క్రిమినల్‌కేసులు నమోదు చేస్తున్నారు.

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

'జాలరి వలలో చేపవునీవే గానుగమరలో చెరుకువు నీవే" శ్రీశ్రీ అన్నట్లు రైసుమిల్లర్ల మరలో ఉభయతెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, మిల్లర్ల ద్వారా వినియోగదారులు నలిగి పోతున్నారు. రైసుమిల్లర్లు "తోకే కుక్కను ఆడించినట్లు" మన పాలకులను ఆడిస్తున్నారు. అన్నపూర్ణ వంటి తెలుగుగడ్డపై ఆకాశాన్ని అంటేలా బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఉభయ తెలుగురాష్ట్రాలలో ధాన్యం దిగుబడి ఏటామూడుకోట్ల మెట్రిక్ టన్నులకుపైగా పెరిగిన బియ్యం ధరలు మార్కెట్‌లో కిలోకు రూ.60కిపైగానే చేరుకొని సామాన్యుడు నోట్లోకి ఐదు వేళ్ల వెళ్లని దుస్థితి నెలకొంది. మిల్లర్లు, నల్లబజారు వ్యాపారులు చేతులు కలిపి ఓవైపు బ్లాక్‌దందాతో బియ్యం కొరత సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలు తీర్చకుండా ప్రభుత్వాలు కూడా బియ్యం ఎగుమతికి అనుమతులు ఇవ్వడంతో అక్రమంగా సక్రమంగా సరిహద్దులు దాటుంటే స్థానిక మార్కెట్‌లో బియ్యంధరలు పెరుగుతున్నాయి. బియ్యం అక్రమరవాణా అడ్డుకొంటున్నామని అడపదడపా బిల్డప్ ఇవ్వడానికి "అరహో సాంబా..! సీజ్ ద షిప్"అంటూ ప్రజలకు వినిపించేలా గట్టిగా అరుస్తారు. ఆ వెనువెంటనే మనోళ్లదే వదిలేండని అంటూ బుల్లిపెట్టతో అధికారుల చెవుల్లోకి చేరవేస్తారు. బ్యాంకు గ్యారెంటీ, బాండు పేపర్లు అంటూ ధాన్యం కేటాయింపుకు ఏవేవో నిబంధనలు పెడుతూ ప్రచార హంగామాచేసి పారదర్శకత ప్రమాణాలు పాటిస్తున్నామనే విన్యాసాలు చేస్తారు. మిల్లర్ల భరతం పడుతున్నారని ఉభయరాష్ట్రాల పాలకులు మభ్యపెడుతారు. మిల్లర్లనుంచి బకాయి ఉన్న ఒక్క గింజా వసూలు చేయకుండానే తోక ముడుస్తారు. కాకినాడ పోర్టులో బియ్యం కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి, ఆయన సతీమణిపై కేసులు నమోదు చేశారు. బియ్యం అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతారనే సంతోషం ఎక్కువ కాలం నిలువకుండా స్టెల్లా ఎల్-1 పనమానౌకలో గుర్తించిన పిడిఎస్‌బియ్యం అధికారపార్టీ నేతలదే అని తేలడంతో మౌనంగా విశాఖ పోర్టునుంచి వెనక్కి మళ్లారు. ఆంధ్రప్రదేశ్ కాకినాడ పోర్టునుంచి విదేశాలకు అక్రమబియ్యం రవాణా అడ్డుకోవడంలో ప్రభుత్వాలు ఎన్నిమారినా అడ్డుపడటంలేదు. మిల్లర్లను గాడిపెడుదామని భావించిన పాలకులు చివరకు మిల్లర్లదారిలోకి మళ్లుతున్నారు. తెలంగాణలో మిల్లర్ల అక్రమాలను కట్టడి చేయడానికి పదిశాతం బ్యాంకు గ్యారెంటీ బాండుపేపర్లు అంటూ ఏదోఏదో నిబంధనలు పెట్టారు చివరకు రాజకీయాలు ఇతరత్రా కారణాలతో కేవలం బాండు పేపర్‌తీసుకొనిమిల్లులకు ధాన్యం కేటా యించారు. తెలంగాణ వ్యాప్తంగా రైసుమిల్లు యజమానులు ధాన్యంతో నిర్లజ్జగా సర్కారుధాన్యంతో దందా చేస్తున్నారు. తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్



కుమార్‌రెడ్డి కస్టమ్‌మిల్లింగ్ అక్రమాలను అరికట్టడానికి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా క్షేత్రస్థాయి అధికారులు, రైసుమిల్లర్లు పాల కులను బురిడి కొట్టిస్తున్నారు. నల్లబజారులోకి వచ్చి ప్రభుత్వం మాపై చర్యలుతీసుకొనే దమ్ముఉందా అనే చులకన భావంతో రైసుమిల్లర్లు రెచ్చిపోతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మిరాసిపల్లి గుట్టల్లో ధాన్యం అక్రమంగా నిల్వచేసిన డంపు సంఘటన మరవక ముందే నిజామాబాద్ జిల్లాలో హరిత ఆగ్రోస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించిన వైనం వెలుగులోకి వచ్చింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిజామాబాద్ నగరంలోని నాగారంలోని హరిత అగ్రోస్‌మిల్లును తనిఖీ చేసి సిఎంఆర్ నిల్వలు పరిశీలించగా సుమారు ఒకకోటి 85లక్ష విలువగల ధాన్యం గిడ్డంగిలో లేకపోవడంతో డిఎం సివిల్‌సప్లయ్ కార్పొరేషన్‌కు కేసు నమోదు చేయాలని డిఎస్‌వో అర్వింద్‌రెడ్డి సిఫార్సు చేశారు. నిజామాబాద్ జిల్లాలో రేషన్‌బియ్యం రీసైక్లింగ్ చేసివ్యాపారులు అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదుల చేయడంతో నాగారంలోని హరిత అగ్రోస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. 2023-24 యాసంగి వడ్లు ఈ మిల్లుకు కేటాయించినా అక్కడ అవిలేవు. ఈనెల 25తారీఖులోగా సిఎంఆర్ బియ్యం డిఫాల్టు మిల్లులు ఇవ్వాల్సి ఉంది. గత నెల బోధన్‌లో కూడా న్యూభారత్ రైస్‌మిల్లు కూడా దాడులుచేసి ధాన్యంలేకపోవడంతో డిఎస్‌వో అర్వింద్‌రెడ్డి కేసులు పెట్టారు. రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపుకు బ్యాంకు గ్యారెంటీలు, మిల్లుసామర్థ్యాలు వంటి ప్రమాణాలు త్రోసిరాజని కాసుల కక్కుర్తితో ధాన్యం మిల్లులకు కేటాయించడంతో దర్జాగా మిల్లర్లు నల్లబజారుకు తరలిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో ఒక మిల్లుపేరుపై ధాన్యం తీసుకొని మరో మిల్లుకు తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వానాకాలం వడ్లు కేటాయించని మిల్లులకు డబుల్‌షిఫ్టింగ్ పేరిటవడ్లు దొడ్డిదారిన కేటాయింపులు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లుకు కేటాయించి ధాన్యం మిల్లుల సమీపంలో గోదాముల్లో భద్ర పరుచుకోవాలి. కోట్లరూపాయల విలువ కలిగిన ధాన్యం కేటాయించిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా అధికారులు తనిఖీలు నిర్వహించడంలేదు. మిల్లర్లకు ధాన్యం పక్కదారి పట్టించేందుకు ఈఅవకాశం మిల్లర్లు వినియోగించుకొంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం మిరాసిపల్లిలో గుట్టమధ్య నిల్వచేసిన సిఎంఆర్ ధాన్యండంపును సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం డిసెంబరు 21న పట్టుకొని నలబజారుకు తరలించే కుట్రను భగ్నంచేశారు. అక్రమంగా దాచిన ధాన్యం డంపు విలువ రూ.20కోట్లపైనే ఉంటుందని అధికారులు అంచనావేశారు. 2022-23 ఖరీఫ్, రబీ సీజన్‌ల ధాన్యం మిరాసిపల్లిలోని ఇషాన్ ట్రేడర్స్ మిల్లుకు పౌరసరఫ రాలశాఖ 4.72లక్షలబస్తాల ధాన్యంకేటాయించింది. మిల్లు యాజమాన్యం కొంతమేరకు ధాన్యం మర ఆడించి పౌరసర ఫరాలశాఖ అప్పగించింది. ఇంకా 2,52,162బస్తాల ధాన్యం మరఆడించి ఇవ్వాల్సి ఉండగా వాటిని గట్టలమధ్య రహస్య ప్రాంతాలకు తరలించి ధాన్యండంపును భద్రపరిచారు. మిల్లుయజమాని మధుసూధన్‌రెడ్డి నల్లబజారుకు ధాన్యం తరలిస్తున్నారనేపక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మిల్లులో సిఎంఆర్‌కు చెందిన ధాన్యం బస్తాలు 1837 మాత్రమే ఉన్నా యని మహబూబ్‌నగర్ అదనపు రెవెన్యూకలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలనలో వెల్లడైంది. రాష్ట్రంలో మొత్తం 3368 రైసు మిల్లులుండగా అందులో 1177 మిల్లులు ఒకటి నుంచి నాలుగైదు సీజన్లు బియ్యం బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు కన్నంకొట్టాయి. బకాయిలు చెల్లించడానికి జనవరి 20తుదిగడువు పెట్టింది. రాష్ట్ర వాప్తంగా 2018ధాన్యం బకాయిల అత్యంత వివాదాస్పదంగా మారింది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రెండు సీజన్‌లకు చెందిన సిఎంఆర్ కోటా ఇప్పటికీ రైసుమిల్లర్లు చెల్లించలేదు. 2024 ధాన్యం కేటాయింపులో రాష్ట్రప్రభుత్వం మిల్లర్లనుంచి బ్యాంకుగ్యారెంటీ తీసుకొనేందుకు షర్తు విధించింది. ప్రభుత్వ జరిమానా 25శాతంతో పాటు, మిల్లు సామర్థ్యంపై 25శాతం బ్యాంకు పూచీకత్తు ఇవ్వాల్సిన మిల్లులు రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇప్పటికి ఇవ్వలేదు. బ్యాంకులో ప్రాసెస్‌లో ఉందని చెబు తూ ప్రభుత్వంను మభ్యపెడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదలుకొని గద్వాలజిల్లావరకు డబ్బులు ఇస్తేనే మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయని ఆరోపణలు గుప్పమంటున్నాయి. కరీంనగర్ జిల్లాలో డిఫాల్టర్ మిల్లర్లకు ప్రయోజనం కలిగించడానికి డబుల్‌షిఫ్టింగ్ ప్రయోగం చేసున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మిల్లుకు లక్షన్నర చొప్పన వసూలు చేసి డబుల్ షిఫ్టింగ్ పేరుతో ధాన్యం కేటాయింపులు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో కరీంనగర్‌లోనే లీజుల పేరుతో మిల్లర్లు టోకరావేసిన సంఘటనలు కూడాఉన్నాయి. ప్రస్తుతం డబుల్‌షిఫ్టింగ్ తెరపైకి తెచ్చారు. డబుల్‌షిఫ్టింగ్‌అంటే ఒక రైస్ మిల్లు నుంచి మరో రైసుమిల్లుకు అదీకూడా బకాయిలు ఉండి బ్యాంకు గ్యారెంటీలు తదితర ఫార్మాల్టీలు పాటించని డిఫాల్టర్లకు ధాన్యం బదలాయించడంకు ఈ పేరుతో ధాన్యం ఇస్తున్నారని తెలిసింది. దీనిని అధికారులు ధృవీకరించి కొత్తధాన్యం ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తంచేశారని తెలుస్తోంది. ●


# సమర సన్నాహం!

ఢిల్లీ

మరో మహాసమరానికి తలుపులు తెరుచుకున్నాయి. గతవారం ఎన్నికల సంఘం షెడ్యూలును ప్రకటించడంతో ఢిల్లీ గద్దె అధిష్టించడానికి ఎవరి వ్యూహాలు వారు రూపొందించుకొనడంలో పూర్తిగా మునిగిపోయారు. వీరిలో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీపార్టీ ఒక అడుగు ముందుకు వేస్తుండగా, దానిని ఏవిధంగానైనా దాటడానికి బిజెపి వడివడిగా కదులుతోంది. ఆ రెండింటితోను పోటీపడడానికి కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. బిజెపి, ఆప్‌లతో పోల్చితే కాంగ్రెస్‌కు గల విజయావకాశాలు తక్కువే అని చెప్పవచ్చు. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా' కూటమికి దాదాపు అన్ని పార్టీలు మద్దలు ఇచ్చి పోటీచేయడంతో కూటమి అధికారంలోకి రాలేకపోయినా అందలం సమీపం వరకైనా రాగలిగింది. కానీ తర్వాత జరిగిన పరిణామాలలో కాంగ్రెస్ దాదాపు ఒంటరిగా మారింది. ఆప్ మొదటినుంచి కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లుగానే ఉన్నా సమాజ్‌వాది వంటి పార్టీలు గట్టి మద్దతునిస్తూ వచ్చాయి. కాంగ్రెస్‌తో తగినంత ఉపయోగం లేదని తెలిసినా తమిళనాడులో సిఎం స్టాలిన్‌కూడా కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా కొనసాగిస్తూనే వచ్చారు. అయితే ఎన్నికల షెడ్యూలును గత మంగళవారం (7,జనవరి) సిఇసి రాజీవ్ కుమార్ ప్రకటించగానే ఢిల్లీలో కాంగ్రెస్ వ్యతిరేకస్వరాలు మరింత అధికంగా వినిపించాయి. ఇప్పటికే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్న మమతాబెనర్జీ నాయకత్వంలోనిటిఎంసి, అఖిలేష్ నాయకత్వంలోని ఎస్పీ రెండూ కూడా ఆప్‌కే మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి. ఇది ఇండియా కూటమికీ నష్టమే, కాంగ్రెస్‌కునష్టమే. ఒకప్పుడు ఢిల్లీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. కేంద్రప్రభుత్వంలో ఏ పార్టీఉంటే ఢిల్లీలో కూడా అదేపార్టీ అధికారంలోకి రావడం రివాజుగా ఉండేది. కానీ ఆ ట్రాక్‌ను మార్చుతూ బిజెపి, తర్వాత ఆప్‌ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమిస్తూండడంతో 2013తర్వాత కాంగ్రెస్‌మళ్లీ ఆ ఛాయలకు కూడా వెళ్లలేకపోయింది. గతపదేళ్లలో ఆప్ రెండుసార్లువరుసగా విజయంసాధించగా, అంతకు ముందు బిజెపి ముందువరుసలోకి వచ్చింది. గతంలో షీలాదీక్షిత్ మూడు పర్యాయాలుముఖ్య

ఎ.వి.వి ప్రసాద్

మంత్రిగా ఢిల్లీలో కాంగ్రెస్‌ప్రతిష్టను ఇనుమడింపచేశారుగానీ తర్వాత వర్గపోరు పెరిగిపోయిచాలా బలహీనపడింది. చివరికి ఒక్కసీటు కూడాసాధించలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా 2015, 20ఎన్నికలలో తిరిగికోలుకో లేని దెబ్బతింది. దేశరాజధాని అయిన న్యూఢిల్లీలో ఒక పార్టీ, రాష్ట్రఅసెంబ్లీగా ఢిల్లీలో మరోపార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి కుంటు పడుతుందనే ప్రచారంతో బిజెపి గతంలో అధికారంలోకి వచ్చినా, ఆప్ దానిని వమ్ముచేస్తూ గత రెండు పర్యాయాలుగా అధికారంలో కొనసాగుతోంది. కానీ కేజ్రీవాల్ లిక్కర్‌స్కామ్‌లో చిక్కుకోవడం, అలాగే ఆయన కేబినెట్‌లోని సిసోడియా, మరికొందరు మంత్రులు కూడాతీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడంతో ఆప్‌ప్రతిష్ట చాలావరకు మసక బారింది. కానీ పేదప్రజలలో ఆప్‌కు ఇంకాఆదరణ ఉన్నదనే పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఢిల్లీ మహానగరంలో పేదలశాతం, అక్షరాస్యత లేనివారిశాతం అతితక్కువ గనుక ఆప్‌కువచ్చిన చెడ్డపేరును అడ్డంపెట్టుకొని తిరిగి అధికారంలోకి రావడానికి బిజెపి చాలాగట్టి ప్రయత్నమే చేస్తోంది. ప్రధాని మోడీస్వయంగా వీధివీధి తిరుగుతూ చేస్తున్న ప్రచారమే అందుకు ఉదాహరణ. దాదాపు 26 సంవత్సరాలుగా ఢిల్లీ అసెంబ్లీని కోల్పోయిన బిజెపి కూడా ఈఎన్నికలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వశక్తులను కూడగడుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ 53.6శాతం ఓట్లతో 62 సీట్లను సాధించింది. ఆఎన్నికల్లో బిజెపికి 8సీట్లుమాత్రమేలభించాయి. ఓట్లశాతం 38.5వరకుఉంది. అంటే సీట్లలోను, ఓట్లశాతంలో కూడా ఆప్‌అటు బిజెపికి గాని, కాంగ్రెస్‌కుగాని అందనంత దూరంలో ఉన్నదనే



ఓటింగ్ యంత్రం

చెప్పాలి. అప్పట్లో కాంగ్రెస్‌కు వచ్చినవి4.3శాతం ఓట్లు మాత్రమే. అసెంబ్లీలోకి అడుగుపెట్టే అవకాశం కూడాకోల్పోయింది. దానికి ముందు2015లో జరిగినఎన్నికల్లో 54.6శాతం ఓట్లతో ఆప్ 67 సీట్లు సాధించింది. అంటే బిజెపి మూడు సీట్లను మాత్రమే సాధించగలిగింది. ఆపార్టీకి వచ్చినఓట్లు 32.8శాతం. అదే సమయంలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాకపోయినా 9.7శాతం ఓట్లు మాత్రం వచ్చాయి. దీనిని బట్టిచూస్తే 20 కంటె 25లో ఆప్ ఓట్లశాతం కొంతకోల్పోగా కాంగ్రెస్‌మరికొంత ఓట్ల శాతాన్ని కోల్పోయింది. ఆ మేరకు బిజెపి ఓట్లశాతాన్ని పెంచుకోగలిగింది. కానీ సీట్ల మెజారిటీ మార్కును దాటకపోవడంతో అధికారానికి దూరంగా ఉండిపోవలసి వచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితిలో చాలామార్పు కనిపిస్తోంది. శాంతిభద్రతలు క్షీణించడం, వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం, పౌరసౌకర్యాలు సంతృప్తికరంగా లేకపోవడం, దానికితోడు అవినీతి ఆరోపణలు ఎక్కువ కావడం ఆప్‌కు మైనస్‌గా మారుతున్నాయనీ, వాటిని తనకు అనుకూలంగా ఉపయోగించుకొనడానికి బిజెపి యత్నిస్తున్నదనీ అంటున్నారు. ఈ పోటీలో కాంగ్రెస్ తనకు అనుకూలంగా ఒక్క అంశాన్ని కూడా ప్రస్తావించలేకపోవడంతో ఈ సారి కూడా ఆపార్టీ 'జీరో' స్థాయి దాటబోదనే అభిప్రాయమే వినిపిస్తోంది. కేంద్రం లో బిజెపి రాష్ట్రంలో ఆప్‌అధికారంలో ఉండడంతో 'ఉచిత' హామీలు యధేచ్ఛగా ప్రకటిస్తున్నారు. ప్రచారం విషయంలోకూడా కాంగ్రెస్‌కొంత వెనుకబడినట్లుగానే కనిపిస్తోంది. అన్ని పార్టీలకంటె ముందుగా, షెడ్యూలు రాకముందే ఆప్ తన అభ్యర్థులందరిని మూడు విడతలుగాప్రకటిం చింది. తర్వాత బిజెపి అభ్యర్థుల ప్రకటనదాదాపు పూర్తయింది. కానీ కాంగ్రెస్ ఇంకా మూడు వంతుల మంది అభ్యర్థులను ప్రకటించవలసిఉంది. ఇలా ఏవిధంగా చూసినాపోరు ప్రధానంగా బిజెపి, ఆప్‌మధ్యనే కనిపిస్తోంది. ఫిబ్రవరి 5న పోలింగ్ ముగిసిన తర్వాత 8వ తేదీన ఫలితాలు వెలువడతాయి. బిజెపి అధికారంలోకి వస్తే ఆప్ మరిన్ని గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే సూచనలున్నాయి. ●

# నియంతకే పగ్గాలు

వెనిజులా

ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నా అమెరికా, బ్రిటన్, యూరోప్ వంటి దేశాల ఎన్నికలు చెల్లనేరవని, తాము అధ్యక్ష ఎన్నికను గుర్తించడంలేదని ప్రకటించినా దక్షిణ అమెరికా దేశాల్లో కీలక దేశమైన వెనిజులాకు అధ్యక్షుడుగా నికోలస్ మదురో మూడోసారి ప్రమాణం చేసారు. ప్రమాణ స్వీకారానికి నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్‌ఓర్టెగా, క్యూబా మిగ్యూఎల్ డియాజ్ కేనెల్‌లతోపాటు చైనా, రష్యాల ప్రతినిధులు ఈ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. గత ఏడాదిజులైలో జరిగిన ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష నేత ఎడ్మండో గోంజాలెజ్ విజయం తనను వరించినా నికొలస్ ఏకపక్షంగా నియంతృత్వంతో తనకుతానుగా గెలిచినట్లు ప్రకటించుకుని ప్రమాణ స్వీకారంచేసారన్న అభియోగాలు వెంటాడుతున్నప్పటికీ మదురో ఈ వారంలో వెనిజులాకు యునైటెడ్ సోషలిస్టుపార్టీ నేతగా, అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసి అగ్రరాజ్యాలకు కంట్లో నలుసుగా మారారు. వెనువెంటనే అమెరికా, యూరోప్ దేశాలు తనపై ఆంక్షలు విధించడాన్ని కూడా తీవ్రగా వ్యతిరేకించారు. ప్రపంచంలో ఏశక్తికూడా వెనిజులాను లొంగదీసుకోలేదని ప్రకటించి అగ్రరాజ్యాలకు సవాల్ విసిరారు. వాస్తవవానికి ప్రతిపక్ష నేత గొంజాలెజ్‌కు ఈ ఎన్నికల్లో 67శాతం ఓట్లు వచ్చినట్లు ఆధారాలు చూపించారు. అలాగే మదురోకు 30శాతం మాత్రమే ఓట్లువచ్చినట్లు కూడా ఆయన తనవద్ద ఉన్న రుజువులు చూపించారు. వీటన్నింటితోనూ ఏకీభవించిన అగ్రరాజ్యాలు మదురో ఎన్నికను తాము గుర్తించడంలేదని ప్రకటించాయి. బైడెన్ సర్కారు అయితే మదురో ఆయన సన్నిహితుడు విధేయుడు కాబెల్లోను అరెస్టు చేసేందుకు అమెరికా సిద్ధం అయింది. ఆధారాలుచూపిస్తే ఏకంగా 10 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో 215కోట్లరూపాయలు రివార్డును కూడా ప్రకటించడం విశేషం. అంతేకాకుండా మదురోను వ్యతిరేకించి అమెరికాకు వలసవచ్చిన ఆరులక్షలమంది వెనిజులా వాసులకు తాత్కాలిక రక్షిత హోదా ఇచ్చింది అంటే వారివీసా గడువును పొడిగించింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై అమెరికాలో ఇప్పటికే పలుకేసులు నమోదయ్యాయి. నార్కో ఉగ్రవాదం, అంతర్జాతీయ కొకైన్

గన్ని మోహన్


అక్రమరవాణా కుట్రలో మదురో నిందితుడు. ప్రమాణ స్వీకారంచేసిన కొద్దినిమిషాలకే అమెరికా ఆర్థికశాఖ ఎనిమిది మంది వెనిజులాఅధికారులపై పలుఆంక్షలు ప్రకటించింది. మదురోతోపాటు ఆయన విధేయులుగా ఉన్నవారందరికీ వీసా ఆంక్షలు కఠినం చేసింది. దీనికంతటికీ కారణం వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో మదురో తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలే. అమెరికా బాటలోనే బ్రిటన్‌కూడా మదురోతోపాటు ఆయన విధేయులు 15మందిపై ఆంక్షలు ప్రక టించింది. వెనిజులా సాయుధ దళాలఅధికారులు, సుప్రీం జస్టిస్ ట్రిబ్యునల్‌కు చెందిన ఉన్నతస్థాయి వ్యక్తుల పైనా ఈ ఆంక్షలు విధించింది. యూరోపియన్ యూనియన్‌కూడామదురోతోపాటు 15మందిపై ఆంక్షలు ప్రకటించింది. ఎన్నికల్లో అవకతవకలే వీటికి కారణాలుగా ఈ దేశాలు చూపించాయి. వెనిజులాలో మానవ హక్కులు హరించి వేస్తున్నారన్న ఆరోప ణలతో ఆంక్షలు విధించిన దేశాల్లో కెనడాకూడా చేరింది. మదురోతోపాటు 14మంది సీనియర్ అధికారుల పైనా ఆంక్షలు ప్రకటించింది. జి7దేశాల కూటమి వెనిజులా అధ్యక్షుడుగా మదురో ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకించింది. ప్రజాస్వామ్య విధానంలోపించిందని మదురోను అధ్యక్షుడుగాతాము గుర్తించడంలేదని ప్రకటించాయి. ప్రతి పక్షాల ఆధ్వర్యంలో భారీఎత్తున ర్యాలీలునడిచినా మదురోవాటన్నింటినీ అణిచివేస్తూ అధ్యక్షుడుగా ప్రమాణం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని చెపుతూ ఆ ఎన్నికలను గుర్తించడంలేదని, అధ్యక్షుడుగా మదురోనుకూడా గుర్తించలేమని ప్రకటించాయి. అయినా కూడా మదురో తనదైనశైలిలో ప్రభుత్వాన్ని నడిపిస్తా



నికొలస్ మదురో

మంటూ ప్రమాణం చేసారు. కలిసివచ్చే శక్తులు, ఇరుగుపొరుగు మిత్రదేశాలు సహకరిస్తున్నాయని, తన ప్రజలే తనకు మూలం అంటూ పెద్దపెట్టున నినాదాలుచేస్తూ వెనిజులాను ఏశక్తికూడా లొంగదీసుకోలేదంటూ అగ్రరాజ్యాలకుసవాళ్లువిసిరారు. ఒకవవిధంగా చెప్పాలంటే అంతర్జాతీయంగా కూడా ప్రపంచదేశాలు ఈఎన్నికను అంగీకరించడంలేదు. 2019లో తిరుగుబాటుతో వచ్చిన ఆనాటి నాయకుడు జువాన్ గ్వైయిడో అధ్యక్షుడుగా వచ్చారు. అతడి ఎన్నికను అమెరికాతో పాటు 50దేశాలు గుర్తించాయి. ప్రతిపక్షనేత గోంజాలెజ్‌తోపాటు మరో ప్రతిపక్షనేతమూరియా కోరినా మచాడో కూడా భారీఎత్తున మద్దతుసమీకరించుకున్నా మదురో తనకుతాను అధ్యక్షుడుగా ప్రకటించుకుని ప్రమాణస్వీకారంచేసారు. దక్షిణ అమెరికా దేశాల్లో కేవలం 3.05కోట్ల జనాభా ఉన్న దేశంలో ఈ రాజకీయ అనిశ్చితి ఇప్పుడు ఆర్థికవృద్ధిని క్షీణింపచేస్తుందన్న వాదనలున్నాయి. 92.2 బిలియన్‌డాలర్ల జిడిపి ఉన్న దేశంలో సహజవనరులు కూడా పుష్కలంగానే ఉన్నాయి. కొలంబియా, గుయానా, బ్రెజిల్‌దేశాలు సరిహద్దులుగాఉన్న ఈదేశంలో డ్రగ్స్ విచ్చలవిడిగా వ్యాపారం జరుగుతుందని, నార్కొటిక్స్‌కు వెనిజులా మద్దతిస్తోందన్న అగ్రరాజ్యాలు ఇప్పటికే కేసులు నమోదుచేసాయి. ఈపరిస్థితుల్లో వెనిజులా అధ్యక్షుడుగా మూడో సారిపగ్గాలు చేపట్టిన నికొలస్ మదురోఅగ్రరాజ్యాల ఆంక్షలను ఏవిధంగా అధిగమిస్తారన్నది ప్రపంచ దేశాలకు ఉత్కంఠగా మారింది. ప్రతిపక్షాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేసిన మదురో పూర్తికాలం కొనసాగుతారా లేక నిరసనలకు తలొగ్గి విపక్షనేత గొంజాలెజ్‌కుపాలన అప్పగిస్తారా అన్నది అంతుబట్టకుండా ఉంది. అయితే ఆయన మద్దతుదారుల అంతరంగాన్ని పరికిస్తే ఒకసారి బాధ్యతలంటూ చేపట్టాకా ఎవ్వరు వ్యతిరేకించినా ఈ యుఎస్‌పినేత మదురో తనపదవిని సుతరాము వదులుకోరని బలంగా వినవస్తోంది ఈక్రమంలో అగ్రరాజ్యాలు వెనిజులాపై ఏ విధంగా వ్యవహరిస్తాయన్నదే ప్రపంచదేశాలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా నలుగుతోంది. ●

# భారతజాతి హృదయ సంపద 'యువతరం'



సుంకవల్లి సత్తిరాజు

గాడాంధకారంలో వెలుతురు కోసం అన్వేషించడం కంటే, చీకట్లు కమ్ముకోకముందే, రాబోయే విపత్కర పరిణామాలను సునిశితంగా పరిశీలించి, అవరోధాలకు అడ్డుకట్టవేయడం శ్రేయస్కరం. సచ్ఛీలత, నిజాయితీ, మానవీయత మనిషి వ్యక్తిత్వాన్ని శిఖర స్థాయిలో నిలబెడుతుంది. బ్రతుకు దెరువు కోసమో, ఇతర స్వార్థ ప్రయోజనాల కోసమో వ్యక్తిత్వాన్ని మసకబార్చు కోవడం దురదృష్టకరం. ఇదొక రకమైన భావదారిద్రం. పరుల అడుగులకు మడుగులొత్తే సంస్కృతిమారాలి. ఆత్మాభిమానం ప్రాణం కంటే విలువైనదనే సత్యాన్ని నేటి యువతరం గ్రహించాలి. వర్షం వెలసిన తర్వాత గొడుగును అవతలికి విసిరికొట్టడం, రుచిని ఆస్వాదించిన తర్వాత కూరలో కరివేపాకును తీసిపారేయడం, అవసరానికో రంగు మార్చడం, అవసరానికి అక్కరకు చేరి, అవసరం తీరిన తర్వాత అధః పాతాళానికి తొక్కడం విలువల పతనానికి పరాకాష్ఠ. ఇలాంటి భావాలు మారాలి. ముఖ్యంగా యువతను ఇలాంటి పెడధోరణుల నుంచి కాపాడాలి. యువజనం నిస్వార్థంతో, ఆత్మాభిమానంతో విలువల ఆధారంగా శ్రమశక్తిని, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని జీవించాలి. ప్రతిభకు మించిన ఆయుధం, వ్యక్తిత్వానికి మించిన ఆభరణం మరొకటి లేదనే సత్యం గ్రహించాలి. నిజమైన ప్రతిభ మరుగునపడిపోతే, అది సమాజానికి శాపం. దురదృష్టవశాత్తూ వర్తమాన పరిస్థితులు మేథస్సుకు, శ్రమకు గుర్తింపునిచ్చే విధంగా లేవు. అందుకే ప్రతిభకు గుర్తింపును దూరం చేయకూడదు. ప్రతిభ ఏ రూపంలో ఉన్నా గౌరవించే సాంప్రదాయం నెలకొనాలి. ప్రతిభను, గౌరవాన్ని, గుర్తింపును అడ్డదారిలో అణగద్రొక్కితే చరిత్రలో స్థానాన్ని కనుమరుగు చేస్తే భవిష్యత్తరాలు విలువైన సంపద కోల్పోయినట్టే. ఈ నిజాన్ని గ్రహించాలి. పూర్వకాలంలో ఇలాంటి పరిస్థితులున్నప్పటికీ జనం ఈ పోకడలను ఖండించేవారు. గొప్పవ్యక్తులను ఆరాధించేవారు. అందుకే నాటి మహనీయులు ఈనాటికీ జన హృదయాల్లో సజీవంగా మిగిలే ఉన్నారు. ఈ కోవలోకి చెందిన మహావ్యక్తి 'స్వామి వివేకానంద'. వివేకానందుని మార్గ నిర్దేశనం తరతరాలకు స్ఫూర్తిదాయకం. భారతదేశంలో నిరంతరం స్మరించుకునే మహనీయులెంతోమంది ఉన్నారు. వారిలో స్వామివివేకానందకు అగ్రతాంబూలం ఇవ్వాలి. ఇనుక కండరాలు, ఉక్కునరాలు, వజ్రసంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరమని వివేకానంద ప్రబోధించాడు. ఆత్మసాక్షికి మించిన దైవం గురువు మరొకటి లేదనే ఆ మహనీయుని సందేశం ప్రశంసనీయం. వివేకానందుని ప్రవచనాలు నేటి ప్రపంచానికి ఆదర్శప్రాయం. విద్య ద్వారా యువత చైతన్యమవుతుందని, విద్యద్వారా జాతికి జవసత్వాలు సిద్ధిస్తాయని విద్యప్రాధాన్యత చాటిచెప్పిన మహా యోగి, యువతకు స్ఫూర్తి, ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆరాధ్యుడు "స్వామి వివేకానంద". భారతీయ ఔన్నత్యాన్ని శిఖరాగ్ర పథంలో నిలబెట్టిన వివేకానందుని ఖ్యాతి అజరామరం. వివేకానంద జీవితంలో పెనుమలుపు తీసుకువచ్చిన 1893 సెప్టెంబర్ 11, చికాగో సర్వమత సమ్మేళనం చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుంది. "చికాగో" సర్వమత సమ్మేళనంలో మహామహులైన విద్యావంతులు, మత ప్రబోధకులుహాజరైనారు. వయసులోను, విద్యలోను ఉద్దండులైన వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్న నాటి సభలో వివేకానంద పాల్గొనడం భారతదేశానికి అఖండ ఖ్యాతిని తీసుకువచ్చింది. "మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా"అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన వెంటనే చికాగో సమ్మేళనం కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది. అప్పటి వరకు ప్రపంచానికి అంతగా పరిచయంలేని వివేకానందుని కీర్తి ఖండాంతరాలకు వ్యాపించింది. వివేకానందుని చికాగో ప్రసంగం ఆద్యంతం స్ఫూర్తి దాయకంగా, ఉత్కంఠ భరితంగా, ఉత్తేజభరితంగా కొనసాగింది. అలాంటి ప్రసంగం వినడం జన్మజన్మాల పుణ్యఫలంగా సభికులంతా ముక్తకంఠంతో నినదించారు. సామాజిక, తత్వ, సాహిత్యాంశాల్లో వివేకానందుని జ్ఞానాన్ని చూసి అంతా ఆశ్చర్యచకితులై, వివేకానంద ప్రతిభను వేనోళ్ళ కొనియాడారు. అమెరికాలోని పలు విశ్వవిద్యా లయాల ఆచార్యులు వివేకానందుని ప్రసంగానికి ఆక ర్షితులైనారు. పలు దేశాలు వివేకానందునికోసం ఆహ్వానాలు పంపాయి. వివేకానందుని అమెరికా ప్రయాణానికి ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా, ఎంతోమంది దాతలు విరాళాలు ప్రకటించి వివేకానందుని అమెరికా పయనానికి వెన్నుదన్నుగా నిలిచారు. ఎంతోమంది రాజులు వివేకానందుని ఆధ్యాత్మిక ప్రవచనాలకు, దేశభక్తికి ఉత్తేజితులై, అమెరికా ప్రయాణానికి ద్రవ్యాన్ని సమకూర్చి పెట్టారు. అయినా అతను తనప్రయాణానికి అవసరమైనదే తీసుకుని, చికాగో సర్వమత సమ్మేళనానికి అమెరికా బయలుదేరాడు. సభలో ముందుగామాట్లాడకుండా చివర మాట్లాడతానని ప్రకటించి, అనర్గళంగా ప్రసంగించి, తన దివ్యమైన రూపంతో, ప్రసంగపటిమతో, తన హృదయాంతరంగాన్ని అత్యున్నతంగా సభావేదికపై ఆవిష్కరించాడు. తరతరాలకు తరగని ఖ్యాతిని భారతీయులకు వారసత్వ సంపదగా అందించిన కారణజన్ముడువివేకానంద. మహాత్మాగాంధీ, బోస్ లాంటి భిన్న ధృవాలు వివేకానంద బోధనలకు ప్రభావితం కావడం విశేషం. కోల్‌కతాలో జన్మించిన నరేంద్రనాథ్ దత్తా యోగ, తత్వశాస్త్రాల్లో ప్రతిభ గడించి, ప్రపంచంలో వీటికి విశేషమైన ప్రాచుర్యాన్ని తీసుకువచ్చాడు. వివేకానంద రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు. వివేకానందుడు విగ్రహారాధ నను ఖండించాడు. తండ్రిని కోల్పోయిన తర్వాత కుటుంబ బాధ్యత మీద నరేంద్రునిపై పడింది. పేదరికం పీడించింది. సాధు సాంగత్యంలో, ఆధ్యాత్మిక చింతనలో పడి సర్వసంగ పరిత్యాగిగా మారిన నరేంద్రనాథ్ దత్తా వివేకానందుడిగా విశ్వవ్యాప్తపై వెలుగొందాడు. కాలినడక పయనం, సత్రాలు, గుడిసెలు విడిది. కటికనేలపై నిద్ర, జ్ఞాన సముపార్జన, జ్ఞాన బోధ ఇవే వివేకానంద నిత్య కృత్యాలు. "మానవ సేవే మాధవ సేవ అని నమ్మిన వివేకానందుడు" యువతపై తనదైన ముద్ర వేశాడు. రామకృష్ణ పరమహంస శిష్యుడిగా, రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడిగా వివేకానంద సేవలు మరపురానివి. వివేకానంద దేశభక్తి, జాతీయవాదం జాతీయ యోద్యమానికి ప్రేరణ, వన్నె తెచ్చాయి. రామకృష్ణ పరమహంస మరణం తర్వాత వివేకానంద భారత ఉపఖండంలో పర్యటించాడు. ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించి, భారతీయఖ్యాతిని ఇనుమడింప చేసాడు. తాను 40 సంవత్సరాలకు మించి తాను జీవించబోనని వివేకానంద ముందుగానే తన శిష్యులకు చెప్పడం జరిగింది. కేవలం 39సంవత్సరాల వయస్సులోనే తనువు చాలించి, భువి నుంచి దివి కేగాడు. ఆరోగ్యం క్షీణించినా తన శిష్యులకు జ్ఞాన ప్రబోధ చేస్తూ, దీర్ఘశ్వాస వదిలాడు. వివేకానందుడు సకల సద్గుణ సంపన్నుడు. మానవతావాది, జాతీయవాది. వివేకం, వినమ్రత కలగలిసిన మహావక్త. గుణాలలోను, ప్రసం గాలలోను, వ్యక్తిత్వంలోను వివేకానందునికి సరిసమానమైన వారు ఈ భూప్రపంచంలో ఎవరూ లేరనేది నిర్వివాదాంశం. మనిషిని మనిషిగా ప్రేమించి, మంచిని పంచి, మానవత్వంతో, సద్గుణాలతో, నిండైన వ్యక్తిత్వంతో జీవిస్తే, అలాంటి మనుషులే దేవుళ్ల వుతారు. ఆచంద్రతారార్కమై ప్రపంచం చేత కీర్తింపబడి, ప్రజల హృదయాల్లో సజీవంగా నిలబడిచరిత్రకు శోభను సమకూర్చగలరు. సద్గుణాలే సకల సంపద. కుబేరుడైనా, కుచేలుడైనా గుణం గడ్డికరిస్తే అధః పాతాళానికే. పుడుతూ తెచ్చే ధనంలేదు. పోతూ పట్టుకుపోయేదేమీలేదు. ఎంత విత్తమార్జించినా బంగారము మ్రింగి బ్రతకలేడన్నది జీవిత సత్యం. దేహమున్నంత వరకు మోహసాగరంలో మునిగి తేలుతూ, శరీరం ముడతలు పడి, జవసత్వాలుడిగి, అస్థిపం జరంలా మారి, జీవశ్ఛవంలా బ్రతుకీడ్చిననాడు జ్ఞానభిక్ష కోసం ప్రాకులాడడం, ముక్తి కోసం ఆరాటపడడంలో స్వార్థమే తప్ప పరమార్థంలేదు. కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఉన్నా పోయినా మంచితనాన్ని, జ్ఞానాన్ని దొంగలు దొంగిలింపజాలరు. ఈ భువిపై జీవించి ఉన్నప్పుడే సక్రమమైన నడవడికతో, వ్యక్తిత్వ వికాసంతో మెలగాలి. జీవిత చరమాంకంలో పశ్చాత్తాప పడినాఫలం శూన్యంవర్తమానంలో స్వార్థం పరాకాష్ఠకు చేరింది. మానవత్వ విలువలు మంటగలిసాయి. ధనార్జనకే గాని, విలువలకు పనికిరాని వ్యక్తుల వలనజాతికి ఒరిగేది శూన్యం. పరులనుహింసించి, జీవించే నాగరికత ప్రబలింది. యువతరం వెర్రివ్యామోహాల్లో తలమునకలై, సకల వ్యసనాలతో జాతికి పెనుభారంగా మారుతున్న నేపథ్యంలో భారతీయ యువకెరటం, వివేకానికి నిలువెత్తు నిదర్శనమైన స్వామి వివేకానంద చికాగో చారిత్రక ప్రసంగ స్ఫూర్తిని జ్వలింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●



నేడు స్వామి వివేకానంద జయంతి

# ఎన్నికల వేళ ఆప్‌కు కాగ్ షాక్




## ఢిల్లీ మద్యం పాలసీవల్ల రూ.2026 కోట్ల నష్టం, తేల్చిచెప్పిన కాగ్

**న్యూఢిల్లీ, జనవరి 11:** ఢిల్లీ మద్యంపాలసీ వ్యవహారం ఇపుడు ఎన్నికల సమయంలో కాగ్ పుణ్యమా అని మరోసారి తెరపైకి వచ్చింది. పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2026 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ మేరకు కాగ్ దీనిపై రూపొందించిన నివేదిక లీక్ అయినట్లు ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. ఢిల్లీమద్యం పాలసీ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో ఆమ్ ఆద్మీపార్టీ విఫలం అయిందని కాగ్ వెల్లడించింది. దీనిపై నిపుణుల కమిటీ సిఫారసులను నాటి డిప్యూటిసిఎం మనీశ్‌సిసోడియా నేతృత్వంలోని మంత్రులబృందం విస్మరించిందని తెలిపింది. అంతేకాకుండా ఈ పాలసీపై కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలోమంత్రిమండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సులు జారీ నిబంధనలు ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంది. ఈ పాలసీ వ్యవహారంలో అనేక ఫిర్యాదులు ఉన్నా అన్ని సంస్థలను వేలం వేసేందుకు అనుమతించారని గుర్తించింది. వేలం వేసిన సంస్థల ఆర్థికస్థితిగతులపై ఎలాంటిపరిశీలనలు జరపలేదని నష్టాల్లో ఉన్న కంపెనీలకూ అవకాశం ఇచ్చినట్లు తెలిపింది. వారికి లైసెన్సులను కూడా పునరుద్ధరించినట్లు నివేదిక తెలిపింది.

కాగా ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబరు 17న మద్యం పాలసీ తెచ్చింది. 2022 సెప్టెంబరు చివరిలో వెనక్కి తీసుకుంది. ఈ మద్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని ఆప్‌నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్‌పాలసీని సవరించేటపుడు సిసోడియా అక్రమాలకు పాల్పడ్డారనేది సిబిఐ ఇడిలు ఆరోపించాయి. లైసెన్స్ దారులకు అవసరమైన సాయంచేసి ప్రతిఫలంగా కొంతమొత్తాన్ని పొందినట్లు దర్యాప్తుసంస్థలు చెప్పాయి.

ఈ కుంభకోణంలో భాగంగా సిసోడియా ఢిల్లీమాజీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్ ఇతర ఆప్ నేతలను అధికారులు అరెస్టుచేసారు. కొంతకాలం క్రితం నేతలు బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదిలా ఉండగా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి ఐదున పోలింగ్ జరుగుతుండగా 8న ఫలితాలు వెలువడతాయి. ఈక్రమంలోనే కాగ్ నివేదికలోపేర్కొన్న అంశాలు ఇపుడు ఆప్ ప్రభుత్వానికి సంకట స్థితిని తెచ్చిపెట్టాయనడంలోసందేహంలేదు. ఎన్నికల్లో ఇపుడు కాంగ్రెస్, బిజెపిలు మద్యం పాలసీ, కాగ్ అంశాలనే ప్రధాన అస్త్రాలుగా మలుచుకోనున్నాయి.



### కార్చిచ్చులో బుగ్గిపాలయిన

# వెయ్యికోట్ల భవనం!

**లాస్ ఏంజెల్స్, జనవరి 11:** అమెరికాలోని లాస్‌ఏంజెల్స్ ప్రాంతంలో కార్చిచ్చు ఎన్నో ఇళ్లను బూడిదగా మార్చేసింది. ఈ విలయం పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో అత్యంత ఖరీదైన భవనాన్ని శిథిలంగా మార్చింది. ఆ మాన్షన్ విలువ సుమారు 125 మిలియన్ డాలర్లు ఉంటుంది. అంటే భారత కరెన్సీలో సుమారు 1077 కోట్లకుపైనే అని అంచనా. 18 పడకగదుల ఈ విలాస భవనం లుమినార్ టెక్నాలజీస్ సిఇఒ ఆస్టిన్‌రస్సెల్‌కు చెందినది. దీనిని అద్దెకు ఇస్తే రూ.3 కోట్లకుపైగానే వస్తోంది. సక్సెషన్ అనే టివి సిరీస్‌లో ఈ ఇల్లు కనిపిస్తుంది. దాంతోనే ఈ ఇల్లు అందరి దృష్టిని ఆకర్షించింది. కానీ ఇపుడు అబ్బురపరిచే ఫర్నిటచర్, సుందరమైన గార్డెన్స్ అన్నీ బూడిదగా మారిపోయాయి. అయితే ఈ ఇంటిగురించిన కథనాల్లో పూర్తిస్థాయి ధృవీకరణ లేదు. సిరిసంపదలతో తులతూగిన లాస్ ఏంజెల్స్ నగరం నేడు మరుభూమిని మరిపిస్తోంది. ఎగిసిపడుతున్న పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎటుచూసినా పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. ఆస్తినష్టం సుమారు 150 బిలియన్ డాలర్లకు పెరగవచ్చని అక్యూవెదర్ అంచనావేసింది. అమెరికా బీమారంగంకూడా ఈకార్చిచ్చుకు కుదలయ్యే భయాలున్నాయి. జెపిమోర్గాన్, మార్నింగ్‌స్టార్ అంచనాలప్రకారం 20 బిలియన్ డాలర్లవరకూ బీమా సంస్థలకు నష్టం ఎదురవుతుందని వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమాసంస్థ స్టేట్‌ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం మానేసింది.



## ప్రధానిమోడీపై సంస్కృతంలో మహాకావ్యం


**గంజాం(ఒడిశా), జనవరి 11:** రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన సంస్కృత పండితుడు సోమనాథ్ ప్రధాని నరేంద్రమోడీపై మహాకావ్యాన్ని రచించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మోడీ జీవన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, ఆయన రాసిన రచనలను వివరిస్తూ 12 అధ్యాయాలు, 1200 శ్లోకాలతో నరేంద్ర ఆరోహణం పేరిట ఈ మహాకావ్యాన్ని రాసినట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఈగ్రంథ రచనకు ప్రతాప రుద్రీయం, కావ్య ప్రకాశం వంటిప్రాచీన సంస్కృత ఇతిహాసాల శైలిని అనుసరించానన్నారు. దీనిని రాయడానికి నాలుగేళ్లు పట్టిందని వివరించారు. గుజరాత్‌లోని వెరావల్‌లో జరిగిన యువజనోత్సవంలో ఈపుస్తకం ఆవిష్కరించినట్లు సోమనాథ్ అన్నారు. ఈ కావ్యాన్ని హిందీ, ఆంగ్లభాషల్లో అనువదించినట్లు చెప్పారు. సోమనాథ్ ఈ కావ్యంపై మాట్లాడుతూ ప్రధానిమోడీ జీవన విధానం రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు.

# నీలిరంగులో సూర్యుడు!

## 200 యేళ్లక్రితం అలా కనిపించడంపై వీడిన రహస్యం

### భూమిపై భారీ అగ్నిపర్వతం బద్దలవడం వల్లేనని తేల్చిన శాస్త్రజ్ఞులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** ప్రస్తుతం సూర్యుడు ఏ రంగులో వుంటాడంటే అందరు చాలా సులభంగా సమాధానం చెబుతారు. సూర్యోదయం, సూర్యాస్తమయం వేళలో నారింజరంగు మధ్యాహ్నం వేళ తెల్లటి పాలరంగులో వుంటాడనేది అందరికి తెలిసిన విషయమే.




అయితే రెండు వందల సంవత్సరాల క్రితం సూర్యుడు కొంతకాలం పాటు నీలి రంగులో మారడంపై నెలకొన్న రహస్యాన్ని స్కాట్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు రట్టు చేశారు. సూర్యుడు ఏమిటి నీలం రంగులో మారడం ఏమిటని అందరు ఆశ్చర్యపోవచ్చు. కానీ 1831లో ఇది జరిగిందని స్కాట్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు ఆధారాలతో సహా రుజువు చేశారు. దీనికి సంబంధించి సూర్యుడు నీలి రంగులో మారితే ఎలా వుంటాడనే దానిపై ఒక ఫోటోను కూడా వారు విడుదల చేశారు. 1831 సంవత్సరంలో భూమిపై సంభవించిన భారీ అగ్ని పర్వత విస్పోటనం వల్ల ఎగసిపడిన సల్ఫర్ డయాక్సైడ్ భూవాతావరణంలోకి ప్రవేశించిందని, దీని కారణంగా గాలిలో ఇది భారీగా విస్తరించి మేటలు వేసిందని, ఈ కారణంగా దాదాపు భూమండలంలో అన్ని ప్రాంతాలలో కొంతకాలం పాటు సూర్య కిరణాలు నీలం రంగులో కనిపించాయని ఆ యూనివర్సిటీ సైంటిస్టులు తేల్చారు. అప్పట్లో అగ్ని పర్వతం బద్దలవడం వల్ల భూవాతావరణం చాలామేరకు చల్లబడిందని, ఇదే సమయంలో కొన్ని విచిత్రమైన మార్పులు చోటుచేసుకున్నాయని వారు తెలిపారు. దీని ప్రభావం వల్ల సూర్యుడి కాంతి భూవాసులకు నీలి రంగులో కొంత కాలం కనిపించిందని ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అనేజర్నల్‌లో ఒక అధ్యయనం ప్రచురితమయ్యింది. స్కాట్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు ఈ విషయాలను తమ పరిశోధనలో తేల్చారు. 1831 నాటి వాతావరణ రికార్డులను వారు విస్తృతంగా విశ్లేషించి ఈవిషయాలను ధృవీకరించారు. అగ్నిపర్వతంనుంచి, మంచు అంతర్భాగంనుంచి సేకరించిన బూడిదలను ల్యాబ్‌లో విశ్లేషించగా అసలువిషయం బయట పడిందని అధ్యయన రచయితలు చెబు తున్నారు.

అప్పట్లో పేలిన అగ్ని పర్వతం రష్యా, జపాన్ మధ్యవున్న వివాదాస్పద భూభాగంలో గల సిముషీర్ ద్వీపంలోని జవారిట్స్కీ పేరిట వుందని కూడా వారు నిర్ధారించారు. దీనికి సంబంధించిన రాతపూర్వక వివరాలను ఇంత వరకు ఏనాడు నమోదు చేదయలేదని వారు తేల్చారు. అప్పట్లో పేలిన అగ్ని పర్వతం జవారిట్స్కీ సిముర్‌షీర్ ద్వీపంలో జనావాసం లేని ప్రాంతంలో వుండడం, ఆ ప్రాంతానికి చాలా దూరం వరకు జనసంచారం లేకపోవడంతో దీని గురించి అప్పట్లో ఎవరు పట్టించుకోలేదని సైంటిస్టులు తెలిపారు.

### నేను పోటీలో ఉంటే...

# ట్రంప్‌ను ఓడించేవాడినే!



## మీడియాతో బైడెన్ చిట్‌చాట్

**వాషింగ్టన్, జనవరి 11:** నేనుకానీ ఎన్నికల్లో పోటీచేసి ఉంటే ట్రంప్‌ను సులువుగా ఓడించేవాడినని ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తిరిగి పోటీచేయకూడదనే నిర్ణయంపై విచారిస్తున్నారా ఆ చర్య ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కావడానికి సహాయపడిందని అనుకుంటున్నారా అని మీడియా ప్రశ్నలకు బైడెన్ స్పందిస్తూ తాను అలా అనుకోవడం లేదన్నారు. తాను ఎన్నికల బరిలోఉంటే ట్రంప్‌ను కచ్చితంగా ఓడించేవాడినని విశ్వాసం వ్యక్తంచేసారు. కమలా హ్యారిస్ ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించగలదని తాను భావించానని అందుకనే ఆమెకు మద్దతిచ్చానని అన్నారు. అందుకు అనుగుణంగానే కమల కూడా తీవ్రస్థాయిలో కృషిచేసారన్నారు. ఆమె ట్రంప్‌ను ఓడిస్తుందన్న నమ్మకంతోనే తాను పోటీనుంచి వైదొలిగినట్లు చెప్పారు. తొలుత అధ్యక్ష ఎన్నికల రేసులో నిలబడిన జోబైడెన్‌కు సొంతపార్టీనేతలనుంచే వ్యతిరేకత వచ్చింది. ఆరోగ్యసమస్యలతో అధ్యక్ష ఎన్నికల రేసునుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. డెమొక్రటిక్‌పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్‌కు తన మద్దతును ప్రకటించారు. పదవులకంటే ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే కీలకమని అందుకే పదవినుంచి దిగిపోవాలన్న తన నిర్ణయాన్ని అప్పట్లో బైడెన్ సమర్థించుకున్నారు. అమెరికా రాజకీయాల్లో స్పష్టమైన విభజన ఉందని దానికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

నియంత నిరంకుశులకంటే కూడా దేశం గొప్పదన్నారు. అమెరికాలో మెటా థర్డ్‌పార్టీ ఫ్యాక్ట్ చెకింగ్ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోడాన్ని జోబైడెన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య సిగ్గుచేటని అన్నారు. లాస్‌ఏంజెల్స్ ప్రస్తుతపరిస్థితి యుద్ధభూమిలా మారిందని బైడెన్ అన్నారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సమర్థురాలంటూ ప్రశంసించారు. నవంబరు 5న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌చేతిలో కమాలా ఓడిన సంగతి తెలిసిందే.



# బిజెపి సిఎం అభ్యర్థి బిదూరీయే!

### - కేజ్రివాల్ విమర్శ

**న్యూఢిల్లీ, జనవరి 11:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న తరుణంలో ఆప్, బిజెపి ఒకదానిపై ఒకటి తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి. ఈక్రమంలో తనకు ఉన్న సమాచారంన రపకారం బిజెపి సిఎం అభ్యర్థి రమేశ్‌బిదూరి అని ఆమ్ ఆద్మీపార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. అంతకుముందు ఢిల్లీ సిఎం అతిశికూడా ఇవే వ్యాఖ్యలుచేయడం గమనార్హం. మాకున్న సమాచారం మేరకు రమేష్ బిదూరీయే బిజెపి తన సిఎం అభ్యర్థిగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లో ప్రకటన వస్తుందని, సిఎం అభ్యర్థి అవుతున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు.

దేశరాజధాని విషయంలో ఆయన విజన్ ఏంటో చెప్పాలి. బిజెపి తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఢిల్లీ అభివృద్ధి ఇతర అంశాలపై సిఎం అభ్యర్థులు చర్చల్లో పాల్గొనాలని కేజ్రివాల్‌సవాల్ విసిరారు. ఢిల్లీ సిఎం అతిశి లక్ష్యంగా బిదూరి ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. సిఎం అతిశి ఆమె తండ్రినే మార్చేసారని, గతంలో ఆమెకు ఒక ఇంటిపేరు ఉండగా ప్రస్తుతం మరోపేరు వినియోగిస్తున్నారని ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన అఫ్జల్‌గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలని ఆమె తల్లితండ్రులు పిటిషన్‌కూడా దాఖలుచేసారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక వాద్రాపైనా వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తన నియోజకవర్గంలోని రోడ్లన్నీ ప్రియాంక గాంధీ బుగ్గల్లా తీర్చిదిద్దుతామని అన్నారు. దీనితో కాంగ్రెస్ నాయకులు మొత్తం ఆయనపై మండిపడ్డారు. తనపై చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ సీఎం అతిశి నిప్పులు చెరిగారు. ఓట్లకోసం ఎంతకైనా దిగజారుతారని ఆమె రమేష్‌ను విమర్శలతో చీల్చిచెండాడారు.

# భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ కొత్త వ్యూహం!



## సరిహద్దు వెంబడి యాంటీ పర్సనల్ మైన్స్ ఏర్పాటు

**శ్రీనగర్, జనవరి 11:** యావత్ ప్రపంచం అభివృద్ధివైపు పరుగుతీస్తున్నా.. పాకిస్థాన్ ప్రవర్తనలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. అభివృద్ధిని పక్కనబెట్టి.. భారత్‌ను ఎలా దెబ్బ తీయాలా? అని అవకాశం కోసం ఎదురుచూస్తోంది. సమయం దొరికినప్పుడల్లా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న పాక్.. తాజాగా భారత్, పిఒకె సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఒసి) వెంబడి రక్షణ సామర్థ్యాన్ని అనూహ్యంగా పెంచుతోంది. కంచె వెంబడి పెద్దసంఖ్యలో యాంటీ పర్సనల్ మైన్స్ ఏర్పాటు చేయడంతోపాటు స్పెషల్‌సర్వీస్ గ్రూప్ కమాండోలు, మాక్ ఫైరింగ్ యూనిట్లను సిద్ధం చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

**యాక్షన్‌లోకి మళ్లీ హిజ్బుల్!**

నియంత్రణ రేఖ వెంబడి ఓ పక్క సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటున్న పాకిస్థాన్.. స్థానిక ఉగ్రవాద సంస్థలను కూడా యాక్టివేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో భారత సైనిక వాహనాలే లక్ష్యంగా జరిగిన దాడుల్లో హిజ్బుల్ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు భారత రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మందుపాతరలు పెట్టి సైనిక వాహనాలను పేల్చేయడం. వారు అప్రమత్తయ్యేలోపే మాటువేసి వారిపై కాల్పులు జరపడం హిజ్బుల్ వ్యూహంలోభాగం. ఈతరహా ఘటనలు జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవలకాలంలో ఎక్కువవు తున్నాయి. దీన్నిబట్టి కొన్నాళ్లుగా స్తబ్దుగాఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ తన కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీని వెనక పాక్‌హస్తం ఉందన్నవిషయం బహిరంగ రహస్యం.

**వ్యూహం మార్చిన పాకిస్థాన్**

సైన్యంతో భారత్‌ను ఎదుర్కొనే సత్తాలేని పాకిస్థాన్.. దొంగదెబ్బ తీయాలని ప్రయత్నిస్తోంది. నేరుగా యుద్ధానికి దిగకుండా ఉగ్రవాదులను పావులుగా వాడుకుంటోంది. వారికి ఆశ్రయం కల్పిస్తూ మారణహోమాలకు పురిగొల్పుతోంది. ఒకవేళ భారత్ ఎదురు తిరిగితే.. పాకిస్థాన్‌పై దాడికి పాల్పడుతోందంటూ అంతర్జాతీయ వేదికలపై భారత్‌నుదోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే.. తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్, హిజ్బుల్ తదితర ఉగ్రనాగులకు పాలుపోసి పెంచుతోంది. కశ్మీర్ లోయలోఉండే స్థానిక ఉగ్రవాదులనే తమకు అనుకూలంగా మార్చుకుంటూ భారత్‌పై దాడులకు సిద్ధం చేస్తోంది.

# ఎమ్మెల్యే అనుమానాస్పద మృతి



**లూధియానా,జనవరి 11:** పంజాబ్‌లోని లూదియానా వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గురుప్రీత గోగీ(58) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాలప్రకారం ఎమ్మెల్యే గోగీకి శుక్రవారం అర్థరాత్రి బుల్లెట్ గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోపే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన తలలో రెండు బుల్లెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదవశాత్తూ తుపాకీ పేలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు డిసిపి కుల్దీప్‌సింగ్‌చాహల్‌పేర్కొన్నారు. 2022లో ఆప్ పార్టీలోచేరిన గోగీ లూథియానా నియోకవర్గం నుంచి రెండుసార్లు గెలిచారు. గోగీ మృతిపై కుటుంబసభ్యుల వివరాలు భిన్నంగా ఉన్నాయి. ఆయన కుటుంబసభ్యులు మాత్రం ఎవ్వరూ కాల్చలేదని, ఆటైమ్‌లో ఆయన గదిలో ఒంటరిగానే ఉన్నారని, అదిప్రనమాదవశాత్తూ జరిగిన సంఘటన కావచ్చని చెపుతున్నారు. తుపాకీని గురుప్రీత్ శుభ్రంచేస్తుండగా ప్రమాదవశాత్తూ పేలి బుల్లెట్ గాయం అయిందని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. శవపరీక్ష నివేదిక వచ్చాక ఘటనపై మరింత స్పష్టత రావొచ్చని అధికారులు చెపుతున్నారు. కాగా ఎన్నికల్లో లూదియానా వెస్ట్‌లో ఆయన మాజీ మంత్రి భరత్ భూషణ్ ఆషూని ఓడించారు.

# ఇది డెమోక్రాట్ల 'నీచమైన ఆట'

## హష్‌మనీ కేసులో బేషరతు విడుదల అమలుపై ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 11:** హష్‌మనీ వ్యవహారంలో అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యూయార్క్ జడ్జి బేషరతు విడుదలను అమలు చేస్తూ తీర్పు ఇచ్చిన విషయం విదితమే. తాజాగా ఈ తీర్పుపై ట్రంప్ స్పందించారు. ఇది డెమొక్రాట్ల 'నీచమైన ఆట' అని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు. 'నాకు బేషరతు విడుదలను ఇచ్చారు. ఇలాంటి కేసు ముందెన్నడూ లేదని లీగల్ స్కాలర్లు, నిపుణులు చెబుతున్నారు. ఈ స్కామ్ మొత్తం కొట్టివేయడానికి అర్హమైనది. ఈ బూకటపు కేసుపై మేము అప్పీల్ చేస్తాం.

అంతేకాక, ఒకప్పటి మన గొప్ప న్యాయవ్యవస్థపై అమెరికన్లు పెట్టుకున్న నమ్మకాన్ని పునరుద్ధరిస్తాం' అని ట్రంప్ రాసుకొచ్చారు.

హష్‌మనీ కేసులో ట్రంప్ ఇప్పటికే దోషిగా తేలారు. అయితే.. గత నవంబరులోనే న్యూయార్క్ కోర్టు ఆయనకు శిక్ష ఖరారు చేయాల్సి ఉంది.

అదే సమయంలో అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారు. దాంతో తాను క్రిమినల్ విచారణ ఎదుర్కోకుండా రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ట్రంప్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు తొలుత శిక్షను నిరవధికంగా వాయిదా వేయగా.. అనంతరం రక్షణ కల్పించే అవకాశాలు లేవని తేల్చింది.

ఈ క్రమంలోనే శుక్రవారం న్యూయార్క్ జడ్జి తీర్పు వెలువరించారు. దోషిగానే నిర్ధారిస్తూ ఎలాంటి శిక్ష, జరిమానా లేకుండా బేషరతు విడుదలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో దోషిగా నిర్ధారణ అయిన తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలవనున్నారు. జనవరి 20న ఆయన నూతన అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించనున్న విషయం తెలిసిందే.

**ఏమిటీ హష్‌మనీ కేసు..?**

శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారనే ఆరోపణలు ఉన్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా 1.30 లక్షల డాలర్ల హష్‌మనీని ఇప్పించారన్నది ఆరోపణ. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచే ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని, అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేశారన్నది ప్రధాన అభియోగం.

ఇలా మొత్తం 34 అంశాల్లో ఆయనపై నేరారోపణలు నమోదయ్యాయి. ఆరు వారాల విచారణ తర్వాత ట్రంప్‌పై మోపిన అభియోగాలన్నీ నిజమేనని 12 మంది జడ్జిలతో కూడా ధర్మాసనం ఏకాభిప్రాయంతో ఆ మధ్య తీర్పు వెలువరించింది.

ట్రంప్‌తో ఏకాంతంగా గడిపిన మాట వాస్తవమేనని స్టార్మీ డానియల్స్ స్వయంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆమెతో సహా మొత్తం 22 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం.. శిక్షను వెలువరించింది.

# తమిళనాడు అభివృద్ధిపై ఓర్వలేని గవర్నర్



## సిఎం స్టాలిన్ రుసరుసలు

**చెన్నై, జనవరి 11:** డిఎంకె నాయకత్వంలోని తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య దూరం పెరుగుతోంది. మరోసారి గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అభివృద్ధినిచూసి ఆయన జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలుచేసారు. గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్న పిల్లల చేష్టల మాదిరిగా ఉందని రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతలు నిర్వర్తించలేకపోయారని తమిళనాడు అభివృద్ధిని చూసి ఆయన జీర్ణించుకోలేక పోతున్నారని సిఎం తీవ్ర విమర్శలుచేసారు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆరోపిస్తూ గవర్నర్ ఆర్ఎన్‌రవి ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. రాజ్యాంగం జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగిందని, జాతీయ గీతాన్ని గౌరవించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక విధి అని అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయంటూ ఇటీవలే ఎక్స్‌లో పోస్టుకూడాచేసారు. ఈ పరిణామాలతో అధికార డిఎంకె ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య మరోసారి విభేదాలు ఏర్పడ్డాయి. రాష్ట్రప్రజలను ప్రభుత్వాన్ని ఆయన ఎప్పుడూ అవమానిస్తున్నారని ఆరోపించిన సిఎం స్టాలిన్ గవర్నర్ చర్యపై మరోసారి విమర్శలుచేసారు.



ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## హక్కులను స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

### ఆదివాసుల శిక్షణ తరగతుల ఆఖరిరోజు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**నాగార్జునసాగర్, ప్రభాతవార్త, జనవరి 11:** హక్కులను స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వారంరోజులుగా నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రాజెక్టు హౌస్ లో ఏర్పాటుచేసిన ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయబోతున్నాం. ఒక్కో దఫా 6000 చొప్పున సంవత్సరంలో రెండు దఫాలుగా 12,000 భూమిలేని పేదల ఖాతాల్లో జమ చేస్తాం కాంగ్రెస్ శ్రేణులు ధైర్యంగా గ్రామాల్లో సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి. గిరిజనుల కోసం తెచ్చిన పీసా, అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేస్తాం. అటవీ సంపదలో గిరిజనులకు హక్కులు అన్ని ఇందిరమ్మ రాజ్యంలో వస్తాయి. ఐటీడీఏలకు పునర్జీవం కల్పిస్తాం. కావలసిన బడ్జెట్ కేటాయిస్తాం, నిరుద్యోగులకు శిక్షణ ఇస్తాం, స్వయం ఉపాధిని కల్పిస్తాం. భారత రాజ్యాంగాన్ని బలహీనపరచాలని, సామాన్యుల హక్కులను కాల రాయాలని పెద్ద కుట్ర జరుగుతుందని, రాజ్యాంగాన్ని రక్షిస్తే అది మనందరినీ రక్షిస్తుంది రాహుల్ గాంధీ ఈ మార్గంలో వేగంగా నడుస్తున్నారన్నారని అంతే వేగంగా కాంగ్రెస్ శ్రేణులు నడవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం తూచా తప్పకుండా.. సంపూర్ణంగా అమలు బాధ్యత నేనే తీసుకుంటాను, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ కి సంబంధించి తాను చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్టానానికి ఒక నివేదిక ఇచ్చి తూచా తప్పకుండా అమలు చేయాలని కోరామని ఆ తర్వాత తాను డిప్యూటీ స్పీకర్ గా ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఆమోదం పొందిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 10 శాతం నిధులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే... రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉండటంతోనే సబ్ ప్లాన్ చట్టం అమలు చేయగలుగుతున్నామని ప్రజల్లో గట్టిగా ప్రచారం చేయాలని ఆదివాసీ ప్రజాప్రతినిధులను డిప్యూటీ సీఎం కోరారు.

రాష్ట్రంలో పీసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని 100 సంపూర్ణంగా అమలు చేస్తాం అన్నారు.ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేపట్టిన పాదయాత్రలో ఇందిరమ్మ ప్రభుత్వం వస్తుందని ఇల్లు లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు చెప్పాను. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో హక్కులు కాదు మాట్లాడే స్వేచ్ఛను కోల్పోయాం అని రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని అన్నారు. తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు.

## డీజిల్ ఖర్చుల నిర్వహణ కోసమే టికెట్ ధరల పెంపు

### స్పెషల్‌బస్‌ల రేట్లపై వివరణ ఇచ్చిన టిజిఎస్‌ఆర్‌టిసి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** స్పెషల్ బస్సుల్లో రేట్ల పెంపుపై టీజీఎస్‌ఆర్టీసీ స్పష్టత ఇచ్చింది. ఎందుకోసం ఎక్కువ రేట్లను వసూలు చేయాలని ప్రయాణీకులకి ఆర్‌టీసీ యాజమాన్యం వివరణ ఇచ్చింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు .. ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుందని ప్రకటించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తున్నట్టు తెలిపింది. పండుగుల, ఇతర స్పెషల్ అకేషన్స్ సందర్భంగా .. స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ సంక్రాంతికి కేవలం 5 రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్‌ఆర్టీసీ సవరించినట్టు ప్రకటించింది. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు ఆర్‌టీసీ యాజమాన్యం సూచిస్తోంది. తమ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవారు ఆర్‌టీసీ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించింది.

## 24 నుంచి ఓయు పిహెచ్‌డి అడ్మిషన్లకు దరఖాస్తులు

### ఫిబ్రవరి 23 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ

### షెడ్యూల్‌ను ప్రకటించిన ఓయు అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వందేళ్లకిపైగా చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో కేటగిరీ-2లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ)-2025 అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఓయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫిబ్రవరి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. అపరాధ రుసుం రూ. 2000తో మార్చి 5 వరకు స్వీకరించడానికి అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు వివిధ ఫ్యాకల్టీల, వివిధ సబ్జెక్టులలో కేటగిరీ-2 పీహెచ్‌డీ-2025 ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించనున్నారు.

# సరస్వతి అంతర్వాహిని పుష్కరాలు ఘనంగా నిర్వహించాలి

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ముక్తీశ్వర ఆలయం, గోదావరి సంగమ తీరంలోని పుష్కర ఘాట్లను కాశీ, హరిద్వార్, ప్రయాగ పుణ్యక్షేత్రాల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతినది అంతర్వాహిని పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించేందుకు శనివారం సచివాలయంలో ఏర్పాట్లను చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. పర్వదినాల సందర్భంగా చేసే ఏర్పాట్లలాగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలన్నిటిని అత్యాధునిక వసతులతో కళాత్మకంగా రూపొందించాలని శ్రీధర్ బాబు సూచించారు. సరస్వతి పుష్కరాలు దేశంలో మరెక్కడా జరగవని, కాళేశ్వరం సంగమ స్థలంలో మాత్రమే వందల ఏళ్లుగా నిర్వహిస్తున్నారని ఆయన వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లు, స్నాన ఘట్టాల ఆధునీకరణ, శానిటేషన్ పనుల కోసం కేటాయించిన రూ.25 కోట్ల నిధులను సద్వినియోగం చేసి కాళేశ్వరం ప్రతిష్ఠ నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని అన్నారు. తెలంగాణా, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్రల కూడలిలో గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహినిగా సరస్వతి ప్రవంతి కలిసే చోటు అత్యంత పవిత్రమైన సంగమమని ఆయన గుర్తు చేశారు. స్నాన ఘట్టాలను ఆధునికంగా నిర్మించాలి, రోడ్లను పునర్నిర్మించి, విస్తరించడం, భగీరథ డ్రైనేజీ నిర్మాణం, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన పనులను వేగం పూర్తి చేయాలి. పుష్కరాల నిర్వహణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలి. హెలికాప్టర్ జాయ్ రైడ్ల కోసం హెలిపాడ్లకు మరమ్మతులు చేసి సిద్ధం చేయాలి. ఆలయ పర్యాటక ప్రదేశంగా కాళేశ్వరానికి చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి ఏడాది పొడవునా భక్తులు వచ్చేలా ఎక్కడ రాజీ పడకుండా మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టాలి. పేరున్న కన్సల్టెంట్ సంస్థలను నియమించుకునే స్వేచ్ఛ మీకుంది. దేవాదాయ, నీటి పారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, రెవెన్యూ, టూరిజం, ట్రాన్స్‌కో, ఆర్‌టిసి అధికారులంతా కలిసి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లలో పాలు పంచుకోవాలి. కాళేశ్వరంలోని ఆర్టీసి బస్ స్టేషన్ ఉన్న ప్రదేశంలో అత్యాధునిక, ఆకర్షణీయమైన నూతన బస్ స్టేషన్‌ను నిర్మించాలి. అత్యాధునిక వీధి దీపాలు, ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. వీటి కోసం రూ.62 లక్షల నిధులు ఇప్పటికే విడుదలయ్యాయి. కొత్త జనరేటర్ సెట్ లను కూడా కొనుగోలు చేసి సిద్ధం ఉంచాలి. ఫిబ్రవరి 7 నుంచి 19 వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం పనులను కూడా ఎక్కడా లోపం లేకుండా చేపట్టాలి. సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ కమిషనర్ ఇ.శ్రీధర్, జాయింట్ కమిషన్ రామకృష్ణారావు, ఎస్. ఈ, దుర్గాప్రసాద్, టూరిజం ఎండి ప్రకాశ్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ మల్లూర్ నాయక్,



ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ నిర్మల, డిపిఒ నారాయణరావు, ఇరిగేషన్ ఇఇ తిరుపతి, డిఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు, కాళేశ్వరం ఇఓ. మారుతి, భూపాలపల్లి ఆర్‌టిసి డివిజనల్ మేనేజర్, డిఎం ఇందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ముక్తీశ్వరాలయం వార్షిక క్యాలండర్ ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు. ఫోటోలో దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ కమిషన్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## భువనగిరిలో బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి

### ఫర్నిచర్ ధ్వంసం.. నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయింపు

### నిరసనకారులను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



**భువనగిరి రూరల్, జనవరి 11, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి నేపథ్యంలో భువనగిరిలో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహించిన కాంగ్రెస్ శ్రేణులు జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసి కెసిఆర్, కేటీఆర్ ఫోటోలతోపాటు కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కెసిఆర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులను అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడికి నిరసనగా బిఆర్ఎస్ నాయకులు పట్టణ కేంద్రంలోని రైతు బజార్ ముందు ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీవ్ర ఉద్రిక్తమైన సంఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి**

పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంపై దాడి చేసి కార్యా లయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన కాంగ్రెస్ శ్రేణులను కఠినంగా శిక్షించాలని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణ కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి భువనగిరి ఎమ్మెల్యే కొమ్మ అనిల్‌కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని దగ్ధం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. డిసిపి స్థాయిలో రివ్యూ నిర్వహించుకుని శాంతిభద్రతలను కాపాడాలని పోలీసులను కోరారు. దాడులు ఇలానే కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని, దాడికి ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరించారు.

## ఒక దేశం, ఒకే ఎన్నికతో దేశంలో నియంత పాలన

### సెప్టెంబరు 21 నుంచి 24 వరకు జాతీయ మహాసభలు

### పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నియంత పాలనను తీసుకువచ్చేందుకు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సంసిద్ధం కావాలని సీపీఐ శ్రేణులకు పిలుపు నిచ్చారు. హైదరాబాద్ బండ్లగూడలోని గిరి ప్రసాద్ భవన్‌లో శుక్రవారం సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో సీపీఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్టు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రకటించారు.

ఇటీవల దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచేందుకు బీజేపీ ధనబలంతో పాటు, ఇండియా కూటమి అనైక్యత కూడ తోడైందని అజీజ్ పాష తెలిపారు. దీంతో బీజేపీ విజయం సులభమైందన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికీ కొనసాగుతోంద.., ఈ ఉద్యమానికీ సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వర్తించాలని సూచించారు.

## బ్రిటిష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు వడ్డె ఓబన్న

### పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

### ఘనంగా తొలితరం స్వాతంత్ర్య సమరయోధుని 218వ జయంత్యుత్సవం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 11, ప్రభాతవార్త :** బ్రిటిష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు వడ్డే ఓబన్న అన్న టీపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ బాల్యమిత్రుడు ఉయ్యాలవా నరసింహారెడ్డితో కలిసి వారిపై వీరోచిత పోరాటంచేసి చరిత్రపుటల్లో నిలిచిపోయిన తొలితరం భారత స్వాతంత్ర్య సమరయోధుడు, చిరస్మరణీయుడని కొనియాడారు.

తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తర గతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉద యం రవీంద్రభారతి ప్రధాన మందిరం వైభవంగా జరిగిన భారతదేశ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహేష్‌కుమార్‌గౌడ్ విశిష్ట అతిథులు సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితర నాయకులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించి మాట్లాడారు. తెల్లదొరపై సైన్యాధ్య క్షుడుగా అలుపెరగని పోరాటం చేసి 39 యేళ్ల యువప్రాయంలో వీరమరణం పొందారని జోహార్లు అర్పించారు.

బిసిలు కులాలను పక్కనపెట్టి ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, బిసిలకు మరెవ్వరూ సాటికాదని గుర్తుంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే కేవలం రాహుల్‌గాంధీ చలవేనన్నారు.

బిసిల పాత్ర ఎనలేనిది మరువలేదని స్పష్టం చేశారు. వడ్డెర కులస్తులు కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులతోనే సరిపెట్టుకోవద్దని, ఎమ్మెల్యేలుగా పోటీచేసి ఎన్నికయ్యేస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

బిఆర్ఎస్ బిసిలపై కపటిప్రేమ చూపించిందని, వారు ఎదగకుండా గుదిబండగా నిలిచిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఎల్లవేళలా బిసిల అభున్నతికి కట్టుబడి ఉందని భరోసానిచ్చారు. భవిష్యత్తులోనూ వడ్డెర కులానికి




సభలో ప్రసంగిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, వి.హనుమంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

భారత్‌జోడో యాత్రాసమయంలో ప్రజల ఆక్రందనలు అర్ధంచేసుకుని కులగణన చేపట్టాలని ఆయన నిర్ణయించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో 95 శాతానికిపైగా కుల సర్వే పూర్తయిందని, ఆ రిపోర్టు ఆధారంగా బిసిలకు హక్కులు అడిగే ఆస్కారం ఉందని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. బిసిలంతా ఐక్యంగా ఉండి హక్కులను తమ హక్కులను కాపాడుకోవాలని సూచిస్తూ వడ్డె ఓబన్న దేశానికి చేసిన సేవలను మననం చేసుకొని ఘననివాళులర్పించారు. అనంతరం జాజుల శ్రీనివాస్‌గౌడ్, మిగతా అతిథులు ప్రసంగించారు.

## కుంభమేళా వేళ సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలు

### వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో హోటళ్ల బుకింగ్‌పై జాగ్రత్తగా ఉండాలి: పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** యుపిలోని ప్రయోగరాజ్‌లో జరగనున్న మహా కుంభమేళ పురస్కరించుకుని ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలను ఎంచుకున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) గుర్తించింది. వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో హోటళ్లలో బుకింగ్‌లు చేస్తామని ప్రజలను నమ్మించే కొన్ని గోల్‌మాల్ సంస్థలను సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన టిజిసిఎస్‌బి ఈ విషయంలో కుంభమేళాకు వెళ్లే అందరు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించింది. ఇందులో ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా క్షణాల వ్యవధిలో బ్యాంకులోని నగదు ఖాళీ అవడం ఖాయమని టిజిసిఎస్‌బి అధికారులు పేర్కొన్నారు. కుంభ మేళకు వెళ్లేవారు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారిక వెబ్‌సైట్లనే వాడాలని, సోషల్ మీడియాలో వచ్చే వెబ్‌సైట్లను పట్టించుకోవద్దని, ఆకర్షణీయమైన ప్రకటనలతో కనిపించే వాటిని నమ్మవద్దని అధికారులు కోరారు. సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారు వెంటనే 1930కు ఫిర్యాదు చేస్తే చాలావరకు మేలు జరుగుతుందని వారు తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలబారిన పడకుండా వుండాలంటే నిరంతరం అప్రమత్తంగా వుండడమే మేలని టిజిసిఎస్‌బి అధికారులు తెలిపారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను అందించిన దృశ్యం

## షేక్ దస్తగిరిబాషాకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో సత్కారం

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన షేక్ దస్తగిరి భాషాకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డుతో సత్కరించే కార్యక్రమం శనివారం నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. 75 సంవత్సరాల వయస్సులో కూడా ఐదు భాషలలో మిర్రర్ ఇమేజ్‌లో ప్రతిభ కనబర్చినందుకుగాను ఈ పురస్కారంతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర ఏసీపీ(క్రైమ్స్) కెఎం.కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్ ఇ.వెంకటాచారి, ఈస్‌జోన్ అదనపు డీసీపీ రామ్‌దాస్ తేజావత్ హాజరై షేక్ దస్తగిరి భాషాను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేష్, డాక్టర్ వి.శ్రీనాథాచారి, సంఘసేవకుడు దాసరి దయానంద్‌రెడ్డి, వరల్డ్ రికార్డు గ్రహీత డాక్టర్ పేరడీ గురుస్వామి, మెమోరీ ఛాంపియన్ డాక్టర కె.నరేందర్‌రెడ్డి, డాక్టర్ టి.వి.అశోక్‌కుమార్, డాక్టర్ సంఘిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ చింతపట్ల సాయిబాబా, డాక్టర్ అక్షరం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక బయోమెట్రిక్‌తోనే ఎస్సీ స్కాలర్‌షిప్‌లు

### ఎస్సీ సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఇకపై పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి. బ్యాంక్ అకౌంట్ సైతం ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. 2024-25 విద్యాసంవత్సానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా తొలుత ఆధార్‌కార్డులో, ఎస్సెస్సీ మెమోలో పేరు ఒకేలా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే సరి చేసుకోవాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అలాగే ఈ పాస్‌లో నిర్ధారించుకున్న తదుపరి మీ సేవ కేంద్రాల్లో సదరు విద్యార్థులు బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ అథెంటికేషన్ పూర్తయ్యాక ఈ పాస్ వెబ్‌సైట్‌లో స్కాలర్‌షిప్ దరఖాస్తు రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేసుకోవాలని తెలిపింది.

విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పకుండా డిజిటల్ కీని కొనుగోలు చేసుకుని, ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొంది. డిజిటల్ కీ ఆధారంగా కాలేజీ యాజమాన్యాలే ఆన్‌లైన్‌లో విద్యార్థుల అప్లికేషన్లను పరిశీలించి, స్కాలర్‌షిప్‌ల మంజూరుకు అధికారులకు పంపించాలని కొత్త మార్గదర్శకాల్లో వెల్లడించింది.

## సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు అందుకుంది. 3వ జాతీయ పవర్ జనరేషన్ వాటర్ మేనేజ్మెంట్ అవార్డ్స్-2025లో భాగంగా న్యూఢిల్లీలో కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో అవార్డును ఎస్టీపీపీ డీజీఎం (ఈ అండ్ ఎం) డి. పంతులు అందుకున్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డ్ రావడంపై సంస్థ సింఎండి ఎన్ బలరాం హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ కేంద్రాల కంటే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవార్డు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

# ఆ కుటుంబాల్లో తీరని విషాదం

### కొండపోచమ్మ రిజర్వాయర్‌లో ఐదుగురు యువకుల గల్లంతుతో శోకసంద్రంగా మారిన హైదరాబాద్‌లోని ముషీరాబాద్, ఖైరతాబాద్

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 11, ప్రభాతవార్త:** సరదాగా స్నేహితులందరూ కలసి ఈత కోసం సిద్ధిపేట కొండపోచమ్మ రిజర్వాయర్‌కు వెళ్లటం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్‌కు చెందిన నర్సింగ్‌రావు జయశ్రీ దంపతులకు ధనుష్(20), లోహిత్(19) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ధనుష్ తండ్రికి ఫొటోగ్రఫీలో సహాయపడుతూ పనిచేస్తుండగా, లోహిత్ మీర్‌పేటలోని తీగల కృష్ణారెడ్డి కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవలు కావటంతో ముషీరాబాద్‌లోని మార్టినేట్ హైస్కూల్‌లో కలిసి చదువుకున్న స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లాలని ప్లాన్ చేసుకుని, అందులో భాగంగా కొండపోచమ్మ రిజర్వాయర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో వారి ఇంటికి బాల్య స్నేహితులైన బన్సీలాల్ పేటకు చెందిన దినేశ్వర్(17), ఖైరతాబాద్‌కు చెందిన జతిన్(17), అత్తాపూర్‌కు చెందిన సాహిల్(19), రాంనగర్‌కు చెందిన మురుగన్(20), ముషీరాబాద్‌కు చెందిన ఇబ్రహీం(20)లు వచ్చారు.

అందరూ ద్విచక్ర వాహనాలపై ఇంట్లో వారికి చెప్పి ఎంతో ఆనందంగా బయల్దేరి వెళ్లారు. స్నేహితులందరూ సరదాగా నీటిలో ఆడుతూ ఫొటోలు దిగుతూ ఉండగా ఒక్కసారిగా ఐదుగురు నీటిలో గల్లంతయ్యారు. ఇది గమనించిన వెంటనే ఇబ్రహీం, మురుగన్‌లు సురక్షితంగా బయటకు వచ్చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందటంతో నర్సింగ్‌రావు కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. సరదాగా స్నేహితులతో విహారయాత్రకు వెళ్లి మృత్యువాత పడటంతో ముషీరాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఎమ్మెల్యే ముఠా గోపాల్ దిగ్భ్రాంతి**

యువకులు సరదాగా రిజర్వాయర్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందటం పట్ల ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న వయసులో యువకులు మృతి చెందటం చాలా విచారకరమని, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

# సంక్షేమ పథకాలు అర్హులకే చేరాలి

## ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**చేవెళ్ల, జనవరి 11, ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేద వారికి లబ్ధిచేకూరే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సుకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసన సభ్యులు పార్లమెంటు సభ్యుల సూచనలను అభిప్రాయాలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఎంపిక చేయుటలో ప్రణాళిక బద్ధకంగా అమలు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామస్థాయిలో మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను వార్డు వద్ద ఉండే విధంగా చూడాలని, గ్రామసభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతంలో టామ్ టామ్ వేయించాలని తెలిపారు.

రాబోయే ఉగాది నుండి పౌర సరఫరాల దుకాణాలలో సన్నబియ్యం ఇవ్వటానికి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన తెలియజేశారు. గ్రామస్థాయి, మున్సిపల్ స్థాయిలో పర్యటించే బృందంలో వ్యవసాయ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ప్రతినిధులు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లోభూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడుతలుగా 12,000 అందజేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అవకాశం ఇవ్వాలని అన్నారు. శాసన సభ్యులు సూచించిన విధంగా అర్బన్ ప్రాంతంలో గాని రూరల్ ప్రాంతంలో గాని ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే రెండో విడతలో రాజీవ్ స్వగృహ మాదిరిగా 10 అంతస్తుల భవన సముదాయం నిర్మించి ఇల్లులేని వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు ఎంపికలు 2014 జిఓ ప్రకారం అర్హత గల వారికి వచ్చే విధంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అన్నారు.

# సంక్రాంతి సందర్భంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌జామ్

## ఫాస్ట్‌ట్యాగ్‌లో సరిపడ డబ్బులు లేక మొరాయించడంతో టోల్‌గేట్ వద్ద భారీగా వాహనాలు

**చౌటుప్పల్, జనవరి 11, ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా హైద్రాబాద్‌లో నివాసం ఉంటున్న సీమాంధ్రులు కుటుంబ సభ్యులతో కలిసి స్వస్థలాలకు వెళ్తున్న సందర్భంగా శనివారం హైద్రాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి గ్రామంలోని టోల్ ప్లాజా వద్ద ప్రయాణికులతో కిటకిటలాడింది. కిలో మీటర్ల దూరం వాహనాలు పేరుకపోయాయి. గంటలు గడిస్తే తప్పా టోల్ గేట్ దాటే పరిస్థితి లేకుండా పోయింది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా హైద్రాబాద్‌లో ఉంటున్న సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వారు ప్రత్యేక వాహనాలను తీసుకుని స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. సోమ, మంగళ వారాల్లో బోగి, సంక్రాంతి పర్వదినాలు కావడంతో ఆంధ్ర, కోస్తా ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది ఇంటి బాట పట్టారు. హైద్రాబాద్ నుంచి తెల్లవారుజాము నుంచే వాహణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని యాదాద్రి జోన్ డిసిపి రాజేష్ చంద్ర, రాచకొండ ట్రాఫిక్ డిపిసి సుర్కంటి మల్లారెడ్డి, ఎసిపి పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి ప్రభాకర్‌రెడ్డిలు సందర్శించి పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తంగడపల్లి చౌరస్తా, వలిగొండ క్రాస్ రోడ్డు ల వద్ద ఉన్న రోడ్ క్రాస్‌లో బారికేట్లు ఏర్పాటు చేసి పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. పంతంగిలోని టోల్‌ప్లాజాలను సందర్శించి జాతీయ రహదారిపై రాకపోకలను పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, టోల్‌ప్లాజా మేనేజర్, సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణపై సమీక్షించి పలు సూచలను చేశారు. శనివారం ఉదయం ఓ దశలో చౌటుప్పల్ పట్టణం దాటేందుకే గంట సమయం పట్టింది. టోల్ ప్లాజా వద్ద సంక్రాంతి పర్వదినం కావడంతో తెల్లవారు జాము నుంచే హైద్రాబాద్ వైపు నుంచి విజయవాడ, గుంటూరు వైపు భారీ ఎత్తున వాహానాలను వెల్లడం ఆరంభమయ్యాయి. కొన్ని వాహానాలకు ఫాస్ట్‌ట్యాగ్‌లో సరిపగ్గ డబ్బులు లేక, టోల్ మొరాయించడంతో వాహానాలు టోల్‌గేట్ దాటేందుకు భారీగా సమయం పడుతుంది. పండుగ కోసం ఆనందంతో బయలుదేరిన ప్రయాణికులంతా రహదారిపై పిల్లలతో నానా ఇక్కట్లకు గురయ్యారు. రాజదాని ప్రాంతం దాటిన తర్వాత భారీ ట్రాఫిక్ ఉడటంతో జాతీయ రహదారిపై ఉన్న ప్రతి హోటల్ వద్ద భారీగా వాహానాలను నిలిపి టిఫిన్స్, భోజనాలు చేసి తిరిగి ప్రయాణం సాగించారు. మండలంలోని ప్రతి గ్రామ స్టేజి వద్ద, యూ టర్న్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్‌పెక్టర్ మన్మదకుమార్, పలువురు ఎస్ఐలు, పెద్ద ఎత్తున పోలీసు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ రూ.88.55 కోట్ల డివిడెండ్ చెల్లింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ రూ.88.55 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ డివిడెండ్ చెక్కును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేశారు. సింగరేణి కాలరీస్ చెల్లింపు మూల ధనం(పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్ )లో 10 శాతాన్ని డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తం సుమారు రూ.173 కోట్లు కాగా.. సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో నుంచి 88.55 కోట్ల రూపాయలను డివిడెండ్ చెల్లించింది. సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలు తీర్చుతూ లాభాలను ఆర్జిస్తూ కార్మికులకు లాభాల వాటా చెల్లించడమే కాకుండా ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌లు చెల్లించడంపై సిఎం ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు.



# కుప్పకూలిన రైల్వేస్టేషన్ పైకప్పు

**కన్నౌజ్(యుపి), జనవరి 11:** ఉత్తరప్రదేశ్‌లో ఘోరప్రమాదం జరిగింది. కన్నౌజ్ రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దీనితో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికిచేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. శిథిలాల కింద కనీసం 20 మంది చిక్కుకుని ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. ఇప్పటివరకూ ఆరుగురిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. శిథిలాలకింద వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యుపిలోని కన్నౌజ్ రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనుల్లోభాగంగాపలు నిర్మాణాలుచేపట్టారు. ఈక్రమంలోనే శనివారం మధ్యాహ్నం రెండో అంతస్తులో ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదానికి గలకారణాలపై అధికారులు ఆరాతీస్తున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై యుపి సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. సహాయక చర్యలు వేగవంతంచేయాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# తెలంగాణలో పెరుగుతున్న సైబర్ నేరగాళ్ల జాబితా

## ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాలో బడా నేరగాళ్లకు బ్యాంకుల ఖాతాలు ఇస్తున్న యువతీయువకులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు చెందిన బడా నేరగాళ్లతో పాటు వారికి సహకరిస్తున్న చోటా నేరగాళ్లను కటకటాల్లో నెడుతుండడం తెలిసిందే. ఇప్పటి వరకు టిజిసిఎస్‌బి అరెస్టు చేసిన నేరగాళ్లలో ఉత్త ర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా వున్నారు. అయితే కొంతకాలంగా ఈ జాబితాలో తెలంగాణకు చెందిన వారు చేరడం సంచలనం రే పుతోంది. ఉమ్మడి హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు చెందిన కొందరు యువతీ యువకులు విదేశాలతో పాటు రాజస్తాన్, ఢిల్లీ కేంద్రంగా బడా నేరగాళ్లకు సహకరించేందుకు తమ బ్యాంకుల ఖాతాలను అందిస్తున్న వైనం పోలీసులను నివ్వెర పరుస్తోంది. ఉన్నత విద్యావంతులైన యువతీ యువకులు, కేవలం ఐ దు నుంచి పది శాతం కమీషన్ల కోసం వీరంతా తమ జీవితాలను నాశనం చేసుకుంటుండడం పోలీసులను షాక్‌కు గురిచేస్తోంది. ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై దృష్టి సారించిన టిజిసిఎస్‌బి ఈ తరహా నేరాలను తెలంగాణలో మొగ్గ దశలోనే తుంచి వేసేందుకు నిర్ణయించి ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేం దుకు నడుం బిగించింది. టిజిసిఎస్‌బి అధికారులు రెండు నెలల క్రితం గుజరాత్, రాజస్తాన్‌లకు చెందిన 40 మంది వరకు అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేయ డం తెలిసిందే. వీరంతా మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా (ఈ మూడు దేశాలను సైబర్ నేరాలు ఎక్కువగా జరిగే గోల్డెన్ ట్రయంగల్‌గా పిలుస్తారు) జ రిగే సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నట్లు తేలింది. ఈ మూడు దేశాలలో వుంటున్న బడా సైబర్ నేరగాళ్లకు ఇక్కడ పట్టుబడ్డ నేరగాళ్లు కేవలం బ్యాంకుల ఖాతాలను ఇస్తు ంటారు. ఇందుకుగానూ ఐదు నుంచి పది శాతం కమీషన్ తీసుకుంటారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను అనేకరకాల మోసాల పేరిట మోసం చేస్తూ కాజేసిన నగదు ను లోకల్ నేరగాళ్ల బ్యాంకుల ఖాతాలకు మొదట వెళతాయి. అటుపిమ్మట వీరి ఖాతాల నుంచి విదేశాల్లో వుండే బడా నేరగాళ్ల ఖాతాలకు నగదు లేదా క్రిప్టో కరెన్సీ ద్వారా వెళుతుంటుంది. ఇప్పటి వరకు దేశంలో జరిగే సైబర్ నేరాలకు మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా పనిచేస్తున్న బడా సైబర్ నేరగాళ్ల ప్రధాన కా రణం కాగా వీరికి భారత్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందిన లోకల్ నేరగాళ్లు సహకారం అందిస్తున్నారు. అయితే ఇప్పుడు మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్ర ంగా పనిచేస్తున్న బడా సైబర్ నేరగాళ్లకు తెలంగాణకు చెందిన యువతీ, యువకులు బ్యాంకుల ఖాతాలు ఇస్తున్న ఉదంతాలు పెరిగిపోతున్నాయి,. నెల రోజుల క్రితం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన కొందరు ఈ తరహా నేరం చేసి అరెస్టవగా ఆ తరువాత హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు ఇదే తరహాలో పోలీసులకు చిక్కారు. ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట్‌లోని మూడు గ్రామాలకు చెందిన 20 మంది యువతీ యువకులు ఈ తరహా నేరం చేసి పోలీసులకు దొరికిపోయారు.

ఇందులో కొందరు మొదటిసారి నేరం చేయగా మరికొందరు రెండు అంతకు ఎక్కువసార్లు బడా నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. వీరిని అదుపులోకి తీసుకుని విచారి స్తున్న పోలీసులు కొందరిపై కేసు నమోదు చేయగా బ్యాంకు ఖాతాలు ఇచ్చినప్పటికీ నగదు లావాదేవీలు జరగకుండా వున్న వారి విషయంలో మందలింపుతో సరిపుచ్చేం దుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. బడా నేరగాళ్లకు సహకరించడం అనేది ఇటీవలే తెలంగాణలో మొదలయ్యింది.

# పనిచేసే వారికే పదవులు, కెసి వద్ద అందరి రిపోర్ట్

## టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాల అభ్యర్థికే మద్దతు ఇస్తాం

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తాం.. 4 పేర్లు పరిశీలిస్తున్నాం

## దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటాం

## సంక్రాంతి తర్వాతే మంత్రివర్గ విస్తరణ: పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** వచ్చే 20 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని హైకమాండ్ గట్టి వార్నింగ్ ఇచ్చిందని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని బరిలోకి దించబోమని, మిత్ర పక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తామన్నారన్నారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు,మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెల చివరి నాటికి పార్టీలో అన్ని కమిటీలను నియమిస్తామని, పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు ఇస్తామని తెలిపారు. కార్పోరేషన్ పదవుల భర్తీ జనవరి నెలలోపు అయిపోతుందని మహేష్ కుమార్ పేర్కొన్నారు.

కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత దానం వ్యాఖ్యలను పరిశీలిస్తామని, ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అందరి రిపోర్ట్ వద్ద కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. కాగా, దానం నాగేందర్ ఇటీవల మాట్లాడుతూ... ఫార్ములా ఈరేసుతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందన్నారు. అందులో అవినీతి జరిగిందా? లేదా? ఇప్పుడే చెప్పలేమని వ్యాఖ్యానించారు.

హైడ్రా కారణంగా ప్రజలకు నష్టం జరుగుతోందని తాను గతంలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని కూడా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ పైవిధంగా స్పందించారు. ఈనెల 14న ఢిల్లీ వెళ్తున్నామని చెప్పారు. 15న ఢిల్లీలో జరిగే ఏఐసిసి ఆఫీస్ ప్రారంభోత్సవంలో పాల్గొంటామని అన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన డి.వి. సత్యనారాయణరావు

కాగా, సీనియర్ నాయకుడు డి.వి. సత్యనారాయణరావు కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆయనుకు కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణకు పట్టిన గ్రహణం

## తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన బిజెపి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి రాష్ట్ర శాఖ బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల స్నేహం తెలంగాణకు పట్టిన గ్రహణమని తెలంగాణ బిజెపి ట్వీట్ చేసింది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణల గురించి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై సంచలన ఆరోపణలు చేసింది. ఈ సందర్భంగా ఆసక్తికర పోస్ట్ పెట్టింది. ఈ పోస్ట్ లో ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైందని, కాళేశ్వరం కేసు గతేందని, ధరణి సమస్యలకు పరిష్కారం ఏది అని ప్రశ్నిస్తే దానికి రేవంత్ రెడ్డి తెలీదు.... గుర్తులేదు.. మర్చిపోయా.. అని చెబుతారని ఎద్దేవా చేసింది. ఇక దీనిపై రహస్య ఒప్పందాలతో, చీకటి స్నేహాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ, సమస్యలను పరిష్కరించకుండా బిఆర్ఎస్ కాంగ్రెస్ కేవలం తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని బిజెపి ట్వీట్టర్‌లో పేర్కొంది.

# పదవులు శాశ్వతం కాదు, అభివృద్ధే స్థిరం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


**దమ్మపేట ఏజెన్సీ, జనవరి 11, ప్రభాతవార్త :** :పదవులు శాశ్వతం కాదు ఎప్పటికీ అభివృద్ధే శాశ్వతం అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండ రెడ్ల గిరిజన గ్రామం లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జిల్లా అధికారులతో కలిసి పర్యటించారు. గత నెల 14వ తేదీన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి మంత్రి తుమ్మల పూసుకుంట గ్రామంలో పర్యటించారు. ఆరోజు గ్రామస్తులు పూసుకుంట గ్రామానికి వ్యవసాయ రంగానికి బోర్లు, విద్యుత్తు, రహదారి కావాలని కోరారు. సమస్యలు తెలుసుకున్న మంత్రి తుమ్మల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి సంక్రాంతి లోపు గ్రామస్తుల సమస్యలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా సంక్రాంతికి ముందే రహదారి అనుమతులను వచ్చేలా చర్యలు చేపట్టారు. రహదారులకు మధ్య అవసరమైన మూడు వంతెనలను రూ :4. కోట్ల 18 లక్షల పనులను శనివారం నాడు ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జిల్లా అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. వ్యవసాయ భూములకు 12 బోర్లు ఏర్పాటు చేసి పామాయిల్ సాగు ప్రక్రియను ప్రారంభించారు. అక్కడే ఉన్న గిరిజనులతో వారి భాషలో మాట్లాడుతూ పామాయిల్ సాగు తో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపిన విధంగా అంతర పంటగా మునగ సాగు చేయవలసిందిగా వారికి తెలిపారు. అనంతరం గ్రామస్తుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులను పూసుకుంట, కటుకూరు గ్రామాలకు అవసరమైన విద్య, వైద్యంతో పాటు వారి అభివృద్ధికి కావలసిన వనరుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులతో మాట్లాడించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ సొంత జిల్లా కి కలెక్టర్, ఎస్పి, పి ఓ లు మంచి పని చేసేవారు దొరకటం నా అదృష్టం అన్నారు. గిరిజనులు బిడ్డలు కూడా మన స్థాయిలో కూర్చునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకుంటుందన్నారు. కొండ రెడ్ల జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపిన విధంగా ఆదివాసీలకు కావలసినటువంటి వసతులను పూర్తిగా ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో అధికార యంత్రాంగం మొత్తం పూసుకుంట, కటుకూరు గ్రామాలపై దృష్టి పెట్టి వ్యవసాయ రంగం, విద్యా , వైద్యం, స్వయం ఉపాధి సంఘాల ద్వారా వారిని అభివృద్ధి చేయాలన్నారు. ఈ గ్రామంలో ఉన్న ఆదివాసి ప్రతి బిడ్డ పాఠశాలలో చేర్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, చదువు ద్వారా కుటుంబం ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, సమాజంలో మంచి గుర్తింపుతో పాటు అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

తాను పనిచేసిన కాలంలో ఆదివాసీ బిడ్డల చదువుల కోసం ఎక్కువగా రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటు చేయడం జరిగిందని. ఆదివాసి బిడ్డలు చదువుకొని ఆ కుటుంబాలు చాలా సంతోషంగా ఉన్నాయన్నారు. ప్రతి బిడ్డను మీరు కష్టపడి చదివించండి మీ తాతలు, తల్లిదండ్రులు, ఆకులు అలములు తిని బ్రతికారని కానీ నేడు మీ పిల్లలు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని వారి జీవితాలు మారాలని అన్నారు. గతంలో పనిచేసిన ప్రభుత్వంలో 30 కోట్లు అభివృద్ధికి కేటాయించానని గ్రామ అభివృద్ధి చెందాలంటే రహదారి చాలా అవసరం అన్నారు.

# దేశంలో పదికి పెరిగిన హెచ్‌ఎంపివి కేసులు

## అసోం, గుజరాత్‌లలో ఇద్దరు చిన్నారులకు వైరస్

**న్యూఢిల్లీ, జనవరి 11:** దేశంలో హెచ్‌ఎంపివి వైరస్‌కేసులు వణుకుపుట్టిస్తున్నాయి. ఎక్కువగా చిన్నారులు, వయోవృద్ధులు, తీవ్రస్థాయి వ్యాధులతో బాదపడుతున్న వారిలోనే ఈ వైరస్ ఎక్కువ ఉన్నట్లు అదికారులు గుర్తించారు. ఎనిమిదికేసులవరకూ నమోదయిన భారత్‌లో గుజరాత్‌లో మరోచిన్నారికి హెచ్‌ఎంపివి వైరస్ ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే అస్సోంలోని దిబ్రూఘర్‌ప్రాంతంలో పదినెలల చిన్నారికి హెచ్‌ఎంపివి సోకినట్లు అదికారులు శనివారం తెలిపారు. దీనితో భారత్‌లో మొత్తం హెచ్‌ఎంపివి కేసులు పదికి పెరిగాయి. అస్సోంలో బాధిత చిన్నారి ప్రస్తుతం అసోం మెడికల్‌కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నాలుగురోజులక్రితం చలిసంబంధిత లక్షణాలతో చిన్నారి ఆసుపత్రిలో చేరిందని సూపరింటెండెంట్ ధృభజ్యోతిభూయాన్ తెలిపారు. ప్రస్తుతంచిన్నారి ఆరోగ్యపరిస్థితి స్థిరంగా ఉందన్నారు. ఇది సాధారణ వైరస్సేనని 2014నుంచి దిబ్రూగఢ్‌జిల్లాలో 110 హెచ్‌ఎంపివికేసులు గుర్తించినట్లు ఐసిఎంఆర్ రీజినల్‌మెడికల్‌రీసెర్చి సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ బిశ్వజిత్ తెలిపారు. ఇదిలా ఉంటే గుజరాత్‌లో హెచ్‌ఎంపివి కేసులుమొత్తం నాలుగకు పెరిగాయి. అహ్మదాబాద్‌లోని తొమ్మిది నెలల బాండుకు జలుబు దగ్గుతోపాటు శ్వాసతీసుకోవడంతో ఇబ్బందులు రావడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలోచేర్చారు. వైద్యపరీక్షల్లో హెచ్‌ఎంపివి వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.



# హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు అధ్యయనం

## వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళిక

## పాఠశాలలు, ప్రభుత్వ ఆఫీసులపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు

## ఆదివాసీల గృహాలకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితం

## విద్యుత్ శాఖపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** గ్రేటర్ హైదరాబాద్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. వివిధ దేశాల్లోని బెస్ట్ పాలసీని పరిశీలించి రిపోర్ట్ అందించాలని ఆదేశించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపల పూర్తిగా అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యుత్ శాఖ పై సిఎం సమీక్ష నిర్వహించారు. దేశంలోనే అత్యుత్తమ అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేయాలని సిఎం తన ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటు అన్ని రకాల కేబుల్స్‌కు అండర్ గ్రౌండ్ లోనే ఉండేలా వివిధ ప్రత్యమ్నాయాలు పరిశీలించాలని చెప్పారు. అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం ద్వారా విద్యుత్ నష్టాలను తగ్గించడంతో పాటు విద్యుత్ చౌర్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. రాబోయే వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా డిస్కంలు సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. గత ఏడాది మార్చిలో రాష్ట్రంలో పీక్ డిమాండ్ 15,623 మెగా వాట్లకు చేరిందని, ఈ సారి 16,877 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గరిష్ఠ విద్యుత్ డిమాండ్ అంచనాకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కు ప్రణాళిక చేసుకోవాలని సిఎం ఆదేశించారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు మార్చి నెలలో పీక్ విద్యుత్ డిమాండ్ ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరిస్తున్నందున రోజు రోజుకు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరగాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు వచ్చినా వెంటనే సమీపంలోని మరో ఫీడర్ నుంచి ప్రత్యమ్నాయంగా సరఫరా చేసే వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని చెప్పారు. ఆదివాసీ గూడేలలో గృహాలకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు అటవీశాఖ, గిరిజన సంక్షేమం శాఖతోపాటు సంబంధిత శాఖలతో సమావేశమై వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను రూపొందిం చాలన్నారు. పూర్తి నివేదిక ఆధారంగా ఆదివాసీ గూడేలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సోలార్ విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపే కంపెనీలను ఆహ్వానించి ఏ విధానంలో వారికి పనులను అప్పగించాలనే ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించాల న్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. పరిగి వద్ద 400 కేవీ సబ్ స్టేషన్ మంజూరయినా పదేళ్లుగా పెండింగ్‌లో ఉందని, దానికి సంబంధించిన పురోగతి నివేదికను అందించాలని అధికారులకు ఆదేశించారు. గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మించనున్న నేపథ్యంలో స్టేడియం పక్కనే ఉన్న సబ్ స్టేషన్‌ను మరోవైపు తరలించాలని సూచించారు. మరింత అదనపు సామర్థంతో పూర్తిగా అధునాతన టెక్నాలజీతో ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్

అఖండ, వీరసింహా రెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం డాకు మహారాజ్‌తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న డాకు మహారాజ్ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా డాకు మహారాజ్ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రీ రిలీజ్ వేడుకలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, తిరుమల తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచి వేసింది. ఆ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. బాధాకర ఘటన చోటు చేసుకోవడంతో అనంతపురంలో తలపెట్టిన వేడుకను రద్దు చేయడం జరిగింది. నా అభిమానులు క్రమశిక్షణ కలిగిన సైనికులు. అందుకే వారు మా నిర్ణయాన్ని స్వాగతించారు. ఇన్ని లక్షల, కోట్ల మంది అభిమానులను పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ముందుగానాకు జన్మనిచ్చి, నన్ను ఆయన ప్రతిరూపంగా మీ హృదయాల్లో నిలిపిన దైవాంశ సంభూతులు, నా తండ్రి, నా గురువు, నా దైవం నందమూరి తారక రామారావుకి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నాన్న వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, ఆయన మాదిరిగానే ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించుకుంటూ వస్తున్నాను. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అలాగే అప్పట్లో ఆదిత్య 369లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి ఈ డాకు మహారాజ్ కథ పుట్టింది. విడుదల చేసిన రిలీజ్ ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. బాలకృష్ణ నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఏం కోరుకుంటారో అందుకు తగ్గట్టుగా ఈ ట్రైలర్ ఉంది. దర్శకుడుబాబీ ఆలోచనకు తగ్గట్టుగా, కెమెరామెన్ విజయ్‌కన్నన్ తన అద్భుత పనితీరుతో సన్నివేశాలకు ప్రాణంపోశారు. తమన్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అద్భుతమైన సంగీతం అందించాడు.



# క్లీన్ ఫెస్టివల్ ఫిల్మ్ 'సంక్రాంతికి వస్తున్నాం'

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. జనవరి 14న సంక్రాంతికి వస్తున్నాం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరో విక్టరీ వెంకటేష్ విలేకరుల సమావేశంలో సంక్రాంతికి వస్తున్నాం విశేషాల్ని పంచుకున్నారు.




**సంక్రాంతికి వస్తున్నాం కోసం ఎంత ఎక్సయిటెడ్ గా వున్నారు?** నా కెరీర్ ఇది మరో సంక్రాంతి. ఒక క్లీన్ ఎంటర్ టైనింగ్ ఫిల్మ్‌తో రావడం చాలా ఆనందంగా వుంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్ న్యూ జానర్ కూడా వుంది. సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. **ఈసారి ప్రమోషన్స్ చాలా ఎనర్జిటిక్‌గా చేయడానికి కారణం?** ఇది నేచురల్‌గా జరిగింది. మ్యూజిక్ చాలా నచ్చింది. నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. కొన్ని మ్యూజిక్ ట్యూన్స్ వినగానే క్రేజీగా అనిపించింది. అలాగే డైరెక్టర్ అనిల్, ఇద్దరు హీరోయిన్స్.. లైవ్లీ టీం కుదిరింది. ప్రమోషన్స్‌లో ఏదైనా కొత్తగా చేయాలని అనుకున్నాం. ప్రమోషన్స్‌ని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేయడం హ్యాపీగా వుంది. **మీతో సాంగ్ పాడించాలనే ఆలోచన ఎవరిది?** నైట్ రెండు గంటలకి ఆ సాంగ్ విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఏదో క్రేజీ ఎనర్జీ ఆ సాంగ్ లో వుంది. సరదాగా నేనే పాడతానని అన్నాను. ఆ రోజు గొంతు బాగానే వుంది. ఇంగ్లీష్ వర్డ్స్ వుండటంతో నాకు ఇంకా ఈజీ అయ్యింది (నవ్వుతూ). **సంక్రాంతికి వస్తున్నాం కథ విన్నప్పుడు మిమ్మల్ని ఎక్సయిట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?** ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. **మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ గురించి?** ఇద్దరూ చాలా మంచి క్యారెక్టర్స్ చేశారు. చక్కగా పెర్ఫామ్ చేశారు. క్యారెక్టర్స్ వెరీ క్రేజీగా వుంటాయి. **భీమ్స్ మ్యూజిక్ గురించి?** భీమ్స్ చాలా హార్డ్ వర్క్ చేసి బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాడు. తనకి ఈ సినిమా మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకంతో చేశాడు. ఫస్ట్ ట్యూన్ వినగానే హిట్ అనుకున్నాం. అది సూపర్ బ్లాక్ బస్టర్ అయ్యింది. అది ఆడియన్స్ గొప్పదనం. గోదారి గట్టు పాట 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది.

# 'ఒక పథకం ప్రకారం' ట్రైలర్ లాంచ్

143, బంపర్ ఆఫర్ లాంటి చిత్రాలతో ప్రామిసింగ్ హీరో అనిపించుకున్న సాయిరాం శంకర్ మరో విభిన్న చిత్రం ఒక పథకం ప్రకారం. ఈ సినిమా ట్రైలర్‌ని ఈ రోజు విడుదల చేశారు. ఓ మంచివాడి లోపల ఒక చెడ్డవాడు ఉంటాడు, ఓ చెడ్డవాడి లోపల చెడ్డవాడు మాత్రమే ఉంటాడు అనే వాయిస్ ఓవర్ తో మొదలవుతూ క్రైం, మర్డర్ కథనాలను చూపిస్తూ హీరోనే విలనా అనే సందేహంపై ముగించడం ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ ఈ చిత్రాన్ని తన వినోద్ విహాన్ ఫిల్మ్స్ బ్యానర్‌తో పాటు గార్లపాటి రమేష్ విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత వినోద్‌కుమార్ విజయన్ మాట్లాడుతూ, ఇదొక విభిన్నమైన కథ. అడ్వకేట్ పాత్రలో సాయిరాం శంకర్, పోలీసు పాత్రలో సముద్రఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో ఉత్కంఠభరితంగా తీసుకెళ్ళే క్రైం, మిస్టరీ కథనాలతో ఆద్యంతం కట్టిపడేస్తుంది. రాహుల్ రాజ్, గోపి సుందర్ పాటలు స్కోర్ అద్భుతంగా వచ్చాయి. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తిచేసుకుని ఫిబ్రవరి7న గ్రాండ్ రిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నాం అన్నారు. నటీనటులు: సాయిరాం శంకర్, శ్రుతి సోధి, ఆశిమ నర్వాల్, సముద్రఖని, రవి, పచముత్తు, భాను శ్రీ, గార్లపాటి కల్పలత, పల్లవి గౌడ సాంకేతిక నిపుణులు: డి.ఓ.పి రాజీవ్ రవి సంగీతం: రాహుల్ రాజ్ ఆర్.ఆర్ గోపి సుందర్ ఎడిటర్: కార్తీక్ జోగేశ్ సాహిత్యం: రహ్మాన్ గాయకుడు: సిద్ శ్రీరామ్, ఆర్ట్ డైరెక్టర్: సంతోష్ రామన్ పి.ఆర్. ఓ పులగం చిన్నారాయణ బ్యానర్: వినోద్ విహాన్ ఫిల్మ్స్, విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాతలు: వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేష్ కథ, మాటలు, దర్శకత్వం: వినోద్ కుమార్ విజయన్.





మృణాల్ ఠాకూర్ నయా లుక్

# కల్పర విఎఫ్ఎక్స్ అండ్ ఎఐ సర్వీసెస్ షురూ

సినిమా ఇండస్ట్రీలోకి వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. ఫిల్మ్ మేకర్స్ అంతా టెక్నాలజీని ఉపయోగిస్తూ వండర్స్ క్రియేట్ చేస్తున్నారు. తాజాజా హైదరాబాద్‌లో కల్పర వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ టెక్నాలజీ తమ నూతన బ్రాంచ్‌ను హైదరాబాద్‌లో లాంచ్ చేశారు డాక్టర్ మల్లీశ్వర్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు, దర్శకులు శ్రీనువైట్ల, కరుణ కుమార్, ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ డైరెక్టర్ వందన, నటులు విక్రాంత్ రెడ్డి, రఘు కుంచె హాజరయ్యారు. మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ, 'మన తెలుగు బిడ్డ మల్లీశ్వర్ అమెరికాలో స్థిరపడి ఎంటర్‌పెన్యూర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక్కడి నిరుద్యోగ యువతికి ఉద్యోగాలు ఇప్పించాలని నేను ఆహ్వానించగానే సిద్ధిపేటలో ఐటీ కంపెనీ పెట్టి ఎంతోమంది గ్రామీణ యువతకు ఉద్యోగాలు ఇచ్చిన డాక్టర్ మల్లీశ్వర్‌ని అభినందించాలి. మన తెలుగు చిత్ర పరిశ్రమ బాలీవుడ్, హాలీవుడ్‌తో పోటీ పడుతుంది. రాబోయే కాలంలో హాలీవుడ్‌తో మరింత పోటీని ఎదుర్కోవాలంటే.. ఇలాంటి వీఎఫ్ఎక్స్, ఎఐ టెక్నాలజీ చాలా అవసరం. సినిమా బడ్జెట్‌ను తగ్గిస్తూ.. విజువల్ ఎఫెక్ట్స్‌ను పెంచుతూ ప్రేక్షకులు అట్రాక్ట్ చేయాలంటే ఈ టెక్నాలజీ అవసరం ఉంది. ప్రస్తుతం ప్రపంచమంతా ఎఐ వెంట పరుగెడుతుంది. అమెరికా నుంచి ఇండియా వచ్చి ఇది స్థాపించిన మల్లీశ్వర్ ఇంకా ఎదగాలని, చిత్ర పరిశ్రమ ఎదుగుదలకు తనవంతు కృషి చేయాలని కోరుతున్నా. ఆర్ఆర్ఆర్ లాంటి చిత్రానికి ఆస్కార్ వచ్చిందంటే తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వ కారణం. ఇలాంటి టెక్నాలజీని తెలుగు పరిశ్రమకు రావడం అభినందనీయం' అని అన్నారు. దర్శకులు శ్రీనువైట్ల మాట్లాడుతూ 'మల్లీశ్వర్ మంచి ఆలోచనతో వీఎఫ్ఎక్స్‌తో పాటు ఎఐ బ్రాంచ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఫిల్మ్ ఇండస్ట్రీలో తమ వంతుగా పాలుపంచుకోవడంతో పాటు అనేక మందికి ఎంప్లాయ్‌మెంట్ ఇవ్వడం సంతోషంగా ఉంది. సినిమా ఇండస్ట్రీలో ఆయనకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. దర్శకులు కరుణ కుమార్ మాట్లాడుతూ 'తెలుగు సినీ ఇండస్ట్రీలో వీఎఫ్ఎక్స్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. టెక్నికల్‌గా మంచి వారిని గుర్తించడం సమస్యగా మారిన ఈ తరుణంలో మల్లీశ్వర్ ఈ కంపెనీ పెట్టడం హ్యాపీ. సరైన క్వాలిటీతో అనుకున్న టైమ్‌కి అవుట్‌పుట్ ఇవ్వగలగితే వారికి కాంపిటీషన్ ఉండదు. ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. రఘు కుంచె మాట్లాడుతూ 'కల్పర వీఎఫ్ఎక్స్ సంస్థ ద్వారా మల్లీశ్వర్ తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. హీరో విక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ 'గత పదేళ్ల కాలంలో చిత్ర పరిశ్రమకు వీఎఫ్ఎక్స్ అవసరం బాగా పెరిగింది. వీఎఫ్ఎక్స్ లేని మూవీ అంటూ ఉండదు.




# 'ప్రొడక్షన్ నం:1' శరవేగంగా షూటింగ్

స్వాష్ కలర్స్ మీడియా, అలీనియ అవిజ్ఞ స్టూడియోస్ సెటిల్ కింగ్ ప్రొడక్షన్ నం:1లో వేణుబాబు నిర్మాతగా ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో పవన్‌చరణ్, జీవీ సంగీతాన్ని అందిస్తూ దిలీప్ కుమార్ చిన్నయ్య సినిమా ఆటోగ్రాఫర్‌గా పనిచేస్తూ సినిమా త్వరలో ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ చిత్రంలో ఆదర్శ్ పుందిర్, అశ్రిత్ రెడ్డి, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్, రాజ్ గౌడ్, సునందిని, మధుసూదన్ తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతూ అండగా త్వరలోనే ఇతర సినిమా అప్డేట్లతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నటి ప్రియాంక సింగ్ మాట్లాడుతూ, నేను ఈ నిర్మాణ సంస్థలో పనిచేయడం మొదటిసారి. జీవి విశ్వనాథ్ దర్శకత్వంలో పనిచేయడం నాకు చాలా ఆనందంగాఉంది. ఈ రోజుల్లో ఇటువంటి సినిమాలు రావడం లేదు. కాబట్టి ఈసినిమా ఎంతో స్పెషల్‌గా ఉండబోతుంది. అందుకుగాను ఈచిత్రాన్ని అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను. ఈ చిత్రంలో నటిస్తున్న తోటి నటీనటులతో, ఈ చిత్ర బృందంతో పనిచేయడం అనేది నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. నటి ఆదర్శ్ పందిరి మాట్లాడుతూ, మేము కొత్త కామెడీతో ముఖ్యంగా లింగ బేధాలపై మంచి సినిమాతో ప్రేక్షకులు ముందుకు రానున్నాము. ఈ సినిమాలో టెక్నాలజీ అనేది కీలక పాత్ర పోషించబోతుంది. త్వరలోనే థియేటర్లో కలుసుకుందాం అన్నారు. నటుడు అశ్రిత్ రెడ్డి మాట్లాడుతూ, మేమంతా ఎంతో కష్టపడి ఈ సినిమా చేస్తున్నాము. ఈ చిత్ర కథని నమ్మి సినిమా చేస్తున్నాము. మీకు కూడా నచ్చుతుంది అని అనుకుంటున్నాము. త్వరలోనే ఈ సినిమా ద్వారా థియేటర్లలో కలుద్దాము అన్నారు. నటి పూజిత పుందిర్ మాట్లాడుతూ, జెండర్ సమానత్వంపై కామెడీ రూపంలో వస్తున్న ఈ చిత్రం మంచి కామెడీతో ఉండబోతుంది. జీవి దర్శకత్వంలో పనిచేయడం నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ, స్వాష్ కలర్స్ మీడియా బ్యానర్‌పై మేము తొలి సినిమా చేస్తున్నాము. అశ్రిత్, ఆదర్శ్, ప్రియాంక సింగ్ ముఖ్య పాత్రలు పోషిస్తూ వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 26న మొదలుపెట్టుకుని నిరంతరం పగలు రాత్రి తేడా లేకుండా 15 రోజులపాటు షూటింగ్ చేస్తూ నేటికి సగభాగం షూటింగ్ పూర్తి చేసుకున్నాము. మిగతా సగభాగం షూటింగ్ కోసం యుఎస్ వెళ్తున్నాము.



# 'గేమ్ ఛేంజర్' ఫస్ట్‌డే కలెక్షన్స్ రూ.186 కోట్లు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన భారీ పాన్ ఇండియా మూవీ 'గేమ్ ఛేంజర్'. భారీ అంచనాలతో సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం జనవరి 10న విడుదలైన సంగతి తెలిసిందే. ఎప్పుడెప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై రామ్ చరణ్‌ను చూద్దామా! అని హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్‌తో ఎదురు చూసిన అభిమానులకు సినిమా నెక్స్ట్ రేంజ్‌లో ఉండటంతో సినిమా తొలి ఆట నుంచే బ్లాక్ బస్టర్ టాక్ సంపాదించుకుని బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తూ దూసుకెళ్తోంది. తొలి రోజున వరల్డ్ వైడ్‌గా 'గేమ్ ఛేంజర్' చిత్రం రూ.186 కోట్ల వసూళ్లను సాధించటం విశేషం. రామ్ చరణ్ రామ్ నందన్, అప్పన్న పాత్రల్లో ఒదిగిపోయి ఓ వైపు స్టైలిష్‌గా, మరో వైపు పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇక డాన్సుల్లో ఆయన గ్రేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చరణ్, ఎస్.జె.సూర్య మధ్య ఉండే ఎగ్జయిటింగ్ సన్నివేశాలు, చరణ్, కియారా మధ్య కెమిస్ట్రీ, చరణ్, అంజలి, శ్రీకాంత్ మధ్య ఉండే ఎమోషనల్ సన్నివేశాలకు ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తుంది. అసలైన సంక్రాంతి పండుగ ముందడటంతో ఈ కలెక్షన్స్ రేంజ్ మరింత పెరుగుతుందనటంలో సందేహం లేదు. లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించటంలో స్పెషలిస్ట్ అయిన శంకర్ తనదైన పంథాలో గేమ్ ఛేంజర్ సినిమాను వావ్ అనిపించే రీతిలో వండర్ మూవీగా ఆవిష్కరించారు. ప్రతీ సీన్‌ను ఎక్స్‌ట్రార్డినరీగా సిల్వర్ స్క్రీన్‌పై తెరకెక్కించారు. అసలు సిసలైన సంక్రాంతి విన్నర్‌గా గేమ్ చేంజర్ బాక్సాఫీస్ దగ్గర జోరు చూపిస్తోంది. గేమ్ ఛేంజర్ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ తమన్ అందించిన సంగీతం, బ్యాగ్రౌండ్ స్కోర్, తిరు ఎక్స్‌ట్రార్డినరీ విజువలైజేషన్ సినిమాను నెక్స్ట్ రేంజ్‌కి తీసుకెళ్లాయి. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు.



# 'గరివిడి లక్ష్మి' నుంచి ఐకానిక్ ఫోక్ సాంగ్

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మించిన ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం గరివిడి లక్ష్మి. ఆమె శక్తివంతమైన నటనకు ప్రసిద్ధి చెందిన హీరోయిన్ ఆనంది మరో చిరస్మరణీయమైన పాత్రను అందించబోతున్నారు. ప్రశంసలు పొందిన నిర్మాతల నేతృత్వంలోని ప్రొడక్షన్ హౌస్, ఉత్తర ఆంధ్ర ప్రాంతంలోని ప్రతిష్టాత్మకమైన సంస్కృతిని ప్రతిచోటా ప్రేక్షకులకు అందించే జానపద కళాఖండం నల జిలకర మొగ్గ విడుదల చేసింది. నల జిలకర మొగ్గ, తరతరాలు ఇష్టపడే క్లాసిక్ జానపద గీతం, కవితా సౌందర్యం, సాంస్కృతిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందింది. స్వచ్ఛత, సరళత మరియు దయకు ప్రతీకగా ఉండే సున్నితమైన నల జిలకర మొగ్గతో యువతి యొక్క గాంభీర్యాన్ని పాట అందంగా పోల్చింది. ఇది ఒక శక్తివంతమైన సందేశాన్ని అందిస్తుంది స్త్రీ యొక్క సహజ ఆకర్షణ భౌతిక సంపద, నగలు లేదా అత్యంత విస్తృతమైన చీరలను కూడా మించిపోయింది. ప్రముఖ బుర్ర కథా కళాకారిణి గరివిడి లక్ష్మి యొక్క అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా ఈ పాట విస్తృతమైన ప్రశంసలను పొందింది. ఉత్తర ఆంధ్ర యొక్క జానపద సంప్రదాయాలను, ముఖ్యంగా 1990లలో సంరక్షించడంలో, ప్రాచుర్యంలోకి తీసుకు రావడంలో ఆమె చేసిన విశేషమైన సహకారం, ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక చరిత్రలో ఆమెకు శాశ్వతమైన స్థానాన్ని సంపాదించి పెట్టింది. ఉత్తర ఆంధ్రలోని వ్యవసాయ, శ్రామిక వర్గాలకు, నల జిలకర మొగ్గ కేవలం జానపద పాట మాత్రమే కాకుండా వారి మూలాలకు గర్వం, ఆనందం, అనుబంధాన్ని అందించే అమూల్యమైన సాంస్కృతిక కళాఖండం. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోనిలో ఘనంగా జరిగిన గరివిడి లక్ష్మి ప్రారంభోత్సవం, షూటింగ్ ప్రారంభం కాకముందే సినిమా ప్రమోషన్‌లకు కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ చిత్రం విజువల్‌గా మరియు సోనిక్‌గా ఉత్తర ఆంధ్ర సారాంశాన్ని క్యాప్చర్ చేస్తుంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. తారాగణం: ప్రముఖ నటుడు నరేష్, రాసి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్.



# 'డాకు మహారాజ్'లో కొత్త బాలకృష్ణను చూస్తారు

వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి డాకు మహారాజ్ చిత్రంతో అలరించనున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవరనాగవంశీ, సాయిసౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈచిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు బాబీ కొల్లి, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. **డాకు మహారాజ్ ఎలా ఉండబోతుంది?** బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకొని డాకు మహారాజ్ సినిమా చేయడం జరిగింది. అయితే బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించాము. బాలయ్య సెటిల్డ్‌గా డైలాగ్‌లు చెప్తే చాలా బాగుంటుంది. నరసింహానాయుడు, సమరసింహారెడ్డి తర్వాత సింహా ఎలా అయితే గుర్తుండే సినిమా అయిందో, డాకు మహారాజ్ కూడా అలాంటి పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది. చాలా నిజాయితీగా కథను చెప్పాము. **బాలకృష్ణ గురించి?** బాలకృష్ణ నుంచి ఎవరైనా క్రమశిక్షణ నేర్చుకోవచ్చు. దర్శకుడికి ఎంతో గౌరవం ఇస్తారు. సెట్స్‌లో అందరితో సరదాగా ఉంటారు. మనం ఎంత నిజాయితీగా ఉంటే బాలకృష్ణ గౌరవిస్తారు. అభిమానులు తనను చూడటానికి వస్తారు కదా అని, డూప్ లేకుండా నటించడానికి ఇష్టపడతారు. మొండి గుర్రాన్ని సైతం కంట్రోల్ చేస్తూ, స్వయంగా స్వారీ చేసి మమ్మల్ని ఆశ్చర్యపరిచారు. **ట్రైలర్‌లో విజువల్స్‌కి మంచి పేరు వచ్చింది కదా. ఎలాంటి కేర్ తీసుకున్నారు?** నిర్మాత నాగవంశీ బాలకృష్ణని ఎంతో అభిమానిస్తారు. ఆ అభిమానంతోనే తమ బ్యానర్‌లో వచ్చే సినిమా వైవిధ్యంగా ఉండాలి అనుకున్నారు. అలాగే ఒకదర్శకుడిగా నాకెంతో ఫ్రీడమ్ ఇచ్చారు. ఇద్దరం కలిసి ఈ సినిమాలో విజువల్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడేలా చేయాలి అనుకున్నాము. డీఓపీ విజయ్ కన్నన్‌తో నాకు ముందే పరిచయముంది. అప్పుడుఆయన జైలర్ సినిమాకి పని చేస్తున్నారు. నాగవంశీ కూడా విజయ్ పేరు చెబితే వెంటనే ఒకే అని, ఆయనతో మాట్లాడారు. అలా విజయ్ ఈ సినిమాలో భాగమయ్యారు. ఆయన ఎంతో అంకిత భావంతో పని చేస్తారు.



దర్శకుడు బాబీ కొల్లి

# సంగీత ప్రపంచంలో ఓ ప్రభంజనం..



జస్లీన్ రాయల్... సంగీత ప్రపంచంలో ఇప్పుడు ఓ ప్రభంజనం. సామాజిక మాధ్యమాల్లో ఓ సంచలనం. గాయనిగా, మ్యూజీషియన్గా, కంపోజర్గా... ఒకటేమిటి ఎన్నెన్నో పనులు చేస్తూ అందరినీ ఆకట్టుకుంటోన్న యువతరంగం. 'హీరియే.. హీరియే' పాట మ్యూజిక్ ఆల్బమ్స్ చార్ట్ బస్టర్గా నిలిచిన విషయం తెలిసిందే.

తాజాగా విజయ్ దేవరకొండతో చేసిన మ్యూజిక్ వీడియో 'సాహిబా'తో మరోసారి వార్తల్లో నిలిచింది. చిన్నప్పుడు రేడియోలో పాటలు వింటూ సంగీతంపై ప్రేమ పెంచుకుందట జస్లీన్. ఫస్ట్ క్లాస్‌లో ఉండగానే పియానో వాయించి అందరినీ అబ్బురపరిచింది. ఆ ఇష్టం తనతో పాటు పెరిగి పెద్దదవుతూ వచ్చింది. ఎటువంటి శిక్షణ లేకుండానే... పియానో, గిటార్, మోత్ ఆర్గన్ వంటి వాద్య పరికరాలను నేర్చుకుని స్వతంత్రంగా సంగీత సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది. జస్లీన్ పంజాబ్లోని లుధియానా. ఆమె కుటుంబంలో ఎవరికీ సంగీత నేపథ్యం లేదు. కానీ, ఆమె తల్లిదండ్రులు కూతురు వినసొంపుగా పాడుతుంటే చూసి ప్రోత్సహించారు. స్వతహాగా వచ్చిన ఆ కళతో కళకళలాడుతోంది. పద్నాలుగేళ్ల వయసులోనే పిల్లలకు సంగీత పాఠాలు చెబుతుంది. ఆ డబ్బుతో తనకు కావాల్సిన సంగీత పరికరాలు కొనుక్కునేది. ఢిల్లీ వచ్చాక...లుధియానాలో హైస్కూల్ పూర్తిచేసి పై చదువుల కోసం ఢిల్లీ చేరుకుంది జస్లీన్. హిందూ కాలేజ్‌లో బికామ్ పూర్తి చేసింది. కాలేజీ రోజుల్లో అందరూ ప్లాన్ బి గురించి ఆలోచిస్తే... తను మాత్రం మ్యూజిక్ మాత్రమే తన కెరియర్ అని స్థిరంగా నిర్ణయించుకుంది. మరోపక్క రియాల్టీషోల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం మొదలు పెట్టింది. ఇండియాస్ గాట్ టాలెంట్ ఫస్ట్ సీజన్‌లో సెమీ ఫైనలిస్ట్‌లలో ఒకరిగా నిలిచిపోయిన అందరి దృష్టిని ఆకర్షించింది. తన ప్రతిభతో 'వన్ ఉమన్ బ్యాండ్'గా గుర్తింపు తెచ్చుకుంది. బాలీవుడ్లో అడుగుపెట్టాలన్నది నా కల. అయితే, అది అంత తేలిగ్గా నెరవేరలేదు. నేను మ్యూజిక్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టేటప్పుడు ఎలాంటి రిఫరెన్సులూ లేవు సరే... కేవలం నా మీద నాకు ఉన్న నమ్మకంతోనే ఇక్కడకు వచ్చా. కానీ, కెరియర్



ఆరంభంలో అందరిలానే నేనూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా సమావేశాలకు వెళ్లడానికి చాలా కష్టపడేదాన్ని. ఇంటి అద్దె కట్టడానికి కూడా ఇబ్బంది పడ్డా. నా కష్టమే నన్ను నిలబెట్టిందని నమ్ముతున్నా. కొన్నిసార్లు వెనక్కి వెళ్లిపోదామా అని కూడా అనుకున్నా అని గతం గుర్తు చేసుకుంటుంది జస్లీన్. అయితే, ఎక్కడా శిక్షణ తీసుకోకపోవడం అవకాశాలు రాకపోవడానికి కారణమే అయినా.. తన సహజ ప్రతిభను మాత్రం ఎవరూ అడ్డుకోలేకపోయారు. ఎంటివిలో ప్రసారమైన 'పంచీ హో జావా' ఆల్బమ్ మంచి పేరు తెచ్చింది. దీన్ని జసినే స్వయంగా సామాజిక రాసుకుని కంపోజ్ చేసింది. ఈ పాట ఆత్మవిశ్వాసానికీ, స్వేచ్ఛకు ప్రతీకగా చెబుతూ.... మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ట్రెండ్ అయ్యింది. అదే తనకి ఖూబ్సూరత్‌లో పాడే అవకాశం తెచ్చిపెట్టింది. ఇది విజయవంతం కావడంతో సినిమా అవకాశాలూ వరుస కట్టాయి. 'బార్ బార్ దేఖో'తో బాలీవుడ్‌లో కంపోజర్గా బ్రేక్ వచ్చింది. ఆపై 'అస్సి సజ్నా', రంజా, 'లవ్ జిందగీ', 'నచ్ దేనే సారే', 'దిన్ షగనా దా'... అన్నీ హిట్లే, ఫోక్, పాప్, ఆధునిక సంగీతాల్ని మేళవించి జస్లీన్ చేసే ప్రయోగాలు ఈ తరం గుండెల్లో చెరగని ముద్రవేశాయి. ప్రైవేట్ వీడియో సాంగ్స్, ఆల్బమ్స్ విడుదల చేస్తూ యువతను హుషారెత్తిస్తోంది. అలా 'హే బాబా', 'హీరియే హీరియే' విశేషంగా ఆకట్టుకోగా... తాజాగా విజయ దేవరకొండ 'సాహిబా' పాట వైరల్ అవుతోంది. విడుదలైన రెండువారాల్లోనే దాదాపు రెండుకోట్ల వ్యూస్ సంపాదించుకుంది. పంజాబీ, హిందీ, బెంగాలీ, గుజరాతీలతో పాటు ఇంగ్లీషులోనూ పాటలు పాడింది జస్లీన్. మహిళా మ్యూజిక్ డైరెక్టర్గా ఫిల్మ్ ఫేర్ అవార్డునీ అందుకుంది.. 'కష్టానికి భయపడి వెనకడుగు వేస్తే... మనమేంటో మనమే తెలుసుకోలేం. అవకాశాలు ఎవరూ ఇవ్వరు మనమే అందుకోవాలి' అని చెబుతోంది జస్లీన్! □

## తిరుప్పావై

### 29వ పాశురము




శిత్తం శిఱుకాలే వందున్నైచ్చేవిత్తు,
ఉన్
పొత్తామరై యడియే పోత్తుం
పారుళ్ కేళాయ్
పెత్తం మేయుత్తుణ్ణుం
కులత్తిల్ పిఱందు, నీ
కుత్తేవల్ ఎంగళై క్కొళ్ళామల్
పోగాదు,
ఇత్తైప్పఱై కొళ్వా నన్టుగాణ్ గోవిందా,
ఎత్తైక్కు మేళళు పిఱవిక్కుం,
ఉందన్నోడు
ఉత్తోమేయామోం ఉనక్కేనాం
ఆట్చెయ్‌వోం
మత్తైనం కామంవగళ్ మత్తేలో
రెంబావాయ్.

బాగా తెలవారకముందే వచ్చి మిమ్ములను సేవించాలి. తామరపూలవంటి సుందరము లైనట్టి పాదములకు వందనములు, మేము వచ్చిన కారణము తెలుపు వారు. పశువులను మేపుతూ జీవనం సాగించు గోపకుల వంశములో పుట్టిన మీరు అంతరంగ కైంకర్యములు మాచే స్వీకరించుట తగదు. నేడు 'పరఖి తీసుకొని వెళ్ళుటకు రాలేదు. ఓగోవిందా ఏడేడు జన్మలు మీతో విడిపోని బంధము మాకు కావలెను. దాస్యముచేయ దలచాము. మా ఇతర కోరికలను పోగొట్టుము.

ఫలం: "సంపూర్ణ శరణాగతి"


## రంగ వల్లి





ఎం. హారతి
మంగళంపాడు
నెల్లూరు జిల్లా


14 చుక్కలు 2 వరుసలు 2 వరకు పరి చుక్కలు





- కవిత పుల్లమరాజు
పీతారాంబాగ్

17 చుక్కలు 5 వరుసలు ఇటు అటు వదిలి 6 వరకు





జి. పద్మావతి
విశాఖపట్నం

14 చుక్కలు 6 వరకు సందు చుక్కలు

# పండగ తీపి రుచులు

ఏ ప్రత్యేక సందర్భం వచ్చినా ఏవేవో వంటలు చేస్తుంటాం. మళ్లీ పండుగ వరకు గుర్తుండిపోవాలి. ఆత్మీయులతో కబుర్లు చెబుతూ పసందైన మిఠాయిలు తింటుంటే.. అంతకంటే మజా ఏముంటుంది? అందుకే మీ కోసం ఈ స్పెషల్ రెసిపీలు.

## యాపిల్ డిలైట్

**కావలసినవి:** మైదా అర కప్పు, మిల్క్ మెయిడ్ 200 గ్రాములు, చిక్కటి పాలు ముప్పావు కప్పు, యాపిల్స్ 3, బాదం, జీడిపప్పు పలుకులు కప్పు, బటర్ 50 గ్రా, దాల్చినచెక్క పొడి అర చెంచా, బేకింగ్ పౌడర్ చెంచా టాపింగ్ కోసం: మైదా, బటర్, పంచదార పొడి 2 టేబుల్స్పూన్ల చొప్పున

**తయారీ:** యాపిల్ పండ్ల చెక్కు, విత్తనాలు తీసి ముక్కలుగా కోసుకోవాలి. మిక్సింగ్ బౌల్లో మైదా, మిల్క్ మెయిడ్, పాలు, బటర్, బేకింగ్ పౌడర్, దాల్చినచెక్క పొడి, యాపిల్ ముక్కలు, బాదం, జీడిపప్పు పలుకులు వేసి కలపాలి. బేకింగ్ డిష్‌లో వెన్న రాసి..



యాపిల్ మిశ్రమాన్ని సమంగా సర్దాలి. ఒక ప్లేటులో పంచదార పొడి, బటర్, మైదాలను కలిపి.. యాపిల్ మిశ్రమం పైన చల్లాలి. అవెన్‌లో 180 డిగ్రీ వద్ద ప్రీహీట్ చేసి.. అరగంట బేక్ చేయాలి. అంతే.. బంగారు రంగులో నోరూరించే యాపిల్ డిలైట్ సిద్ధం.

## సోహల్ హల్వా



**కావలసినవి** గోధుమపిండి, పురా, మిల్క్ పౌగర్ 4 టేబుల్స్పూన్ల చొప్పున, పంచదార కప్పున్నర. నెయ్యి కప్పు, పిస్తా బాదం, జీడిపప్పు పలుకులు కప్పు

**తయారీ** ఒక పాత్రలో గోధను పిండి, మైనా, మిను కలపాలి. ఫ్యాన్‌లో నెయ్యి, పంచదార . గోధుమపిండి, మైదా, మిల్క్ పౌడర్ల మిశ్రమం చేసి కలియ తిప్పుతూ రెండు నిమిషాల తర్వాత దించాలి. చిన్న బౌల్స్ నెయ్యి రాసి, డ్రైఫ్రూట్స్ పలుకులు వేయాలి. వాటి మీద హల్వా వేసి సమంగా సర్దాలి. అంతే.. రుచికరమైన మిఠాయిని ఆస్వాదించండి.

## ధార్వాడ్ పేడా

**కావలసినవి:** తరిగిన పనీర్ 2 కప్పులు, ఖోయా కప్పు, పంచదార ఒక కప్పు 2 టేబు ల్స్పూన్లు, నెయ్యి 2 చెంచాలు, పాలు 6 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి పావుచెంచా

**తయారీ:** కడాయిలో స్పూన్ నెయ్యి వేడిచేసి పన్నీరు లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో పంచదార, 2 టేబుల్ స్పూన్ల పాలు జతచేసి కలుపుతుండాలి. పనీర్ క్రిస్పీ అయ్యాక



దించాలి. చల్లారాక 2 టేబుల్స్పూన్ల పాలు జతచేసి గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నెయ్యి, ఖోవ వేయాలి. అది దోరగా వేగాక.. పనీర్ పేస్ట్ జోడించి కలియ బెడుతుండాలి. అంత మిగిలిన పాలు, యాలకుల పొడి కూడా వేసి కలపాలి. మిశ్రమంలో తడి ఇంకిపోయి కడాయి అంచులకు అంటుకోకుండా విడిపోతున్నప్పుడుసెగ తీయాలి. మిశ్రమం కాస్త చల్లారాక.. పేడా చేసుకుని పంచదారలో ముంచి తీస్తే.. తియ్యటి ఖిధార్వాడ్ పేడఖి రెడీ. కర్నాటక వారి ఈ స్వీటు 175 ఏళ్ల చరిత్ర ఉంది.

## రాజ్ భోగ్



**కావలసినవి:** పాలు లీటర్, పంచదార కప్పున్నర, యాలకుల పొడి అర చెంచా, కుంకుమపువ్వు కొద్దిగా, నిమ్మరసం చెంచా, రోజ్ వాటర్ కొన్ని చుక్కలు, గుల్కంద్ చెంచా, బాదం, పిస్తా పలుకులు చారెడు

**తయారీ:** మరుగుతున్న పాలలో నిమ్మరసం వేయాలి. విరిగిన పాలను వడకట్టాలి. అందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి వడకడితే పులుపు వాసన పోతుంది. ఈ పన్నీరు పావుగంట పక్కనుంచాలి. ఈలోగా పంచదారలో యాలకుల పొడి, కుంకుమపువ్వు, 4 కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. ఇప్పుడు పన్నీర్ ను నాలుగైదు నిమిషాలు చపాతీపిండిలా కలపాలి. బాదం, పిస్తా పలుకుల్లో గుల్కంద్, రోజ్వాటర్, కొంచెం పంచదార సిరప్ కలిపి.. చిన్న బాల్స్ చేసుకోవాలి. పనీర్ను చిన్న అప్పల్లా చేయాలి. మధ్యలో డ్రైఫ్రూట్స్ బాల్ ఉంచి గుండ్రంగా కప్పేయాలి. అన్నీ అయ్యాక పంచదార సిరప్ లో వేసి సన్న సెగ మీద పది నిమిషాలు ఉడికించి సెగ తీయాలి. చల్లారాక ఏడెనిమిది గంటలు ఫ్రిజ్లో ఉంచాలి. బయటకు తీసి మిగిలిన బాదం, పిస్తా పలుకులతో గార్నిష్ చేస్తే వహ్వా అనిపించే "రాజ్‌భాగ్ రెడీ.

## నెయ్యప్పమ్

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, మైదా, మొక్క జొన్న పిండి అర కప్పు చొప్పున, బెల్లం పావు కిలో, కొబ్బరి ముక్కలు 2 టేబుల్ స్పూన్లు, నల్ల నువ్వులు, నెయ్యి టేబుల్ స్పూన్ చొప్పున, యాలకుల పొడి అరంచా, ఉప్పు, బేకింగ్ సోడా చిటికెడు, నూనె వేయించేందుకు సరిపడా



**తయారీ:** బెల్లంలో కొన్ని నీళ్లు పోసి మరిగించి ఆ నీటిని వడకట్టాలి. అందులో బియ్యప్పిండి, మైదా, మొక్క జొన్న పిండి, యాలకుల పొడి, ఉప్పు, బేకింగ్ సోడా వేసి మళ్లీ మళ్లీ కలపాలి. కొబ్బరి ముక్కలు, నువ్వులను నేతిలో వేయించి.. వాటిని కూడా పిండిలో కలపాలి. ఈ పిండిని కాగుతున్న నూనెలో గరిటెడు చొప్పున వేసి.. రెండు వైపులా వేయించుకోవాలి. అంతే తియ్యటి 'నెయ్యప్పమ్' తిని ఆనందించడమే తరువాయి.

## చిలగడ గులాబ్‌జామ్

**కావలసినవి.** చిలగడదుంపలు రెండు, మైదాపిండి రెండు టేబుల్ స్పూన్లు, పంచదార కప్పు, బేకింగ్ సోడా, యాలకుల పొడి చిటికెడు చొప్పున, నెయ్యి అరటీస్పూన్, నూనె వేయించడానికి సరిపడా . **తయారీ:** పిల్లలతోపాటు పెద్దలూ ఎంతో ఇష్టంగా గులాబీలను తింటారు. ఎప్పుడూ చేసే పద్ధతిలో కాకుండా ఇలాచేస్తే రుచితోపాటు ఆరోగ్యానికీ మంచిది. ఒకటి తిన్న తర్వాత మరోటి కావాలంటారు. ఇంతకీ వీటినెలా చేయాలంటే.. చిలగడదుంపలను మరీ మెత్తగా కాకండా ఆవిరి మీద ఉడికించుకోవాలి. (చాలామంది వీటిని నీళ్లతోనే ఊడికి. అలాచేస్తే దీంట్లో ఉంటే పోషకాలన్నీ నీళ్లతోపాటు బయటకు వెళ్లిపోతాయి), ఊడిన తర్వాత తొక్క తీసి.. మెత్తగా మెదుపుకుని మైదాపిండి వేసి ముద్దలా కలపాలి. పిండి పల్చగా ఉంటే మరికాస్త వేయొచ్చు. తర్వాత నెయ్యి వేసి కలపాలి. పిండిలో నుంచి చిన్న ముద్దను తీసుకుని గుండ్రంగా లేదా గుడ్డు ఆకారంలో గులాబీలు చేయాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి సిద్ధంగా ఉన్న ఉండలు వేసి తక్కువ మంట మీద వేయించాలి. ఒకేసారి ఐదారు ఉండలకు మించి వేయకుండా..గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించాలి. ఇతే ఇలా అన్నీ అయిన తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో పంచదార, కప్పు నీళ్లు పోసుకుని మరిగించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి., లేత పాకం వచ్చేంత వరకూ మరగనివ్వాలి. ఇప్పుడు స్టాఫ్ చేసి.. సిద్ధంగా ఉన్న గులాబ్‌జామ్ లను ఈ పాకంలో వేసి గంట నుంచి రెండు గంటలపాటు బాగా నానని వ్వాలి. అంతే నోట్లో వేస్తేనే కరిగిపోయేలా ఉంటే గులాబీలు సిద్ధిస్తాయి. అందరూ ఎంతో ఇష్టంగా తినే వీటిని మైదాపిండితో కాకుండా ఇలా చిలకడదుంపతో చేయడం వల్ల ఆరోగ్యానికీ ఎంతో మంచిది. □



# మట్టి సారాన్ని పెంచాలి !

బాల్కనీలోనో, టెర్రస్ మీదో మొక్కలను పెంచాలని ఉత్సాహపడేవారు చాలామందే. తీరా నాటక పూలూ, కూరగాయలు, పళ్లు... స్థిరంగా రాకపోయేసరికి అక్కడితో వదిలేస్తారు. అయితే, ఇందుకు కారణం ఆ మట్టిలో సారం లేకపోవడం కావొచ్చు. వంటింటి వస్తువులతో ఎలా బలం పెంచొచ్చోతెలుసుకుందామా?

**అరటి తొక్కలు:** గులాబీ, చామంతి, కనకాంబరాలు... వంటి పూలు నిండుగా విరబూయాలంటే పొటాషియం మోతాదు మట్టిలో అవసరం.ఇది అరటితొక్కల్లో పుష్కలంగా దొరుకుతుంది. అందుకే, దీన్ని పేస్ట్ చేసి మొక్క చుట్టూ మట్టిలో కలిపితే సరి.

**కాఫీ గింజలు:** వాడేసిన కాఫీ గింజల్లో నత్రజని, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషి యం, కాపర్ వంటి వస్తువులు లభిస్తున్నాయి. ఇవి నీటిని నిల్వ చేయడం, గాలి సరఫరా చేయడం వంటి ప్రయోజనాలను అందిస్తాయి.

**గుడ్డు పెంకులు:** వీటిల్లో కాల్షియం ఎక్కువ. టొమాటోలు, మిరప వంటి మొక్కలకు ఇది చాలా అవసరం. ఉడికించిన గుడ్డు నీళ్లనూ మొక్కలకు అందిస్తే సరి.చెక్కబూడిద చెక్క బూడిదలో కాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉండి, ఆల్కలైనిటీని పెంచుతుంది.

**గంజికడుగు:** ఇందులోని పిండి పదార్థాలు, మేలు చేసే ఇతర పోషకాల మొక్క ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తుంది.

**పెన్సిల్ పొట్టు:** సాధారణంగా పెన్సిల్ని సిడార్ ఉడ్తో తయారు చేస్తారు. ఈ పొట్టుని మొక్క చుట్టూ మట్టిలో వేస్తే... కీటకాలను తరిమేస్తాయి.

**కొబ్బరి పొట్టు:** వాతావరణంలో హెచ్చుతగ్గుల వల్ల ఒక్కోసారి మట్టి త్వరగా పొడిబారుతుంది. ఈ ఇబ్బంది లేకుండా ఉండేందుకు, అది సార వంతంగా మారేందుకు కొబ్బరి పొట్టుని మట్టి చుట్టూ మల్చింగ్ చేయాలి. దీనివల్ల కలుపు సమస్య కూడా రాదు. □



## తెలుసుకుందాం..

మన కేదైనా కష్టం వస్తే సాయం కోసమో, పరిష్కారం కోసమో స్నేహితులను ఆశ్రయిస్తాం. విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు సాయం చేస్తాం. పిల్లలు ప్రమాదంలో ఉన్నప్పు రక్షిఒచుకోవడానికి ముందుంటాం. అందుకు అవసరమైతే ఇతరుల మద్దతు కూడగట్టుకోకుండా ఈ ప్రవర్త ననే ఖిటెండ్ అండ్ బీఫ్రెండ్ఖి రెస్పాన్స్ అంటారట. ఇది ఆడవాళ్లలో ఉండే సహజ లక్షణం. దీనికి కారణం మనలోని హార్మోన్లే నట. □



# సెమీస్‌లోకి దూసుకెళ్లిన సాత్విక్, చిరాగ్ జోడీ

**ఢిల్లీ:** కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనే లక్ష్యం దిశగా భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఒక అడుగు ముందుకు వేసింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్ జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 26-24, 21-15తో మలేషియాకు చెందిన యెసిన్ ఓంగ్-ఈ యి టియో జోడీపై గెలిచింది. 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన



సాత్విక్, మహారా ష్ట్ర ప్లేయర్ చిరాగ్ తొలి గేమ్‌లో నాలుగు గేమ్ పాయింట్లు కాపాడు కోవడం విశేషం. రెండో గేమ్‌నూ భారత్ జోడీకి గట్టి పోటీ లభించింది. ఒకదశలో సాత్విక్-చిరాగ్ 8-11తో వెనుకబడ్డారు. కానీ భారత జంట ఇదే స్కోరు వద్ద వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 12-11తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత స్కోరు 12-12తో సమమైంది. ఈ దశలో సాత్విక్-చిరాగ్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 15-12తో ముందంజ వేశారు. అదే జోరులో గేమ్‌ను సొంతం చేసుకున్న సాత్విక్-చిరాగ్ వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.




# ప్రపంచ ఉత్తమ జావెలిన్‌గా నీరజ్

ఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా 2024 సంవత్సరానికి గానూ ప్రపంచ ఉత్తమ జావెలిన్ త్రోయర్‌గా ఎంపికయ్యాడు. అమెరికాకు చెందిన ప్రముఖ మేగజైన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్ ప్రకటించిన ర్యాంకింగ్స్ జాబితాలో నీరజ్‌కు అగ్రస్థానం దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన 27 ఏళ్ల నీరజ్ ఈ అత్యుతన్నత పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. 78 ఏళ్ల చరిత్ర కలిగిన ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్ మేగజైన్ ప్రపంచ ఉత్తమ ప్లేయర్లకు పురష్కారానికి ఎంపిక చేస్తుంది. ఇక 2024లో డైమండ్ లీగ్‌లో ఒక్క విజయం కూడా సాధించని నీరజ్, దోహా, లుసానే, బ్రస్సెల్స్ ఈవెంట్లలో రెండోస్థానంలో నిలిచాడు. ఫిన్లాండ్‌లో జరిగిన పావో నుర్మీ గేమ్స్‌లో నీరజ్ టైటిల్ సాధించాడు. రెండు సార్లు గ్రెనెడాకు చెందిన ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్‌తో పోటీపడి నీరజ్ ఈ జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన పీటర్స్, గత ఏడాది డైమండ్ లీగ్ మూడు ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. 2023లోనూ నీరజ్ ఈ జాబితాలో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. అగ్రస్థానం కోసం నీరజ్ చోప్రా, పీటర్స్ మధ్య గట్టి పోటీ సాగింది. గత ఏడాది నీరజ్ డైమండ్ లీగ్ టైటిల్ నెగ్గకపోయినా 3-2తో పీటర్స్పైఆధిక్యంలో నిలిచాడు. ఒలింపిక్ చాంపియన్, పాకిస్తాన్ త్రోయర్ అర్షద్ నదీమ్ ఐదోస్థానం దక్కిం చుకున్నాడు.



## మూడో వన్డేలో న్యూజిలాండ్ చిత్తు
### వైట్ వాష్ నుండి బయటపడిన శ్రీలంక

**ఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో 140 పరుగుల తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. అక్లాండ్ వేదికగా 2-0తో సిరీస్‌ను కైవసం చేస్తున్న న్యూజిలాండ్‌పై శనివారం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో శ్రీలంక పగ తీర్చుకుంది. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ వైట్ వాష్ నుంచి లంక తప్పించు కుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 290 పరుగుల భారీ స్కోర్ సాధించింది. శ్రీలంక బ్యాటర్లలో నిస్సాంక (66) టాప్ స్కోరర్‌గా నిలవగా, కుశాల్ మెండిస్ (54), లియాంగే (53), కమిందు మెండిస్ (46) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మాట్ హెన్రీ 4 వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ శాంట్నర్ రెండు, నాథన్ స్మిత్, బ్రెస్వెల్ తలా వికెట్ సాధించారు. అనంతరం 291 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను లంక బౌలర్లు ఆదిలోనే దెబ్బకొట్టారు. అసితా ఫెర్నాండో, తీక్షణ, మలింగ దాటికి న్యూజిలాండ్ కేవలం 22 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో మార్క్ చాప్మన్ న్యూజిలాండ్‌ను అదుకునే ప్రయత్నం చేశాడు. ఓ వైపు క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నప్పటికీ, చాప్మన్ మాత్రం బౌండరీలు బాదుతూ న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. లంకేయులపై కౌంటర్ ఎటాక్ దిగిన చాప్మన్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో లక్ష్య చేధనలో బ్లాక్ క్యాప్స్ 150 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ బ్యాటర్లలో చాప్మన్ (81 బంతు ల్లో 81 పరుగులు, 10 ఫోర్లు, ఒక సిక్స్) మినహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫమయ్యారు. లంక బౌర్లలో అసితా ఫెర్నాండో, తీక్షణ, మలింగ తలా 3 వికెట్లు సాధించారు. కాగా తొలి రెండు వన్డేల్లో విజయం సాధించిన న్యూజిలాండ్ సిరీస్‌ను 2-1 తేడాతో సొంతం చేసుకుంది.



# స్టార్‌లకు టెస్ట్

### రోహిత్, కోహ్లీకి లాస్ట్ ఛాన్స్.. షమీపై కొనసాగుతున్న సస్పెన్స్
### రిషబ్, రాహుల్ మధ్య రసవత్తర పోరు
### ఛాంపియన్స్ ట్రోఫీపై టీమిండియా సెలెక్టర్ల దృష్టి

**ఢిల్లీ:** అనూహ్య పరిణామాల నడుమ తీవ్ర వేదనను మిగిల్చిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న భారత క్రికెట్ జట్టు ఎదుట మరో కఠిన పరీక్ష ఎదురవుతోంది. త్వరలో పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతకంటే ముందే స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌తో పాటు, చాంపియన్స్ ట్రోఫీకీ నేడో రేపో సెలెక్టర్లు జట్టును ప్రకటించే అవకాశముంది. ఈ టోర్నీలో ఎవరిని ఆడించాలనేది సెలక్టర్లు ఇప్పుడు ప్లేయర్లకు కఠిన పరీక్ష పెడుతున్నారు. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతున్న సారథి రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని కొనసాగించడం, వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ ఫిట్‌నెస్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో వికెట్ కీపర్‌గా ఎవరు, సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తుది జట్టులో ఉంటాడా వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రెండేండ్ల క్రితం భారత్‌లో ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో అదిరిపోయే ఫామ్‌తో ఆకట్టుకుని, గతేడాది టీ20 ప్రపంచకప్‌లోనూ రాణించిన భారత స్టార్ బ్యాటర్లు రోహిత్, కోహ్లీ ఆ తర్వాత దారుణంగా విఫలమవుతున్నారు. ఇటీవల ముగిసిన ఆసీస్ సిరీస్ వారి వైఫల్యానికి పరాకాష్ట. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతూ సిడ్నీ టెస్టులో తనంత తానుగా తుది జట్టు నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి రోహిత్‌కు వచ్చింది. ఇందుకు కోహ్లీ కూడా మినహాయింపు కాదు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తినా, బీసీసీఐ మాత్రం ఈ ఇద్దరికీ ఆఖరి అవకాశం ఇచ్చేందుకు మొగ్గుచూపినట్లు సమాచారం. వన్డే ఫార్మాట్‌లో ఈ ద్వయానికి ఉన్న రికార్డులు, అనుభవం దృష్ట్యా వారిపై చర్యలేమీ ఉండబోవని, ఈ ఇద్దరూ చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

ఇక సీనియర్ ఆటగాళ్లైన రాహుల్, షమీ, జడేజా, రిషభ్, అక్షర్‌లో ఎవరిని తుది జట్టులో ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. వన్డే వరల్డ్ కప్‌లో రాహుల్, షమీ అంచనాలకు మించి రాణించారు. కానీ ఆ తర్వాత భారత్ ఆడిన ఆరు వన్డేలకూ షమీ దూరమయ్యాడు. ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో అయినా ఆడతాడనుకుంటే మోకాలి వాపు తిరగబెట్టడంతో అతడు మళ్లీ ఎన్‌సీఏకు వెళ్లాడు. అయితే ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న అతడి ఫిట్‌నెస్‌ను దగ్గర్నుంచి సమీక్షి స్తున్న బీసీసీఐ మెడికల్ టీమ్.. షమీకి క్లీన్‌చిట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో షమీని ఆడించనున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అంచనాలను అందుకోలేకపోయినా రాహుల్ మరీ చెత్త ప్రదర్శనలైతే నమోదు చేయలేదు. అయితే వికెట్ కీపర్ కోటాలో రాహుల్‌కు పంత్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. మరోవైపు పంత్ కూడా గొప్పగా రాణించింది లేదు. బ్యాటర్ కోటాలో అయితే రాహుల్‌కు అవకాశం లేకపోయినప్పటికీ వికెట్ కీపర్ కోటాలో మాత్రం అతడు పోటీలో ఉన్నాడు. ఈ ఇద్దరిలో సెలెక్టర్ల మొగ్గు ఎవరి వైపు అన్నది త్వరలో తేలనుంది. ఇక సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ జడేజా బ్యాటింగ్ వన్డేలలో అంత గొప్పగా ఏం లేదు. అతడి స్థానంలో అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కుల్దీప్ యాదవ్ ఫిట్‌గా లేకుంటే వాషింగ్టన్ సుందర్‌కు తలుపులు తెరుచుకున్నట్టే. ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన నితీశ్‌కుమార్ వైపు సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నట్టు బోర్డు వర్గాల సమాచారం.



### దక్షిణాఫ్రికా టీ20: ఉత్కంఠ పోరులో
## సూపర్ జెయింట్స్ హ్యాట్రిక్స్

**ఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్-2025లో డర్బన్ సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. కింగ్స్ మీడ్ వేదికగా ప్రిటోరియా క్యాపిటల్స్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో రెండు పరుగుల తేడాతో డర్బన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన డర్బన్ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోర్ సాధించింది. డర్బన్ బ్యాటర్లలో కేన్ విలియమ్సన్ (40 బంతుల్లో 60 పరుగులు, 3 ఫోర్లు , 2 సిక్సు) టాప్ స్కోరర్గా నిలవగా, ఓపెనర్ బ్రైస్ పార్సన్స్ (28 బంతుల్లో 47), ఫినిషర్ వియాన్ మల్డర్ (19 బంతుల్లో 45 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. విధ్వంసకర ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ మాత్రం తీవ్ర నిరాశపరిచాడు. క్లాసెన్ ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ప్రిటోరియా బౌలర్లలో ముత్తుసామి 3 వికెట్లు పడగొట్టగా, లివింగ్‌స్టోన్ ఒక్క వికెట్ సాధించాడు. అనంతరం 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ఓపెనర్లు రెహ్మానుల్లా గుర్బాజ్, విల్ జాక్స్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. వీరిద్దరూ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12 ఓవర్లలోనే 154 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. గుర్బాజ్ (43 బంతుల్లో 89 పరుగులు, 4 ఫోర్లు, 7 సిక్సు) తొలి వికెట్గా వెనుదిరిగాడు. ఆ తర్వాత సెటిల్ అయిన విల్ జాక్స్ (35 బంతుల్లో 64 పరుగులు, 3 ఫోర్లు, 5 సిక్సు) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో మ్యాచ్ డర్బన్ వైపు మలుపు తిరిగ పరుగులకు పరిమితమైంది. డర్బన్ బౌలర్లలో నూర్ ఆహ్మద్, క్రిస్ వోక్స్ తలా 2 వికెట్లు పడగొట్టగా, మహారాజ్, నవీన్ ఉల్‌హక్ చెరో వికెట్ సాధించారు. కాగా ఈ మ్యాచ్‌తోనే న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో అరంగేట్రం చేశాడు. కేన్ మామ డర్బన్ సూపర్ జెయింట్స్ తరపున తన అరంగేట్ర మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీతో మెరిశాడు. అయితే ఈ కివీ స్టార్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 మెగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. రూ. 2 కోట్ల కనీస ధరతో వచ్చిన విలియమ్స్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపకపోవడం విశేషం.

# బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ఇదే..

**న్యూఢిల్లీ, జనవరి 11:** కొత్త సంవత్సరం మొదటి నెల అంటే జనవరి నుండి రోజులు వేగంగా గడుస్తున్నాయి. దీంతో పాటు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న దేశ బడ్జెట్‌పై కూడా ఉత్కంఠ పెరుగుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి బడ్జెట్లో ఏం ప్రతి పాద నలు ఉంచారో అందరూ తెలుసుకోవాలనుకుంటున్నారు. అయితే ఈసారి ఆదాయపు పన్నులో మినహాయింపు ఉంటుందా, ద్రవ్యో ల్బణం తగ్గింపు దిశగా ఏమైనా చర్యలు తీసుకుంటారా? ఇవి ఎక్కువగా చర్చించబడుతున్న కొన్ని ప్రశ్నలు. ఇలా సంప్ర దాయంగా మారింది ప్రతి సంవత్సరం దేశ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ముందు ప్రభుత్వం ఆర్థిక సర్వేను పార్ల మెంట్‌లో ప్రవేశపెడుతుంది. దేశంలో ఆర్థిక సర్వే మొదటిసారిగా 1950-51లో ప్రవేశపెట్టారు, అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ సంప్రదాయం కొనసాకుతూనే ఉంది. ఆర్థిక సర్వే అంటే ఏమిటి, అది ఎందుకు ముఖ్యం అంటే, మీరు ఈ




**వాణిజ్యం**

ఆర్థిక సర్వేను ప్రభుత్వ నివేదికగా పరిగణిం చవచ్చు. ఇందులో గత ఆర్థిక సంవత్సరం పనితీరును సమీక్షి ంచడంతో పాటు, భవిష్యత్తులో వృద్ధి అవకాశాలపై అధికారిక రివ్యూ ఇస్తుంది. దీని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ తాజా స్థితి గురించి ప్రభుత్వం చెబు తుంది. ఆర్థికసర్వేలో ఏరంగం నుంచి ఎంత ఆదాయం వచ్చిందో, సవాళ్లు ఏంటో తెలుపుతుంది. ఆర్థిక పురోగతికి ఆటంకం కలిగించే అంశాలు ఏమిటి ఇంకా వాటిని ఎలా తొలగించవచ్చు, ఆర్థిక వ్యవస్థ పూర్తి వేగంతోనడవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ఈసర్వే హైలైట్ చేస్తుంది. ఆర్థిక సర్వేను బడ్జెట్‌కు ప్రధాన ఆధారం అని కూడా అంటా రు. సామాన్యుల దృష్టినుంచి మాట్లా డితే, ఆర్థికసర్వే అనేది ద్రవ్యోల్బణం ఇంకా నిరుద్యోగం వంటి ముఖ్యమైన గణాంకాల గురించి సమాచారాన్ని అందిస్తుంది. పెట్టుబడి, పొదుపు, ఖర్చుల గురించి కూడా మీకు ఒక ఆలోచన వస్తుంది. పెట్టుబడిదారులకు ఆసక్తి కలిగించే విషయం పెట్టుబడిదారుల దృష్టిలో ఈ సర్వే చాలా ప్రయోజనకరంగా ఉంది. ఏయే ప్రాంతాల్లో మంచి పెట్టుబడి అవకాశాలు ఉన్నాయో అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

# 18% పెరుగుతున్న ఆపిల్ సిఇఒ వేతనం

**వాషింగ్టన్, జనవరి 11:** ప్రముఖ టెక్ కంపెనీ ఆపిల్ (టిమ్ కుక్) సీఈఓ టిమ్ కుక్ వార్షిక వేతనాన్ని 18 శాతం పెంచుతూ కంపెనీ నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆయనకు 74.6 మిలియన్ డాలర్ల వేతనం ప్రకటించింది బ్లూంబర్గ్ తన నివేదికలో ఈఏడాది ఫిబ్రవరి 25న జరగబోయే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు యాపిల్ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సమావేశంలో కుక్ జీతంతో సహా పలు ప్రతిపాదనలను వాటాదారుల ముందుంచ నుంది. అక్కడ వాటా దారులకు ఓటింగ్ నిర్వహించి పెంపును అమలు చేయనున్నారు. 2024 సంవత్సరానికిగానూ టిమ్‌కుక్ వేతనం స్టాక్ అవార్డ్స్‌తో పాటు 74.6 మిలియన్ డాలర్లు (రూ.643 కోట్లు) అందించిన యాపిల్ నిర్ణయించింది. అంతకుముందు ఏడాదిలో 63.2 మిలియన్ డాలర్లు (రూ.544 కోట్లు)తో ఈ మొత్తం 18 శాతం ఎక్కువ. కుక్ మొత్తం జీతంలో 3 మిలియన్ డాలర్ల బేసిక్ పే, 58.1 మిలియన్ డాలర్ల స్టాక్ అవార్డులు, దాదాపు 13.5 మిలియన్ డాలర్ల అదనపు పరిహారం అందుకోనున్నారు. కుక్ వేతనం 2023 కంటే



పెరిగినప్పటికీ 202లో అందుకున్న మొత్తం పరిహారంతో ఈసారి చాలా తక్కువ ఉద్యోగులు, వాటాదారుల వేతనాలకు సంబంధించి సంస్థగత వాటాదారుల నుంచి 2023లో యాపిలక్కు తీవ్ర ఒత్తిడి ఎదురైంది. దీనితో తన వేతనాన్ని తగ్గించాలని టిమ్కుక్ స్వయంగా కోరడంతో ఆ ఏడాదిలో వేతనాన్ని తగ్గించిన విషయం తెలిసిందే.

# యుఎస్ కోర్టుకు ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్

**వాషింగ్టన్, జనవరి 11:** ప్రస్తుతం భారతదేశంలోని ఐటీ కంపెనీల వ్యాపారం తిరిగి గాడిన పడుతోంది. ఈ క్రమంలో టెక్ దిగ్గజాల మధ్య యుద్ధం కూడా జరుగుతోంది. టాప్ టెక్ కంపెనీలుగా ఉన్న ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ మధ్య ప్రస్తుతం మ్యాటర్ సీరియస్ అయ్యింది. అవును దేశంలోని రెండవ అతిపెద్ద టెక్ కంపెనీగా ఉన్న ఇన్ఫోసిస్ కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ పై ఆరోపణలు చేస్తూ కౌంటర్ లా సూట్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఇన్ఫోసిస్ తన హెల్త్ కేర్ ఫ్లాట్ ఫారమ్ హెలిక్స్ లాంట్ ఆలస్యం కావటానికి రవికుమార్ కారణంగా పేర్కొంది. టెక్సాల్‌లోని యూఎస్ ఫెడరల్ కోర్టులో ఈమేరకు జనవరి 9న కంపెనీ కేసు ఫైల్ చేసింది. ఇందులో రవి కుమార్ వ్యాపార రహస్యాలను కావాలనే దుర్వినియోగం చేశారని, సీనియర్ ఎగ్జిక్యూటివి స్థాయిలో ఉన్నప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా కీలక ప్రాజెక్టులను వాయిదా వేసినట్లు పేర్కొంది. ఇన్ఫోసిస్‌లో మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రవి కుమార్.. ఇన్ఫోసిస్‌లో తన పదవీకాలంలో కాగ్నిజెంట్‌కు మారడానికి చర్చలు జరుపుతున్నప్పుడు హెల్త్ కేర్ ప్రాజెక్టుకు వనరులను నిలిపి వేయడం ద్వారా హెలిక్స్ అభివృద్ధిని అడ్డుకున్నాడంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. దీనివల్ల ప్రాజెక్టు దాదాపు 18 నెలలు ఆలస్యం అయిందని పేర్కొంది. ఇన్ఫోసిస్ హెలిక్స్ ప్రారంభాన్ని ఆపడానికి కాగ్నిజెంట్ పోటీ వ్యతిరేక పథకంలో ఇన్ఫోసిస్ హెలిక్స్‌కు బాధ్యత వహించే కీలక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నియమించుకున్నట్లు టెక్ దిగ్గజం తన దావాలో పేర్కొంది. వాస్తవానికి తాజా కౌటర్ ఆగస్టు 2022లో కాగ్నిజెంట్ తన ట్రైజెట్టో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్‌తో ముడిపడి ఉన్న వాణిజ్య రహస్యాలను దొంగిలించిందని ఆరోపిస్తూ ఇన్ఫోసిస్‌పై దావా వేసిన తర్వాత వచ్చింది. అయితే ఈ ఆరోపణలను అప్పట్లో ఇన్ఫోసిస్ కంపెనీ ఖండించిన సంగతి తెలిసిందే. అలాగే కాగ్నిజెంట్ ప్రవర్తన హెల్త్‌కేర్ ఐటీ సేవల కొనుగోలుదారులకు ఎంపికలను పరిమితం చేయడం ద్వారా పోటీని అణచివేసిందని భారతీయ టెక్ దిగ్గజం వాదిస్తోంది. వాస్తవానికి కాగ్నిజెంట్ భారతీయ టెక్ కంపెనీల్లోని ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్ లను నియమించుకోవటం చాలా ఆరోపణలకు దారితీసిన సంగతి తెలిసిందే.




# బడ్జెట్‌లో మహిళలకు మరింత ప్రాధాన్యం !

**న్యూఢిల్లీ, జనవరి 11:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యం లోని ఎన్ డీఏ మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టింది. ఇటీవల జరిగిన ఎన్నికలో ఆ కూటమి విజయం సాధించడానికి మహిళా ఓట్లు ఎంతో కీలకంగా మారాయి. మునుపటి బడ్జెట్లలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు అత్యధికంగా నిధులు కేటాయించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో మహి ళల ఓట్లు గణనీయంగా పెరిగి, 2024లో ఎన్‌డీఏ విజయానికి పునాదిగా నిలిచాయి. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో కూడా మహిళలకు ప్రాధాన్యం ఇస్తారని భావిస్తున్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2019లో పోల్చితే 18 మిలి యన్ల మంది మహిళలు ఓటింగ్ లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆదాయ బదిలీ పథకాలు, అక్షరాస్యత కార్యక్రమాలు, ముద్ర యోజన రుణాలు, పారిశుధ్య కార్యక్రమాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇంటి యాజమాన్యం వంటి మహిళా ప్రాధాన్య కార్యక్రమాల వల్ల ఎన్ డీఏ ప్రభుత్వంపై మహిళలకు నమ్మకం ఏర్పడింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.